
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
8-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 128 పేజీలు: 8+4 వెల: 6.50


ఉమన్స్ ర్యాపిడ్ చెస్ టోర్నీ ఛాంపియన్‌గా వైశాలి
రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు -'ఆట'లో

## రేపు తిరుపతిలో ఎన్‌డియే సభ
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజా దర్బార్
హాజరుకానున్న సిఎం చంద్రబాబు, జనసేనాని పవన్, బిజెపి చీఫ్ మాధవ్ 3లో

## గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీస్
108 రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం 3లో


## పశ్చిమ గోదావరి జిల్లాలో నేడు సిఎం పర్యటన
సిద్ధాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ 2లో


మాస్కోలో ఆదివారం గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేష్

## నెల్లూరులో నియోడైమియం మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం
గిరెడ్మెట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ
ఎపికి సాంకేతిక భాగస్వామ్యం అవసరం
మాస్కో అణుశక్తి మ్యూజియం సందర్శన

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రష్యాకు చెందిన ప్రముఖ రేర్ ఎర్త్ మినరల్స్ సంస్థ గిరెడ్మెట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాస్కోలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారతదేశానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు గిరెడ్మెట్ వంటి సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యం భవిష్యత్తులో విలువైన అవకాశాలను తెరుస్తుంది. విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఉన్న భారీ ఖనిజ వనరులను ఆధారంగా డీప్ ప్రాసెసింగ్ రేర్ ఎర్త్ ఎలిమెంట్ రిఫైనింగ్‌హబ్‌ను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించండి. భారతదేశంలో విస్తరిస్తున్న ఇవి, పవన విద్యుత్ మార్కెట్లకు సరఫరా చేయడానికి, గిరెడ్‌మెట్ ప్రాసెసింగ్ టెక్నాలజీని ఉపయోగించి, నెల్లూరులో ఫుల్ సైకిల్ >>2

# నిధుల కొరత లేదు
## నిర్ణీత కాలంలో ప్రాజెక్టులు పూర్తి
సాస్కీ, పూర్వోదయ ద్వారా అభివృద్ధి పనులు
15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా కార్యాచరణ
పోలవరం, అమరావతి పూర్తయితే సంపద సృష్టి
జులై 1 నుంచి విబి జి రామ్ జి అమలు
మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం చంద్రబాబు


డబుల్ ఇంజన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
కూటమి నేతలతో సిఎం 2లో

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రో స్థాయిలో ప్రణాళికలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తి స్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థికశాఖకు సూచించామన్నారు. 15శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలే చేయాలనే నిర్ణయంతో ఉన్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మీడియాతో చంద్రబాబు ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ రాష్ట్రంలో నీరు, విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామనిఅన్నారు. రాష్ట్రంలో ఉత్పాదకత పెంపుదిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ చార్జీలు పెంచలేదని అన్నారు. గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖల రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సిఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రాధన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.
పూర్వోదయ సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్‌కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు వివరించారు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. పేదలకు అన్నంపెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయంగా మూసివేశారని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపే రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాంకానీ ఇప్పుడు గేర్‌మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నామన్నారు. నాడు ఒక్క ఐటీనే యువత తల రాత మార్చిందని గుర్తు చేశారు. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు >>2




## గ్రీన్ కార్డ్ ఆశావహులకు శుభవార్త
ట్రంప్ ఆదేశాలు చట్టవిరుద్ధం
యుఎస్‌సిఐఎస్ విధానాలు సరికాదు
ఫెడరల్ కోర్టు కొట్టివేత... కీలక తీర్పు
దరఖాస్తుదారులకు ఊరట

**వాషింగ్టన్, జూన్ 7:** అమెరికా గ్రీన్ కార్డు కోసం కలలు కంటున్న ఆశావహులకు శుభవార్త. దాదాపు 39 దేశాలకు చెందిన వలసదారుల గ్రీన్ కార్డ్‌లు, వర్క్ పర్మిట్‌లు, ఆశ్రయం, పౌరసత్వ దరఖాస్తుల ప్రక్రియను నిలిపివేస్తూ ట్రంప్ ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టిన కఠినమైన విధానాలను ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. పూర్తి లేదా పాక్షిక ప్రయాణ నిషేధాల కింద >>2


## యోగాభ్యాసంతోనే సంపూర్ణ ఆరోగ్యం
రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు
విజయవాడలో పోలీసుల ఆధ్వర్యంలో యోగాసనాలు
హోంమంత్రి అనిత, సిపి రాజశేఖర్ బాబు హాజరు
లేపాక్షిలో యోగా శిక్షణా తరగతులు ప్రారంభం
మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత హాజరు


ఆదివారం విజయవాడలో యోగాసనాలు చేస్తున్న హోంమంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** యోగా మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. యోగా మనిషి ఆలోచన విధానంలో ప్రయోజనకర మార్పులు తీసుకుని వస్తుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల ఆదివారం నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందిన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్‌టిఆర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బిఆర్‌టిఎస్ రోడ్డు వద్ద పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంచడానికి నగర పోలీస్ కమిషనర్ వి.రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోంమంత్రి అనిత హాజరయ్యారు. పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 5000 మంది పాల్గొని యోగాసనాలు చేసారు..
ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలనే సకల్పంతో యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో వేల యేళ్ల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకి అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 150కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. యోగాకు ప్రత్యేక ఖర్చులు అవసరం లేదని, పేదవాడు నుంచి ధనికుడి వరకు ప్రతి ఒక్కరూ కేవలం ఒక మ్యాట్‌తో యోగాను అభ్యసించవ్చని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు >>2



## వంటింట్లో గ్యాస్ మంట!
సిలిండర్ ధర పెంపు
రూ. 29 పెంచిన ఒఎంసిలు 5లో
పెంపుపై ఖర్గే మండిపాటు
సమర్థించుకున్న కేంద్రం




# ఎల్ నినో మొదలైంది!
● పసిఫిక్‌లో పరిమితి దాటిన ఉష్ణోగ్రతలు ● గాడ్జిల్లా ఎల్ నినో రికార్డులను బద్దలు కొట్టొచ్చు ● ప్రమాదంలో పడ్డ నైరుతి రుతుపవనాలు ● ఇప్పటికే రుతుపవనాల రాక ఆలస్యం ● అత్యంత బలమైన ఎల్ నినోగా మారొచ్చు ● యూరోపియన్ వాతావరణ నిపుణుల అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రతి జూన్‌లో, భారతదేశం అదే శబ్దం కోసం ఎదురుచూస్తుంది. రేకుల పైకప్పుపై పడే మొదటి భారీ చినుకుల శబ్దం. వేల సంవత్సరాలుగా వస్తున్న విధంగానే రుతుపవనాల రాక. ఒక కొత్త అంచనా ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం పసిఫిక్ మహా సముద్రంలో వస్తున్న ఒక పెద్ద మార్పు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్(ఇసిఎండబ్ల్యూఎఫ్) తాజా నివేదిక ప్రకారం ఉష్ణ మండల పసిఫిక్ మహా సముద్రం అధికారికంగా ఎల్ నినో ప్రారంభాన్ని సూచించే కీలకమైన ఉష్ణోగ్రత పరిమితిని దాటింది. పసిఫిక్ మహాసముద్రంలో ఇప్పుడు రూపుదిద్దుకుంటున్న ఎల్ నినో, ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైనదిగా మారవచ్చు. సినిమాల నుండి తీసుకున్న 'గాడ్జిల్లా ఎల్ నినో' అనే మారుపేరు దీనికి ఇప్పటికే వచ్చింది. నైరుతి రుతుపవనాలు, కనీసం, వచ్చేశాయి. అవి మూడు రోజులు ఆలస్యంగా, జూన్ 4న కేరళ తీరాన్ని చేరుకుని, ఇప్పుడు ఉత్తరం వైపు నెమ్మదిగా కదులుతున్నాయి. ఎల్ నినోను కచ్చితంగా అంచనా వేయడం కష్టం. శాస్త్రవేత్తలు అత్యంత నిశితంగా గమనించే జలభాగం, ఎల్ నినో పరిస్థితులను నిర్వచించే గీతను దాటి ఇప్పటికే వేడెక్కింది. యూరోపియన్ వాతావరణ నిపుణులు ఇది మరింత బలపడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థలు ఇప్పుడు అధికారికంగా ఎల్ నినో ఆరంభాన్ని ప్రకటించాయి, సెప్టెంబర్ నాటికి పరిస్థితులు గణనీయంగా బలపడతాయని భావిస్తున్నారు. భారత వాతావరణ శాఖ ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతాన్ని ఇప్పటికే అంచనా వేసింది. ఆశించిన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతంగా ఉంటుందని తెలిపింది.

**ఎల్ నినో అంటే ఏమిటి?:**
ఎల్ నినో అనేది ఎల్ నినో సదరన్ ఆసిలేషన్ (ఇఎన్‌ఎస్‌ఒ) అని పిలువబడే ఒక భారీ వాతావరణ డోలనంలో ఒక భాగం. ఉష్ణమండల పసిఫిక్‌ను ఒక ఊయలలా ఊహించుకోండి. ఒక వైపు వెచ్చని దశ, ఎల్ నినో. మరో వైపు చల్లని దశ, లా నినా. సాధారణంగా, వాణిజ్య పవనాలు అని పిలువబడే స్థిరమైన గాలులు వెచ్చని ఉపరితల నీటిని పసిఫిక్ మీదుగా ఆసియా వైపు నెడతాయి. ఎల్ నినో సమయంలో, ఆ గాలులు బలహీనపడతాయి. వెచ్చని నీరు తిరిగి తూర్పు వైపుకు జారుతుంది. సముద్రం తన వేడిని నిల్వ చేసుకునే ప్రదేశాన్ని మార్చుకుంటుంది. శాస్త్రవేత్తలు దీనిని మధ్య పసిఫిక్‌లోని నినో 3.4 ప్రాంతం అని పిలువబడే ఒక ప్రదేశంలో పర్యవేక్షిస్తారు. అక్కడ వారపు ఉష్ణోగ్రతలు ఇప్పటికే సాధారణం కంటే సుమారు 0.9 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా పెరిగాయి, ఇది ఎల్ నినోను సూచించే 0.5డిగ్రీల >>2

## అటు ఎండలు ఇటు వానలు
**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఒక పక్క ఎండలు,మరొక పక్క ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం కొనసాగుతుంది.ఆదివారం ప్రకాశం జిల్లా కారేడులో 43.5 డిగ్రీలు, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 43.4, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం,కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 43.2, పల్నాడుజిల్లా పిడుగురాళ్లలో 43.1, కోనసీమ జిల్లా రామచంద్రాపురం, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 42.7, తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెం, ఏలూరు జిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, గుంటూరు జిల్లా పాండ్రపాడు, నెల్లూరు జిల్లా గూడూరులో 42.6, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. .ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కర్ణాటక పరిసర ప్రాంతాల నుండి కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో సోమ, మంగళవారాల్లో అల్లూరి, పోలవరం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో >>2

# ఆశావహులకు శుభవార్త

>> ఉన్న 39 దేశాల జాతీయుల ఆశ్రయం, పని అనుమతి, గ్రీన్ కార్డ్, పౌరసత్వ దరఖాస్తులను నిలిపివేసిన లేదా ఆలస్యం చేసిన నాలుగు యుఎస్‌సిఐఎస్ విధానాలను కొట్టివేశారు. ఆ ఏజెన్సీకి చట్టబద్ధమైన అధికారంలేదని, వలస, పరిపాలనా చట్టాలను ఉల్లంఘించిందని, వలస వ్యతిరేక భావాలను కప్పిపుచ్చే 'సాకు'గా జాతీయ భద్రతా ఆందోళనలపై ఆధారపడిందని రోడ్ ఐలాండ్‌లోని ఫెడరల్ కోర్టు చీఫ్ జడ్జి జాన్ మెక్‌కానెల్ కీలక తీర్పునిచ్చారు. ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చిన ఈ నిబంధనల వల్ల ఎంతో మంది వలసదారుల జీవితాలు చట్టపరమైన సందిగ్ధతలో పడిపోయాయని న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు. యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) తన పరిధినిదాటి, చట్ట విరుద్ధంగా దరఖాస్తులను నిలిపివేసిందని కోర్టు పేర్కొంది. దరఖాస్తుదారులు అందరూ అమెరికా కాంగ్రెస్ రూపొందించిన చట్టా లను, నిబంధనలను సరిగ్గా పాటించినప్పటికీ కేవలం వారుపుట్టినదేశాల ఆధారంగా వారి ప్రక్రియను నిలిపివేయడం ఏమాత్రం సమర్థ నీయం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ కోర్టు తీర్పుతో గత కొంతకాలంగా నిలిచిపోయిన గ్రీన్ కార్డ్, వర్క్ పర్మిట్ దరఖాస్తుల పునఃపరిశీలన ప్రక్రియ మళ్లీ ప్రారంభం కానుంది. ముఖ్యంగా ఆయా దేశాల నుండి వచ్చి చట్టబద్ధమైన నివాసం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది విదేశీయులకు, వారిపై ఆధారపడిన కుటుంబాలకు ఈ నిర్ణయం ఎనలేని ఊరటనిచ్చింది. ఫెడరల్ కోర్టు తీర్పు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారికంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. డిహెచ్‌ఎస్ జనరల్ కౌన్సెల్ జేమ్స్ పెర్సివాల్ బహిరంగ వ్యాఖ్యలలో ఈ తీర్పును విమర్శించారు, అయితే పరిపాలనకు ఫస్ట్ సర్క్యూట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ట్రంప్ హయాంలోని ఇలాంటి వలస చర్యలను ఈ సర్క్యూట్ గతంలో కూడా విమర్శించిందని వలసదారుల హక్కుల కార్యకర్తలు పేర్కొన్నారు.

# పుట్టపర్తిలో వెనిజులా అధ్యక్షురాలు

## విద్యా సంస్థలను సందర్శించిన డెల్సీ రోడ్రిగెస్

**పుట్టపర్తి టౌన్, జూన్ 7, ప్రభాతవార్త:** పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా నిలకొల్పిన విద్యాసంస్థలను వెనిజులా బొలివేరియన్ రిపబ్లిక్ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సి రోడ్రిగెస్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు సత్య సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్శనలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఆమెను వెంట తీసుకువెళ్లారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ బి. రాఘవేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీకాంత్ ఖన్నా మరియు ఇతర సీనియర్ అధికారులు ఆమెకు సంస్థ అభివృద్ధి, విద్యా విధానం మరియు పరిశోధనా కార్యక్రమాలపై సమగ్ర వివరణ అందించారు. సత్యసాయి విద్యాసంస్థలు అనుసరిస్తున్న విలువల ఆధారిత సమగ్ర విద్యా విధానం, పరిశోధనల్లో సాధించిన పురోగతి, విద్యా నాణ్యత మరియు సమాజంపై చూపుతున్న ప్రభావంపై ప్రతినిధుల బృందాలకి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా డెల్సీ రోడ్రిగెస్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థను సందర్శించే అవకాశం కలిగినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా స్థాపించిన విలువల ఆధారిత విద్యాతత్వాన్ని ఆమె ప్రశంసించారు. ప్రపంచ విద్యా వ్యవస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో మానవత విలువలతో కూడిన విద్య ఎంతో వసరమని ఆమె అభిప్రాయపడ్డారు. వ్యక్తిత్వ వికాసం మరియు విద్యా ప్రావీణ్యాన్ని సమన్వయం చేయడంలో శ్రీ సత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ సాధించిన విజయాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. విద్య, సేవ మరియు మానవ శ్రేష్ఠతను కలిపిన ఈ మోడల్ సమాజంపై చూపుతున్న సానుకూల ప్రభావాన్ని ఆమె గుర్తించారు. ఈ సందర్శన పరస్పర ఆలోచనల మార్పిడికి, విద్యా సహకార అవకాశాలకు దోహదపడిందని అధికారులు పేర్కొన్నారు.

# లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన కర్ణాటక న్యాయమూర్తులు

**లేపాక్షి, జూన్ 7 ప్రభాతవార్త:** లేపాక్షి మండల కేంద్రంలోని చారిత్రాత్మక నేపథ్యం కలిగిన శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం కర్ణాటక న్యాయమూర్తులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్ర పరిపాలనా ట్రిబ్యునల్ (బెంగళూరు) అఫీషియేటింగ్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ ప్రభాకర్ శాస్త్రి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంజునాథ్ విడివిడిగా ఆలయానికి విచ్చేసారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసకుమార్ వారికి ప్రత్యేక అర్చనలుచేసి ఆశీర్వచనాలు అందించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎం.హెచ్. నరసింహమూర్తి స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా సత్కరించారు.

**అన్నప్రసాద వితరణపై ప్రశంసలు :**

న్యాయమూర్తులు ఇరువురు వీరభద్ర అన్నప్రసాదం సేవా ట్రస్ట్‌ను సందర్శించారు. అక్కడ భక్తులకు జరుగుతున్న అన్నదాన వినియోగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రస్టు సభ్యులు నిరంతరాయంగా అందిస్తున్న సేవలను, నాణ్యమైన అన్నప్రసాదం వితరణను ఈ సందర్భంగా వారు ఎంతగానో కొనియాడారు.

# జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీల రద్దు

## - పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ నాయకత్వంలో క్రమశిక్షణ లోపించడం, పార్టీ విధి విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ మద్దతుదారులు, జనసైనికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. జనసేన సిద్ధాంతాలు, విధానాలకు ఆకర్షితులై పార్టీని బలోపేతం చేశామని, అయితే కొందరు నాయకుల ప్రవర్తన ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు.నడవదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ వివరించారు.

కొద్ది రోజుల క్రితం ఉమ్మడి ప్రకాశం జిల్లా కమిటీని కూడా ఇదే కారణాలతో రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో నాయకుల మధ్య విభేదాలు, సమన్వయ లోపం, క్రమశిక్షణరాహిత్యం కారణంగా పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో పార్టీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, నగర, మండల, గ్రామస్థాయి కమిటీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే జిల్లా సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న వారితో పాటు కమిటీల్లోని ఇతర సభ్యులను కూడా తమ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.క్రమశిక్షణ లేని చోట పార్టీ వ్యవస్థ సక్రమంగా కొత్త కమిటీ నియామకం జరిగే వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ వ్యవహారాలను జనసేన కేంద్ర కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించారు.

# నిధుల కొరత లేదు

>> వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయని పేర్కొన్నారు. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని, ఎంఒయులన్నీ పూర్తయితే ఇది సాధ్యమేనని చంద్రబాబు అన్నారు. ఏ ఆలోచన చేసినా, ఏ సంస్కరణ చేసినా యువత కోసమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. సాధారణ రైతు బిడ్డ నుంచి ప్రతిఒక్కరికి ఐటీ రంగంలో అవకాశాలు వచ్చాయన్నారు. ఐటి రంగంలో మన బిడ్డలు సాధించిన విజయాలు చూస్తే ఆనందంగా ఉందన్న చంద్రబాబు, నాటి విజన్ 2020, నేటి స్వర్ణాంధ్ర 2047 యువత కోసమేనన్నారు. యువగళంలో ఇచ్చిన హామీల కంటే అధికంగా అమలు చేస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం పలు మార్పులను చేస్తూ తీసుకొచ్చిన విబి జి రామ్ జి పథకాన్ని ఎపిలో ఈ యేడాది జులై ఒకటో తేదీ నుండి అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు.

**సంవత్సరానికి అదనంగా రూ.7,675 ఆదాయం:**

విబి జి రామ్ జి అమల్లోకి రావడం వల్ల ప్రస్తుతం ఉన్న ఉపాధి హామీ కార్యక్రమం నిలిచిపోతుంది. ఈ నూతన కార్యక్రమంలో 100 రోజుల ఉపాధి 125 రోజులకు పెరుగుతుంది. దాంతో గ్రామీణ కుటుంబాలకు అదనంగా మరో 25 రోజుల పని చేకూరినట్లవుతుంది. ఎపిలో సగటు కూలీ రూ.307గా గణిస్తే ప్రతి ఏడాదికి రూ.7,675 వరకు ఆదాయంగా వృద్ధి నమోదవుతుందని ప్రభుత్వం లెక్కించింది. నూతన చట్టం ప్రకారం పరిశీలిస్తే ఉపాధి మొత్తాల చెల్లింపు ప్రక్రియను కేవలం వారం రోజుల్లోనే పూర్తి చేయాలి. ఒకవేళ 15 రోజులకు మించి చెల్లింపు ఆలస్యమైతే ఆ మొత్తంపై 0.5శాతం వడ్డీని సైతం కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

విబి జిరామ్ జి పథకం కింద రూ.10 వేల కోట్లు ఎపికి కేటాయించారు. కొత్త పథకంలో కేంద్రం, రాష్ట్రం 60:40 నిష్పత్తిలో ఖర్చులను భరించాలి. వ్యవసాయ సీజన్‌లో 60 రోజులు ఈ పథకంలో ఉపాధికి సెలవు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకునే అధికారాన్ని అన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

# సంపూర్ణ ఆరోగ్యం



ఆదివారం లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో యోగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు సత్యకుమార్, సవిత

>> సాగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

**లేపాక్షిలో ఘనంగా ప్రారంభమైన యోగా శిక్షణా తరగతులు**

ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో ఆదివారం యోగా శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత, జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డ్వామా పిడి నరసయ్య, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చక్రపాణి, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్యలతో పాటు జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. యోగా మాస్టర్ శ్రీనివాసరెడ్డి యోగా శిక్షణను ప్రారంభించారు. దాదాపు గంటకు పైగా సాగిన యోగా కార్యక్రమంలో అధికారులు, జవహర్ నవోదయ విద్యార్థులు యోగాభ్యాసం చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ జిల్లాస్థాయి యోగా శిక్షణా కార్యక్రమాన్ని లేపాక్షి వీరభద్రాలయం ప్రాంగణంలో ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. యోగాను జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. యోగాతో శరీర రుగ్మతలను దూరం చేయవచ్చన్నారు. ఆనందమయ జీవితానికి యోగ ఎంతో ఉపయోగకారిగా ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపుమేరకు జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ప్రతి వ్యక్తి రోజు ఉదయం అరగంట యోగా చేస్తే మానసిక, శారీరక ప్రశాంతత చేకూరుతుందన్నారు. విద్యార్థులు యోగాభ్యాసాన్ని మరువరాదన్నారు. యోగాతో ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ యోగా రోజు అభ్యసించడం వల్ల నిత్య యవ్వనంగా ఉండవచ్చున్నారు. యోగా వల్ల విద్యార్థులకు ఏకాగ్రత కుదురుతుందన్నారు.

ప్రతిరోజు యోగా చేయడం వల్లనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ యోగ భారతదేశ వారసత్వ సంపద అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ కృషితో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. 177 దేశాలకు యోగాను పరిచయం చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోడీకి దక్కిందన్నారు. యోగ సాధన వల్ల బిపి, డయాబెటిస్ వంటి రోగాలు దరిచేరమన్నారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. వాటి వల్ల విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకుంటారని మంత్రి తెలిపారు. అనంతరం మంత్రులు యోగాలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈనెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని మంత్రులు పిలుపునిచ్చారు.

# ఎల్‌నినో మొదలైంది!

>> స్థాయిని దాటింది.

**ఎల్ నినో ఎంత బలపడుతుంది?:**

ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ అయిన ప్రపంచ వాతావరణ సంస్థ, ఎల్ నినో ఆరంభాన్ని అధికారికంగా ధ్రువీకరించింది. ఈ వేడెక్కడం దాని గమనాన్ని కొనసాగిస్తున్నందున, 2026 మిగిలిన కాలమంతా ఈ సంఘటన బలపడేందుకు 80 నుండి 90 శాతం సంభావ్యత ఉందని ఆ సంస్థ ఇప్పుడు అంచనా వేస్తోంది. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ అంచనా ప్రకారం, నినో 3.4 ప్రాంతం డిసెంబర్ నాటికి సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది, కొన్ని అంచనాలు 4 డిగ్రీల సెల్సియస్‌ను కూడా తాకుతున్నాయి. అది 1997-1998, 2015-2016 సంవత్సరాల ఉమ్మడి రికార్డులను అధిగమిస్తుంది. గత ఎల్ నినో కారణంగా 2024 సంవత్సరం, ఇప్పటివరకు నమోదైన అత్యంత వేడి సంవత్సరంగా నిలిచింది.

**భారత వ్యవసాయ రంగంపై పెనుప్రభావం**

భారతదేశానికి, ఎల్ నినో సాధారణంగా ఒకే విషయాన్ని సూచిస్తుంది. బలహీనమైన రుతుపవనాలు. దానికి కారణం సముద్రంపై ఉన్న గాలిలో ఉంది. పసిఫిక్ మహాసముద్రం వేడెక్కినప్పుడు, ఈ ప్రాంతానికి నీరందించే పైకి లేచే గాలి, భారీ వర్షాల పట్టీ భారతదేశానికి దూరంగా తూర్పు వైపుకు కదులుతుంది. రుతుపవన గాలులు వాటి వేగాన్ని కొంత కోల్పోతాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసింది. 1971 నుండి 2020 మధ్య 50 సంవత్సరాల వర్షపాత డేటా ఆధారంగా తీసుకున్న దీర్ఘకాలిక సగటు (లాంగ్ పీరియడ్ యావరేజ్)లో ఇది సుమారు 90 శాతంగా ఉంటుంది. వర్షపాతం లోటుగా ఉండే సీజన్‌కు 60 శాతం అవకాశం ఉందని అది పేర్కొంది.

కొన్నిసార్లు బలహీనపడుతున్న రుతుపవనాలను కాపాడగల ఒక ప్రత్యేక సముద్ర నమూనా అయిన ఇండియన్ ఓషన్ డైపోల్, ఈ సంవత్సరం తటస్థంగా ఉంటుందని అంచనా. రుతుపవనాలు కేవలం వాతావరణం మాత్రమే కాదు. భారతదేశ వార్షిక వర్షపాతంలో సుమారు 70 శాతాన్ని ఇది అందిస్తుంది. దేశంలోని సగానికి పైగా వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యం లేదు. 2015 నుండి 2016 వరకు వచ్చిన చివరి పెద్ద ఎల్ నినో సమయంలో, భారతదేశం తన సగటు వర్షపాతంలో కేవలం 86శాతాన్ని మాత్రమే పొంది కరువులోకి జారిపోయింది. దాదాపు 60 శాతం మంది రైతులు తమ వేసవి పంటల కోసం ఈ వర్షాలపై ఆధారపడి ఉన్నందున, బలహీనమైన రుతుపవనాల ప్రభావం మొదట నేలలో, ఆ తర్వాత వెంటనే ఆహార ధరలలో కనిపిస్తుంది. ఒక పూట భోజనం ధరను ఇప్పటికీ వర్షాలే నిర్ణయించే దేశానికి, బలహీనమైన రుతుపవనాల ప్రభావం కేవలం చార్టులోని ఒక సంఖ్య మాత్రమే కాదు. అది ఒక మంచి సంవత్సరానికి, ఒక కష్టమైన సంవత్సరానికి మధ్య ఉన్న తేడా.

# అటు ఎండలు ఇటు వానలు

>> కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే మిగతా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ..తేలికపాటి వర్షాలు.. కురిసే అవకాశం ఉందని తెలిపారుఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంబాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ, వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు.

## వారం - వర్జ్యం

08-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
అష్టమి రా.3.22, శతభిష ఉ.9.07
వర్జ్యం : మ.3.38-సా.5.16
దు.మ.12.02-మ.1.24,
(2) మ.3.09-సా.4.01
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** స్థిరాస్థి వివాదాలు, కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు అవుతాయి.

**వృషభం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంబంధ బాంధవ్యాలు మెరుగుపడుతాయి. వాహన సౌఖ్యం.

**మిథునం:** వివాదాలకు దూరంగా ఉండండి. అనుకున్న అవకాశాలు శ్రమించడం వలన కలిసి వస్తాయి.

**కర్కాటకం:** అందరిలోనూ ప్రత్యేకాకర్షణగా నిలుస్తారు. నూతన కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

**సింహం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కుటుంబ సభ్యులతో కలిసి విహార యాత్రలు చేస్తారు.

**కన్య :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వైద్య పారిశ్రామిక రంగాల వారికి అనుకూలమైన కాలం.

**తుల :** దూరప్రాంతాల నుండి అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. క్రీడారంగం యందు ఆసక్తి కలిగి వుంటారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. సంఘంలో గౌరవప్రతిష్ఠలు పెరుగుతాయి. అపురూపమైన వస్తువులు సేకరిస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఈ రోజు ఉల్లాసముగా గడుపుతారు.ప్రయాణాలు.

**మకరం:** సంఘంలో మీకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. శుభకార్యాలు నిర్వహిస్తారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** సంతాన విద్యా విషయంలో పట్ల శ్రద్ధ కనబరుస్తారు. మీ సహాయ సహకారాలు అందిస్తారు.

**మీనం:** సమస్యలు కొంతవరకు తీరి ఊరట చెందుతారు. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మాస్కోలో ఆదివారం అణుశక్తి మ్యూజియం వద్ద గిరెడ్మెట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

# మాగ్నెట్ ఉత్పత్తి కేంద్రం

>> రేర్‌ఎర్త్ శాశ్వత అయస్కాంతాల తయారీ కోసం నియోడైమియం మాగ్నెట్ (ఎన్‌డిఎఫ్‌ఐబి) ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి భాగస్వామ్యం వహించండి. భారతీయ టెక్ కారిడార్‌లో సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్‌ప్లే ప్రయోగశాలల మద్దతుతో మెటలర్జీ అల్ట్రాప్యూర్ సెమీకండక్టర్ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ ల్యాబ్ సహా స్థాపనకు చొరవ చూపండి. పారిశ్రామిక వ్యర్థాలు, మైనింగ్ టెయిలింగ్స్ నుండి వ్యూహాత్మక అరుదైన లోహాలను వెలికితీయడానికి, యాజమాన్య వెలికితీత సాంకేతికతలను అమలు చేయడంలో భాగస్వామ్యం వహించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

ఇక 1931లో స్థాపించబడిన గిరెడ్మెట్ సంస్థ మాస్కో కేంద్రంగా పనిచేస్తూ శాస్త్ర, సాంకేతిక వ్యవస్థలో కీలక పరిశోధన డిజైన్ సంస్థగా కొనసాగుతోంది. రేర్ ఎర్త్ మూలకాలు, కీలక లోహాలు, సెమీకండక్టర్ పదార్థాలు, అధిక శుద్ధి రసాయనాల రంగాల్లో ఈ సంస్థకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. గిరెడ్మెట్ సంస్థ జాతీయ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేసే కేంద్రంగా పనిచేయడంతో పాటు అంతర్జాతీయ సహకారాల ద్వారా కూడా తన ప్రభావాన్ని విస్తరించుకుంటోంది. మాస్కోలోని ప్రత్యేక ప్రయోగశాలలు, పైలట్ స్థాయి పరీక్షా సౌకర్యాలు, డిజైన్ కేంద్రాలు విస్తృత పారిశ్రామిక నెట్‌వర్క్‌తో అనుసంధానమై పనిచేయడం వల్ల ఈ సంస్థ పరిశోధనతో పాటు పారిశ్రామిక అమలు సామర్థం కలిగిఉంది. ముఖ్యంగా కీలక ఖనిజాలు, బ్యాటరీ రీసైక్లింగ్, రేర్ ఎర్త్ ప్రాసెసింగ్, అధునాతన పదార్థాల అభివృద్ధి వంటి రంగాల్లో భారతదేశంతో భాగస్వామ్య అవకాశాలు పెరుగుతున్నాయి.

**మాస్కో అణుశక్తి మ్యూజియం సందర్శన:**

అణుశక్తిని సద్వినియోగం చేస్తే వైజ్ఞానికంగా దేశాలను అభివృద్ధి చేస్తోందని ఎపి విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రష్యాలోని అతిపెద్ద అణుశక్తి మ్యూజియం (మాస్కో)ను మంత్రి లోకేష్ సందర్శించారు. ఈ మ్యూజియం 25వేల చదరపుమీటర్ల విస్తీర్ణంలో 7 అంతస్తుల్లో ఉంటుంది. సోవియట్ అణు ప్రాజెక్ట్ ప్రారంభ దశల నుంచి ఆధునిక అణుశక్తి రంగ అభివృద్ధి, భవిష్యత్తు శాస్త్రీయ అవకాశాల వరకు విస్తరించిన ప్రదర్శనలు మ్యూజియంలో ప్రత్యేకం. మ్యూజియంలో ఇంటరాక్టివ్ ప్రదర్శనలు, శాస్త్ర ప్రయోగశాలలు, గైడెడ్ టూర్లు ఉండటం వల్ల ఇది ప్రజలకు విజ్ఞానపరమైన అనుభవాన్ని అందిస్తోంది. 2023 నవంబర్‌లో ప్రారంభమైన ఈ మ్యూజియం ఇప్పటికే విశేష ప్రజాదరణ పొందింది. విజ్ఞానం, చరిత్ర, సాంకేతికతల సమన్వయ వేదికగా నిలుస్తోన్న ఈ మ్యూజియంను 80 దేశాలకు పైగా చెందిన 35 లక్షల మందికిపైగా సందర్శించినట్టు నిర్వాహకులు లోకేష్‌కు వివరించారు. ఒకేసారి 2,100 మంది వరకు సందర్శకులను ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. మాస్కో ప్రభుత్వం, స్టేట్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ మ్యూజియం అణుశక్తి చరిత్రను మాత్రమే కాకుండా, శాంతిపూర్వక అణు వినియోగ విజయాలను కూడా సమగ్రంగా పరిచయం చేస్తోంది.

# డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కూటమి పక్షాల నేతలతో సిఎం చంద్రబాబు
- రేపటి తిరుపతి సభకు భారీ జనసమీకరణ
- పల్లా, నిమ్మల, నాదెండ్ల, మాధవ్ హాజరు

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కూటమి పార్టీల నేతలు, శ్రేణులకు టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇందుకు కోసం రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బహిరంగ సభలు విజయవంతం చేయాలన్నారు. ప్రత్యర్థి పక్షం విమర్శలను గట్టిగా తిప్పికొట్టాలన్నారు. ఆదివారం రాజధాని అమరావతిలో కూటమి పక్షాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 9వ తేదీన తిరుపతి వేదికగా జరగనున్న భారీ బహిరంగ సభ గురించి వారితో చర్చించారు. ఈ సభకు ఆయా పార్టీల కార్యకర్తలందరిని ఆహ్వానించాలని కోరారు. అలాగే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారికి సోదాహరణగా వివరించాలని వారికి సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మూడు ప్రాంతాలలో నిర్వహించే సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టిడిపి నుంచి పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, బిజెపి నుంచి పివిఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. జూన్ 4వ తేదీన ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో కూటమిలోని పార్టీల అగ్రనేతలు సమావేశమై ఎపిలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనతోపాటు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పాటై 12 ఏళ్ల పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని చర్చించి నిర్ణయం తీసుకున్నారు. అలాగే కూటమి ప్రభుత్వంపై వైసిపి నేతల విమర్శల జోరుకు అడ్డుకట్ట వేయాలని భావించారు. ఈ నేపథ్యంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జూన్ 9న తిరుపతిలో, 12న రాజధాని అమరావతిలో, జూన్ 15న విశాఖపట్నం వేదికగా ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దాంతో ఈ సభలను విజయవంతం చేయాలని ఈ జూమ్ మీటింగ్‌లో ఆయా పార్టీల అగ్రనేతలను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

# పశ్చిమ గోదావరి జిల్లాలో నేడు సిఎం పర్యటన

## సిద్ధాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ

## రైతులతో సమావేశం కానున్న చంద్రబాబు

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** గత ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాల్లోని తప్పులను సరిదిద్దుతూ ప్రజా ప్రభుత్వం రైతులకు కొత్త పుస్తకాలను అందిస్తోంది. రైతుల సమక్షంలోనే రీ సర్వే చేసి వారి ఆమోదంతో పాస్ పుస్తకాలను ఇస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీ నెలా 'మీ భూమి.. మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా నేరుగా ఆయనే రైతులతో సమావేశమై వారి సమక్షంలోనే అధికారులతో భూమి వివరాలను చదివించి పుస్తకాలను అందజేస్తున్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం సిద్ధాంతంలో 'మీ భూమి... మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం వారితో ప్రత్యేకంగా భేటీ అవుతారు.

**ఆరు నెలల్లో 26.46 లక్షల పాస్ పుస్తకాలు అందజేత**

జనవరి నుంచి ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తోంది. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించింది. అందులో 6,459 గ్రామాలకు చెందిన 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం విధించారు. ఈ గ్రామాలకు సంబంధించి మొత్తం 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తొలిసారి బ్లాక్‌చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను ఎపి ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతీ భూ యూనిట్‌కు శాశ్వత బ్లాక్‌చైన్ ఐడి ఇస్తోంది. దీని వల్ల ఒకసారి నమోదైన సమాచారాన్ని ఎవరూ మార్చడానికి అవకాశం ఉండదు. భూముల సర్వే ప్రారంభం నుంచి తుది రికార్డు వరకు ప్రతి దశలో ఈ కేవైసీ తప్పని సరి చేసింది. తొలుత రైతుకు డ్రాఫ్ట్ పుస్తకాన్ని అందించి... రైతు తన వివరాలను పరిశీలించుకుని ఈకేవైసీ ద్వారా ధృవీకరించిన తర్వాతే తుది పాస్ పుస్తకం ముద్రణకు వెళ్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం 10.25 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 11 గంటలకు పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చేరుకుంటారు. 11.15 గంటలకు మీ భూమి - మీ హక్కు ప్రజా వేదిక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రైతులతో సమావేశమవుతారు. 3.15 గంటలకు టిడిపి శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను ముగించుకుని సాయంత్రం 5.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# గోల్డెన్ అవర్‌లో గోల్డెన్ సర్వీస్




## 108 రూపు రేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం

### ఒక్క యేడాదిలోనే 7.78 లక్షల అత్యవసర కేసులకు సత్వర స్పందన

### భవ్య హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మరో మైలురాయి

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నట్టే 108అంబులెన్స్ సర్వీసులూ లక్షలాదిమందికి ప్రాణదాతగా నిలుస్తూ సమర్థతను చాటుకుంటున్నాయి. ప్రతినిమిషం ప్రాణ రక్షణే లక్ష్యంగా అత్యవసర సేవలు అందిస్తున్నాయి. భవ్యహెల్త్ కేర్ ఆధ్వర్యంలో అంబులెన్స్‌లకు టెక్నాలజీజోడించి బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు చేర్చాయి. 2025 జూన్ నుంచి 2026మేవరకు ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం7,78,799అత్యవసర కేసులకు స్పందించి వేలాది కుటుంబాల్లో ఆశాజ్యోతిని వెలిగించాయి.

**ప్రాణాపాయ స్థితిలో దేవుడిలా...**

ఈ ఏడాది కాలంలో 1,13,764 మంది రోడ్డు ప్రమాద బాధితులకు 108 సిబ్బంది గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్య సహాయం అందించారు. అలాగే 1,05,786 మంది గర్భిణీలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించి తల్లిశిశు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. 97,118 శ్వాసకోశ సమస్యల కేసుల్లో తక్షణ వైద్య సహాయం అందించి ప్రాణాలను కాపాడారు. అదేవిధంగా 49,342 వాహనేతర గాయాల కేసులు, 45,951 గుండెజబ్బుల కేసులు, 40,553 స్పృహ తప్పిన కేసులు, 34,532 కడుపునొప్పి కేసులు, 32,858 విషప్రయోగ కేసులు, 29,485 ఫిట్స్ కేసులు, 27,455 తీవ్ర జ్వరం కేసులు, 20,278 పక్షవాతం కేసులు, 15,441 దాడుల కేసులు, 14,088 జంతువుల కాటు కేసులు, 14,007 నవజాత శిశువుల అత్యవసర కేసులతో పాటు మరో 1,38,141 ఇతర అత్యవసర కేసుల్లోనూ 108 సిబ్బంది అంకితభావంతో సేవలందించి తమ చిత్తశుద్ధిని చాటుకున్నాయి. ఈ మొత్తం సేవల్లో 2,53,022 కేసులు ఒక ఆసుపత్రి నుండి మరొక ఆసుపత్రికి తరలించిన అంతర్గత బదిలీలు (నీగి) కాగా, 5,25,777 కేసులు నేరుగా ప్రమాద స్థలాలు మరియు అత్యవసర ప్రాంతాల నుండి ఆసుపత్రులకు తరలించిన నాన్‌నీగి కేసులుగా నమోదయ్యాయి.



**ఎమర్జెన్సీ కేసుల్లో ప్రాణాధారం**

ప్రాణాపాయ పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకంగా మారే గుండెజబ్బుల అత్యవసర కేసుల్లో 108 అంబులెన్స్ 108 సిబ్బంది దేవుడిలా మారి, సకాలంలో సర్వీస్ అందిస్తూ ఎందరికో పునర్జన్మను ప్రసాదిస్తున్నారు. ఏడాదిలో 45,951 గుండెజబ్బుల కేసులకు స్పందించి సకాలంలో వైద్య సహాయం అందించారు. దీంతో పాటు ఛాతినొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు వంటి అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది వేగంగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రులకు తరలించారు. అత్యాధునిక వైద్య పరికరాలు, శిక్షణ పొందిన నిలీగిలు మరియు సమర్థవంతమైన అంబులెన్స్ నిర్వహణతో వేలాది ప్రాణాలను కాపాడడంలో 108 సేవలు కీలక పాత్ర పోషించాయి. ఆపద సమయంలో రోగికి వైద్య సహాయం అందే వరకు నిలీగిలు అందించే సేవలు ప్రాణరక్షణలో కీలకంగా మారుతున్నాయి.వారి సమయస్ఫూర్తి, నైపుణ్యం, సేవాభావంవల్ల వేలాది మంది ప్రాణాలు నిలబడుతున్నాయి.


**ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవని:** ఈ సందర్భంగా భవ్య హెల్త్ కేర్ మీడియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ సరైన సమయంలో అత్యవసర వైద్య సహాయం అందించడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఆధునిక సాంకేతికత, నిరంతర నిఘా వ్యవస్థలు మరియు నైపుణ్యం కలిగిన సిబ్బందితో 108 సేవలను మరింత బలోపేతం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా మరింత సమర్థవంతమైన సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు.

**108 సేవలపై సర్వత్రా హర్షం..** ప్రమాదాలు, గుండెపోటు, ప్రసవాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో సమయానికి చేరుకుని వైద్య సహాయం అందించడం ద్వారా 108 సేవలు ప్రజారోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయి. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందిస్తూ ప్రాణాలను కాపాడుతున్న 108 అంబులెన్స్ సేవలపై బాధితులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు 24 గంటలూ అందుబాటులో ఉండే 108 సేవలు అనేక కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తున్నాయని ప్రజలు అభినందిస్తున్నారు. అత్యవసర సమయంలో ఒక్క ఫోన్ కాల్‌తో స్పందించి బాధితులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలిస్తున్న సిబ్బంది సేవాభావాన్ని కొనియాడుతున్నారు.

# తిరుమల సమాచారం

## వారాంతంలో కొండ కిటకిట

### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,జూన్ 7 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి సెలవులు ముగింపునకు వస్తుండటంతో వారాంతం కావడంతో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్ష మంది భక్తులు రావడంతో కొండ కిటకిటలాడుతోంది. వేసవిసెలవులు, ఆపై వారాంతం శని, ఆదివారాలు కలసి రావడంతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఏనిమిదిగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్దంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవిసెలవులు, ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ,మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం వరకు 41వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. దర్శనం చేసుకోలేని భక్తులు అఖిలాండం వద్ద కొబ్బరి కాయలు కొట్టి వెనుదిరుగుతున్నారు.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. ఆదివారం ఉదయం విశాఖపట్నంకు చెందిన ఎంకే బిల్డర్స్ ఎండీ రామకృష్ణ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 10 లక్షలు, వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు 10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు విరాళం డిడిలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.11.11లక్షలు విరాళం



**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నిరుపేదలకు ప్రాణరక్షక వైద్యసేవలు అందిస్తున్న వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు బెంగళూరుకు చెందిన నిర్మాణ సంస్థ సముద్ర గ్రూప్ డైరెక్టర్ నవీన్ కుమార్ 11,11,111 లక్షలు విరాళంగా అందించారు.టిటిడి అదనపు అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి ఆదివారం సాయంత్రం డిడిని అందజేశారు.

## తిరుమల రెండోఘాట్‌లో ఎలుగుబంటి

### భయంతో పరుగులు తీసిన భక్తులు

**తిరుమల,జూన్ 7 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో శనివారం రాత్రి ఓ ఎలుగుబంటి అటవీప్రాంతంనుండి రోడ్డుపైకి రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. రాత్రివేళ అడవి వదలి జనసంచారంలోకి రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకున్న తరువాత సిద్దివినాయకస్వామి ఆలయం వద్ద ఎలుగుబంటి సంచరించింది. తినుబండారాల కోసం అక్కడ ఉంచి చెత్తకుండీని దొర్లించి చిందరవందర చేసింది. రాత్రివేళ తిరుమలకు వచ్చే భక్తులు ఎలుగుబంటిని చూసి ఒక్కసారిగా భయంతో వణికిపోయారు.

సమాచారం అందుకున్న టిటిడి విజిలెన్స్,సెక్యూరిటీ సిబ్బంది శబ్ధాలతో ఎలుగుబంటిని అడవిలోకి తరిమేశారు. వేసవిలో అడవులు వదలి చిరుతలు, జింకలు, ఎలుగుబంట్లు,ఏనుగులు దారితప్పి జనావాసంలోకి రావడం పరిపాటిగా మారింది.

# రాజధాని పరిపాలన విధానంలో కీలక మార్పులు

### మూడు నాలుగు గ్రామాలకు ఒక గ్రిడ్, జోన్

### ప్రత్యేక కలెక్టర్ల నియామకం



**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని పరిపాలనలో మార్పులు చేశారు. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సిఆర్డీఏలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఏకు, గ్రామవార్డు సచివాలయ విభాగాలకు ఈ మేరకు ప్రభుత్వం నుండి అనుమతి ఇచ్చింది.అమరావతి రాజధాని ప్రాంతం మొత్తాన్ని తొమ్మిది జోన్లుగా మార్చారు.కొత్త కమిషనర్ విజయరామరాజు వచ్చిన తరువాత రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి తొమ్మిది జోన్లు ఏర్పాటు చేశారు. దీనిలో ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్‌జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక, ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్‌ఈస్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు. నార్త్ వెస్ట్ జోన్ పరిధిలో అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, సౌత్ ఈస్ట్‌జోన్‌లోకి నవులూరు 1,2 యూనిట్లు, సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి కురగల్లు రెండు యూనిట్లు, నిడమర్రు రెండు యూనిట్లు కలిపారు. వెస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు రెండు యూనిట్లు, అనంతవరం గ్రామాలను తీసుకొచ్చారు. అలాగే రెండోదశలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించారు. ఒక్కో యూనిట్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహశీల్దార్, విఆర్ఓ, లైసెన్స్డ్ సర్వేయర్, విలేజ్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్లు నియమించారు. భూమి విస్తీర్ణం ఆధారంగా కొన్ని గ్రామాల్లో అదనపు సర్వేయర్లను నియమించారు. ఇవి కాకుండా రాజధాని నగరంలో ల్యాండ్స్ విభాగానికి ప్రత్యేక యూనిట్ను ఏర్పాటు చేశారు. దీనిలోనూ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తోపాటు పదిమందిని నియమించారు. అలాగే ఎపిసిఆర్డిఏ క్యాపిటల్ రీజియన్ కోసం ప్రత్యేక ల్యాండ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఎల్పిఎస్ కోఆర్డినేషన్, గుంటూరుకలెక్టరేట్‌లో ప్రత్యేక అడ్మిన్ కార్యాలయం, నెగోషియబుల్ సెటిల్మెంట్ పాలసీ, ఆర్1 పరిధిలో వ్యవహారాలకోసం వేర్వేరు యూనిట్లును నియమించారు.వీటన్నిటితో పాటు ఇద్దరు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికా రులతో మరొక విభాగాన్ని నియమించారు. ఇప్పటి వరకూ గ్రామాల్లో కాంపిటెంట్ అథారిటీలే అన్ని వ్యవహారాలు చూసేవారు. ఇకనుండి జోనల్ స్థాయిలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఆయా జోన్ల పరిధిలోకి వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది.భూయజమానులు నేరుగా సిఆర్డిఏ కార్యాలయానికి వెళ్లకుండా ఆయా జోన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## విమానయాన పాలసీకి ఆమోదం

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ విమానయాన పాలసీ 2026-31కి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిద్వారా రూ. 9676 కోట్ల పెట్టుబడులు సాధించడం లక్ష్యంగా పేర్కొంది. ఇటీవల మంత్రిమండలి సమావేశంలో పాలసీ విధానాలను ఖరారు చేశారు. దాన్ని ఆమోదిస్తూ పెట్టుబడులు, మౌలికవసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏకీకృత ఎయి ర్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెరుగైన ఎయిర్ కనెక్టి విటీ ఎయిర్ కార్గో లాజిస్టిక్స్ సౌకర్యాలు ఏవి యేషన్ స్కిల్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏరోస్పేస్ మా న్యుఫ్యాక్చరింగ్ మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవర్‌హాల్ సౌకర్యాలు కల్పించడం ద్వారా ఏపీని ఏవియేషన్‌హబ్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ఏ ప్రాంతం నుంచి అయినా సుమారు 150 కి.మీలో విమాశ్రయ సదుపాయం అందించడమే పాలసీ లక్ష్యమని పేర్కొంది,

# పెరుగుతున్న భక్తులు, భర్తీకాని ఉద్యోగాలు

### టిటిడి మినీ సచివాలయంలో ఉద్యోగుల అంతర్మథనం

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** 3,500 కోట్ల పైగానే వార్షిక ఆదాయం, ఏడుకొండలస్వామి దర్శనానికి రోజురోజుకూ రెట్టింపవుతున్న భక్తులకు తోడు ఉద్యోగాల భర్తీమాత్రం చేయడంలేదు. ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతోందని ఆవేదన వెలిబుస్తున్నారు.రాష్ట్ర సచివాలయం తరువాత మినీసచివాలయంగా టిటిడి పాలన సాగుతోంది. ఇక్కడ కొన్ని దశాబ్ధాల క్రిందట వరకు ఉన్న ఉద్యోగులు ఏడాదికేడాది పదవీవిరమణతో ఖాళీ అవుతున్నా తిరిగి ఆ పోస్టులు భర్తీచేయడంలేదు. దీంతో ఆయా శాఖల్లో ఉద్యోగులు మరీ ఒత్తిడితో విధులు నిర్వహించాల్సి వస్తోందనేది పలువురు ఉద్యోగుల ఆవేదన . ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం పరిపాలనలో కీలకమైన మినీసచివాలయం పరిపాలన భవనం ఉంది. కొన్ని దశాబ్ధాల క్రిందట 18వేలమంది వరకు ఉన్న శాశ్వత ఉద్యోగులు ఏడాదికేడాది పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతుండటంతో తిరిగి ఆ పోస్టులు భర్తీ చేయడంలేదనేది ఉద్యోగుల వాదన. దశాబ్ధకాలంక్రిందట 13వేలమంది ఉన్న శాశ్వత ఉద్యోగులు క్రమేణా పదవీవిరమణ చేయడం,పలు కారణాలతో విధుల్లో ప్రాణాలు కోల్పోవడం వంటి సందర్భాలతో ప్రస్తుతం 6,500మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వీరిలో క్రిందిస్థాయిలో ఆఫీస్ సబార్డినేట్స్(అటెండర్లు) స్థాయి నుండి జూనియర్ అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు, షరాఫ్‌లు, జమేదార్లు, ఎఇఒలు, సూపరింటెండెంట్‌లు, డిప్యూటీ ఇఒల హోదా వరకు అధికారులు ఉన్నారు. వీరంతా తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు తిరుపతి స్థానిక ఆలయాల్లోనూ, టిటిడి పరిపాలన భవనంలో, దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి కల్యాణమండపాలు,, ఆలయాలు,టిటిడి సమాచార కేంద్రాలు ఇలా అనేక చోట్ల ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కీలకంగా తిరుమలలో వసతికల్పన విభాగం, శ్రీవారి ఆలయం, దర్శనాలు, పరకామణి, అన్నప్రసాదం, దాతల విభాగం, విద్య,వైద్యం విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల్లో డిప్యూటీ ఇఒ హోదా అధికారులు, సూపరింటెండెంట్‌లు,మేనేజర్ పోస్టులు ఖాళీ అయితే (పదవీవిరమణ చేస్తే)తిరిగి భర్తీకావడం లేదు. దీనివల్ల ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతుందనే వాదనలు ఇప్పటికే టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్రకు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఉద్యోగ సంఘాల నేతలు పలు దఫాలుగా విన్నవించారు. శాశ్వత ఉద్యోగుల పోస్టులను భర్తీచేయాలని కోరారు. ఐఎఎస్ ,ఐఆర్ఎస్, ఐపిఎస్ హోదాతో ఇతర ప్రభుత్వ శాఖల నుండి డిప్యూటేషన్‌పై ఇఒ, అదనపు ఇఒ,జెఇఒ,సివిఎస్ఒ అధికారులు టిటిడికి వస్తున్నారు. వీరంతా రెండేళ్ళు,మూడేళ్ళు మాత్రమే బాధ్యతాయుతమైన సేవలందించి తిరిగి వారి శాఖలకు వెళ్ళిపోతుంటారు. ఇక్కడ టిటిడి నోటిఫికేషన్ ద్వారా ఎన్నికైన ఉద్యోగులు మాత్రమే భక్తులకు ఇతోధిక సేవలందించడం జరుగుతుంది. రోజుకు లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. వీరికి అవసరమైన అన్ని రకాల సేవలందించడానికి శాశ్వత ఉద్యోగులతోబాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమతమ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. పదుల సంఖ్యలో పదవీవిరమణ చేస్తున్న ఉద్యోగుల స్థానంలో తిరిగి కనీసం ఆఫీస్ సబార్డినేట్స్ నియమాకాలు కూడా జరగడంలేదు. టిటిడిలో ఉద్యోగమంటే పూర్వజన్మసుకృతం,పుణ్యప్రదంగా ఎవరైనా భావిస్తారు. అలాంటిచోట్ల ఉద్యోగం చేయాలని ప్రతి హిందువుకు ఆసక్తిఉంటుంది.

**ఉన్నవారిపైనే అదనపు భారం:** టిటిడిలో ప్రస్తుతం ఉన్న సుమారు 6,500మంది పైచిలుకు ఉద్యోగులు ఆయా విభాగాల్లో విధుల నిర్వహణ అదనపు భారంగా చెబుతున్నారు. ఖాళీపోస్టులు భర్తీకాకపోతుండటంతో ఉన్నవారిపైనే ఈ భారం పడుతోందనే వాదన వినిపిస్తున్నారు. గతంలో కారుణ్యనియామకాలు చేపట్టి తక్కువ సంఖ్యలోనే శాశ్వత ఉద్యోగాలు భర్తీచేసిన టిటిడి పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఈ నేపథ్యంలో గత రెండు దశాబ్ధాల కాలంలో టిటిడిలో ఉద్యోగాల భర్తీ మాత్రం జరగలేదు. 2014, 2019లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, వైసిపి,తిరిగి 2024లో కొనసాగుతున్న టిడిపి కూటమి ప్రభు త్వాలు ఉద్యోగుల భర్తీ పై స్పష్టమైన ప్రకటన లేదు. పైగా గతంలో టిటిడిపాలకమండలి టిటిడిలో ఉద్యోగాలు స్థానికులకే 75శాతం ఇస్తామని, వారితోనే భర్తీచేస్తామని వెల్లడించిన సందర్భం ఉంది. అయినా మినీసచివాలయం లాంటి పరిపాలన చేస్తున్న టిటిడిమాత్రం శాశ్వత ఉద్యోగాలు భర్తీచే యడంపై దృష్టిపెట్టలేదు. ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగ సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

## గృహ వినియోగ ఎల్పిజి ధరను తగ్గించండి

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** గృహ వినియోగ ఎల్పిజి గ్యాస్ సిలిండర్ ధరను రూ.29లు పెంచడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఖండించారు.ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేసారు.పెంచిన సిలెండర్ దర తగ్గించాలన్నారు.మోడీ ప్రభుత్వం పదేపదే జనంపై భారాలు మోపటం దుర్మార్గం అన్నారు.వంట గ్యాస్ పై గత మూడు నెలల్లో రూ.89లు పెంచారన్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు, వాణిజ గ్యాస్ సిలిండర్ ధర రెండుసార్లు, గృహ వినియోగ ఎల్పిజి ధర రెండుసార్లు పెంచిన ఘనత మోడీ సర్కార్ దే. ఫలితంగా రవాణా, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యుల జీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు.పెంచిన గ్యాస్ ధరల పెరుగుదలపై సీఎం చంద్రబాబు నోరు విప్పాలి అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచి, ధరల తగ్గింపునకు చంద్రబాబు చొరవ చూపాలన్నారు.




## సత్యనారాయణ గారూ..

# సిద్ధాంతంలో కలుద్దాం!

### ఆచంట నియోజకవర్గానికి చెందిన ఓ వృద్ధుని కోరిక మేరకు స్పందించి సిఎం చంద్రబాబు ట్వీట్

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** తనను కలవాలన్న ఓ వృద్ధుని కోరికకు స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన సానబోయిన సత్యనారాయణకు చంద్రబాబు అంటే ఎంతో అభిమానం. ఒక్కసారైనా చంద్రబాబును కలవాలని అనుకున్నారు. నేడు (సోమవారం) సిద్ధాంతంలో జరిగే 'మీ భూమి... మీ హక్కు' కార్యక్రమానికి వస్తున్న సిఎం చంద్రబాబు సభకు వెళ్లేందుకు సత్యనారాయణ సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఓ యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి సత్యనారాయణ గారూ...రేపు కలుద్దాం అంటూ ట్వీట్ చేశారు.

# రేపు తిరుపతిలో ఎన్‌డియే సభ

### కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ప్రజాదర్బార్

### సిఎం చంద్రబాబు. జనసేనాని పవన్, బిజెపి చీఫ్ మాధవ్ హాజరు

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ళపాలనపూర్తిచేసుకోవడంతో అమలుచేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు చేకూర్చిన లబ్ధి తదితర విషయాలు వెల్లడించడానికి 9వతేదీ రేపు తిరుపతిలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సమావేశానికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు భారీగా హాజరుకానున్నారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారిపై దామినేడు సమీపంలోని ఖాళీస్థలంలో మంగళవారం ఉదయం ఈ సభజరగనుంది. ఈ స్థలాన్ని ఆదివారం సాయంత్రం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ గోవిందరావు, అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని తదితరులు కలసి పరిశీలించారు. రేపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా పర్యటన సందర్భంగా దామినేడు వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభా ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రాంతాలు, వాహనాల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, వేదిక నిర్మాణ పనులు, ప్రజల రాకపోకల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను అధికారులు గమనించారు. సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, విద్యుత్ సరఫరా, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో తగిన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎండ తీవ్రత దృష్ట్యా సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత స్థాయిలో త్రాగునీటి సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన చోట్ల మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే సభా ప్రాంగణం, వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కూలర్లు, షామియానాలు మరియు ఇతర శీతలీకరణ సదుపాయాలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## గాడితప్పిన కూటమి పాలన

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రెండేళ్ల కూటమి పాలన గాడి తప్పిందని, ప్రజలకు చేసిందేమీ లేకపోగా జాతీయ సంపద లూటీ జరుగుతోందని, మతోన్మాదం పెచ్చరిల్లిపోతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై యువత తీవ్ర ఆగ్రహంతో గర్జిస్తోందనీ తెలిపారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావుతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి రెండో విడత పాలన రెండేళ్లు పూర్తయిందని, కేంద్రంలో బిజెపి పాలన 12 సంవత్సరాలు పూర్తయిందని పేర్కొన్నారు. దీనిపై ప్రజల్లోకి వెళ్లాలని ప్రకటించారని, ఏమి సాధించారని ప్రజల వద్దకు వెళతారో సమాధానం చెప్పాలని అన్నారు. స్వర్ణాంధ్ర చేస్తామని పైకి చెబుతున్నా ఆచరణలో విషాద ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న మంత్రుల నిర్వాకంతో గత ఆరేళ్లలో 70 సార్లు పరీక్ష పేపర్లు లీకయ్యాయని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతాపార్టీ పిలుపుతో యువత రోడ్లపైకి వచ్చారని అన్నారు. రాజీనామా చేయకపోతే బిజెపి ప్రభుత్వ పతనానికి అదే నాంది అవుతుందని హెచ్చరించారు. కోనసీమ గ్యాస్‌ను రిలయన్స్ పైపులైన్ల ద్వారా దోచుకుపోతోందని, వామపక్ష పార్టీలు పర్యటన చేశామని అక్కడ దోపిడీ కళ్లకు కట్టినట్లు కనిపించిందని పేర్కొన్నారు. ఇటీవల గ్యాస్ ధరను మరో రూ.29 పెంచారని పేర్కొన్నారు. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఈనెల తొమ్మిదోతేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో నిర్వహించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయని అన్నారు.

## 9 నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో జూన్ 9 నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు జరుగుతాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు,విజయవాడ ఏంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తెలిపారు. ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో జూన్ 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖ పట్నం వేదికగా ఏ.పి.యల్ మ్యాచ్ జరుగుతాయన్నారు. కడపలోని జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. జూన్ 24 నుంచి 30వ తేదీ వరకు మంగళగిరిలో ఫైనల్ మ్యాచ్ జరు గుతుందని చెప్పారు. ఈ మ్యాచ్‌లు తిలకించేందుకు పాఠశాల, కళాశాల విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

వార్త

నిలబడి గడగడా మాట్లాడేందుకే కాదు,
కూర్చొని వినేందుకూ ధైర్యం కావాలి.
- క్వింటన్

# 'హిట్' సరిపోతుందా?

పొద్దుట లేస్తే ఏ ఇల్లాలూ వంటింట్లో బొద్దింకను సందర్శించకుండా బయటకు వస్తున్నారంటే నమ్మలేం. తాజాగా కాక్రోచ్ జనతాపార్టీ 'జెన్‌జీ' ఉద్యమాన్ని నడిపిస్తుండడంతో ఇండియాలోగానీ, వేరే ఏ ఇతర దేశంలో కానీ 'బొద్దింక' లేని చర్చోపచర్చలు సాగే పరిస్థితి లేదు. 'కాక్రోచ్' పేరెత్తకుండా నడిచే పరిస్థితి లేదు. ఇతర దేశాల్లో 'జెన్‌జి' ఉద్యమం తారాస్థాయికి వెళ్లి ప్రభుత్వాలను మార్చేసిన యువతలోని అసమ్మతితో భారతదేశంలో 'కాక్రోచ్' ఉద్యమంగా వెల్లువెత్తుతున్న ఉద్యమం ఉనికిని కాదనే పరిస్థితి లేదు. ఈ భూమ్మీద బొద్దింకలెన్ని ఉన్నాయంటే అసంఖ్యాకమనే చెప్పాలి. అలాగే 'కాక్రోచ్' పేరు ఎలా పుట్టినా, ఎవరు నామకరణం చేసినా, ఎవరు ఉద్యమించాలని సంకల్పించినా ఆ ఉద్యమంలో పాల్గొనే ఉద్యమకారుల సంఖ్య కూడా అసంఖ్యాకమే. ఇప్పుడు 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరిట సోషల్ మీడియాలో విశేష ఆదరణ పొందిన శనివారం పెద్దఎత్తున న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌లో పోలీసుల అనుమతితో బహిరంగ ప్రదర్శనకు కూడా అనుమతి పొందగలిగారంటే దానికి కారణం అనూహ్య జనాదరణ పొందబట్టేనని అర్థమవుతోంది. సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే అనే వ్యక్తి అమెరికాలో ఉద్యోగి. భారతదేశంలో ఏవైనా తామరతంపరగా వెలుస్తుంటే వాటిని అక్కడికక్కడే అశేషంగా పుట్టుకొచ్చే పుట్టగొడుగుల్ని గుర్తుకు తెచ్చుకోవడం పరిపాటి. ఏమైతేనేం అమాయక నిరుద్యోగుల్లో కాస్త చైతన్యం పెల్లుబికింది. నిజానికి దేశ నిరుద్యోగుల్లో ఉపాధి ఉద్యోగాల్లేక, అధికారం ఎవరి చేతుల్లో ఉన్నా తమ బతుకులింతేననే నిరాశానిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారే ఇప్పుడు ఈ దేశ సుభిక్షానికే తామున్నట్లు ఎలుగెత్తుతూ ఈ 'కాక్రోచ్' ఉద్యమానికి మద్దతుగా కదలివస్తున్నారు. న్యూఢిల్లీ వీధుల్లో యువత దాదాపు కదం తొక్కినట్లే ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. యువత ఆకాంక్షలను ప్రతిఘటించడం మంచిది కాదనే ధోరణిలో ప్రభుత్వం కూడా ఎక్కడా యువతను నిరోధించే ప్రయత్నం చేయలేదు సరికదా సెంట్రల్ ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో 2వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాము శాంతియుతంగానే జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమం చేపడతామని నిర్వాహకులు ప్రకటించినప్పటికీ ఉద్యమాలు తప్పుదారి పట్టి వ్యతిరేకుల చేతిలో ఆటబొమ్మలుగా మిగలకూడదనేభావనతో, ఎలాంటి అవాంఛనీయ ధోరణులు ప్రబల కుండా నిఘా మాటున ఉద్యమ పర్యవసానాలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. యువతరం గళమెత్తితే ప్రభు త్వాలు కూకటివేళ్లతో కదలిపోతాయి. నవతరం మార్పు దిశగా పయనిస్తుంది. ఎంతో సున్నితమైన అంశం ఇప్పు డు తెరపైకి వచ్చింది. యువతలో గూడుకట్టుకున్న నిరాశ ఒక్కసారిగా పెల్లుబికే సమయం ఆసన్నమైంది. ఆగ్రహావేశాలు నివురుగప్పిన నిప్పులైతే ఇక చేసేదేముంది. అలాంటి పరిస్థితి తలెత్తుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. 'కాక్రోచ్' ఏ పాటిదైనా సైబర్ ప్రపంచపు ఛాయల్లోనే పుట్టిందని చెప్పకతప్పదు. కేంద్ర ప్రభుత్వ పాలనలో ఎన్ని వర్గాలు ఏయే సందర్భాల్లో నిరసన గళమెత్తినా, ఈసారి నిరుద్యోగులు ఏకమైతే దేశమేగతి మారుతుందో అంచనా వేసుకుంటూముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలో ఒకపక్క అవినీతి, లంచగొండి తనం పెరిగిపోయాయి. ఏ రంగానికీ మినహాయింపు లేదు. ఏలిన వారికి తమ ముందున్న అష్టదరిద్రాలను కడుపులో పెట్టుకుని కాపాడుకోవడం తప్పలేదు. దేశరాజధాని నగరంలోనూ మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు. వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శతాధిక బిలియన్ల నిరుద్యోగుల తిరుగుబాటు ఈ దేశానికి మంచిది కాదు. వారిలోని అసంతృప్తిని, తిరుగుబాటును నిరోధించడం కన్నా వారికి ఉపాధి, ఉద్యోగాల కల్పన వంటి అంశాలపై దృష్టిసారించడం కేంద్రానికి శిరోధార్యం కావాలి. ఈ మధ్య వెలువడిన 'నీట్' పరీక్షల్లో ప్రశ్నాపత్రాల వెల్లడి వంటి అన్ని అంశాలపై ప్రశ్నించబోయిన సిజెపి తెగువను అభినందించాల్సిందే. గతంలో నేపాల్, బంగ్లాదేశ్‌లలో 'జెన్‌జి' ఉద్యమాలు సఫలీకృతమయ్యాయి. కాగా ఈ ఉద్యమ పర్యవసానంగా ఏర్పడిన ప్రభుత్వాలు వాటినినడిపే ప్రభుత్వాల నిర్వాకాలు చర్చించదగినవే. వెల్లువెత్తిన ఉద్యమాల నేపథ్యంలో 'పాలనలో మార్పు' ఒక్కటే పరిష్కారంచూపదు. పాలించే తీరులోని మార్పుతోనే సత్ఫలితాలు సాధించగలుగుతాయి. ఇటీవల విద్యార్థుల అభిశంసనకు గురైన 'నీట్' విద్యావ్యవస్థను ప్రక్షాళన కోరుతూ ఆన్‌లైన్‌లో సిజెపి పెట్టిన వినతిపత్రంలో 8 లక్షలకుపైగా డిజిటల్ సంతకాలు వచ్చి చేరాయి. 'జెన్-జడ్' తరం పరిధిని దాటిపోయిన ఈ ఉద్యమానికి ప్రసిద్ధ సామాజిక కార్యకర్త సోనమ్‌వాంగ్ చుక్ వంటి వారి మద్దతు లభిస్తోంది. మరెందరు క్యూలో ఉన్నారో ఉంటారో. దేశంలో విద్యా వ్యవస్థకు పట్టిన దుర్దశను ఎత్తి ప్రశ్నించడానికేనా అన్నట్లు తాజా 'కాక్రోచ్' ఉద్యమ స్వరూపం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుత డిమాండ్ 'నీట్‌పరీక్షా నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో 'జెన్ జీ'ల తొలిఅడుగు పడినప్పటికీ మలి అడుగు, మరో ఉధృతరూపానికి అవకాశమివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన బాధ్యత కేంద్రం తీసుకోవాలి. అత్యున్నత విద్యా ప్రవేశాల పరీక్షల పేపర్ లీక్, డేటా లీక్‌తో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థ సమూల ప్రక్షాళన కోరుకోవడం సబబే! ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాల్సిందే.



రెండు వర్గాల మధ్య పోరాటం జయాపజయాలకు దారి తీస్తుంది. ఒకే వర్గం మధ్య పోరాటం ఆ వర్గ నాశనానికి దారితీస్తుంది.
బిఆర్ అంబేద్కర్



వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.
జాకబ్ బ్రొనోవిస్కీ

# ప్రజావాక్కు



### ఆర్థిక నిబంధనలకు విరుద్ధం

నోటిఫికేషన్ పడటం, పరీక్ష రాయడం, చివరికి సెలెక్ట్ అవ్వడం ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికి తీసుకుని డ్యూటీలో చేరి జాయినింగ్ రిపోర్ట్ మీద సంతకం చేయడం మరో ఎత్తు. ఆ సంతకం పెట్టే వరకు వారు కేవలం 'అభ్యర్థులు' మాత్రమే, 'ఉద్యోగులు' కారు. అసలుసిస్టమ్‌లో ఉద్యోగిగా ఎంటర్ అవ్వకముందే, వారికి ఆ ఉద్యోగ సంబంధిత హక్కులు (పాత పెన్షన్) వర్తిస్తాయని చెప్పడం పాలనాపరంగా కరెక్ట్ కాదు. కట్ ఆఫ్ తేదీకి ఉన్న విలువప్రభుత్వం ఒక విధానాన్ని మార్చినప్పుడు ఒక స్పష్టమైన కటాఫ్ తేదీని ప్రకటిస్తుంది. ఆ తేదీ నాటికి ఎవరైతే ఉద్యోగంలో ఉన్నారో వారికి పాత రూల్, ఆతర్వాత జాయిన్‌అయ్యే వారికి కొత్త రూల్ అని చట్టంచేసిన తర్వాత, 'మాకు నోటిఫికేషన్‌ముందే ఇచ్చారు కదా' అని మినహాయింపులు ఇస్తూ పోతే.. అసలు ఆ కట్‌ఆఫ్ తేదీకి, ప్రభుత్వ విధానాలకు అర్థమే లేకుండా పోతుంది. ఖాతా కూడాతెరవడానికి వీల్లేని సమయంలోని సర్వీసును ప్రామాణికంగా తీసుకుని ఓల్డ్ పెన్షన్ లెక్కించడం ఆర్థిక నిబంధనల ప్రకారం చాలా విరుద్ధం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### యువతకు అవకాశం కల్పించాలి

ఎన్నికల షెడ్యూల్‌వెలువడటమే తరువాయి పోటీ చేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని పార్టీ పెద్దలను కాకా పడుతూ వారిచుట్టుతిరిగేవారు ఇలాంటి రాజకీయ నాయకులు ఈరోజుల్లో చాలామంది ఉన్నారు. వీరు వయసులో చిన్న వారు కారు, చట్టసభలకు ఎన్నిక అవని వారూ కాదు. సీనియర్లు ఎంతో కాలంగా పార్టీకి సేవ చేస్తున్న వారు కదా అని అధిష్టానం వీరికి ఎన్నో సార్లు అవకాశం ఇచ్చింది. అయినా వీరికి తృప్తి ఉండటం లేదు. ఒక్కసారి కూడా అవకాశం రాని వారికి టికెట్ ఇవ్వాలి.

- కె.రామరాజు, హైదరాబాద్

### ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ఎలిమెంటరీను హైస్కూల్ నుండి వేరుచేయడం, ఇంటర్మీడియట్ విద్యను హైస్కూల్ ప్లస్‌గామార్చడం ఆహ్వానించదగ్గ మార్పు. విద్యాశాఖ సీనియర్లకు జూనియర్ల కంటే తక్కువ వేతనం రావడానికి ప్రధాన కారణం అన్వేషించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పింది. అప్రెంటిస్ కాలం పూర్తిచేసిన నేపథ్యంలో ఇవ్వబడిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు వారు ఉద్యోగంలో జాయిన్ అయిన తేదీ నుండి అమలు చేయాలి.

- బి. మేఘనాథం, విజయనగరం

### భారత్‌లో గోప్యత ఎక్కడ?

డిజిటల్ యుగంలో ఆర్థిక వ్యవస్థ వేగంగా మారిపోతున్నది. నగదు లావాదేవీల స్థానంలో డిజిటల్ చెల్లింపులు ప్రాముఖ్యత పొందుతున్నాయి. యూపీఐ, మొబైల్ వాలెట్లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు సాధారణ ప్రజల దైనందిన జీవితంలో భాగమయ్యాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ లావాదేవీలపై ప్రభుత్వ నజర్ పెరగడం సహజమే. అయితే ఇది ప్రజల ప్రయోజనాలకు ఎంతవరకు అనుకూలం? లేదా వ్యక్తిగత గోప్యతకు ముప్పుకలిగించే అంశమా? అనే ప్రశ్నలు ప్రస్తుతానికి చర్చనీయాంశంగా మారాయి. మొదటగా, ప్రభుత్వ నజర్ వెనుక ఉన్న ఉద్దేశాన్నిపరిశీలిస్తే, ఆర్థిక పారదర్శకతను పెంచడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. డిజిటల్ లావాదేవీలు ట్రాక్ చేయగలిగినవిగా ఉండటంవల్ల నల్లధనం నియంత్రణకు ఇది ఉపయోగపడుతుంది. పన్ను ఎగవేతను తగ్గించడంలోకూడాఇది కీలకపాత్ర పోషిస్తుంది. డిజిటల్ లావాదేవీలు దేశ అభివృద్ధికి కీలకంగా మారిన ఈ కాలంలో, వాటిపై ప్రభుత్వ నజర్ అనివార్యం. అయితే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయకుండా, వారి గోప్యతను కాపాడే విధంగా ఉండాలి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

### పెరుగుతున్న సైబర్ నేరాలు

ఈ మధ్య సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయి. రూ. మూడువందల కోట్ల గ్లోబల్ సైబర్ ఫ్రాడ్ సిండికేట్ గుట్టు రట్టు కావడం సంచలనం సృష్టించింది. ఈ నేరగాళ్ల ఎంతటి సాంకేతిక నైపుణ్యంతో పనిచేస్తున్నారు. ఈనేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధిక లాభాలు వస్తాయనే ఆశ చూపిప్రజలను వంచించారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈ మాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోయారు. ఇటువంటి దోపిడీలను అరికట్టడానికి వ్యవస్థలో మార్పులు రావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆక్రమణలను సుమోటోగా స్వీకరించాలి

ఆంధ్ర రాష్ట్రంలో దొంగస్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నారు. హైకోర్టు వారు ఈ ఆక్రమణలను కూడా సుమోటోగా స్వీకరించి కూల్చివేసేందుకు ఆదేశాలు ఇవ్వాలి. దాదాపు 25 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుంది. ప్రభుత్వ భూములను ఆక్రమించిన దొంగస్వాములను తన్ని తరమి వేయాల్సిన అధికారులు, దొంగబాబాల ప్రలోభాలకు, వత్తిళ్లకు లొంగిపోయారు.

-ఎన్.వేంకటేశ్, ప్రకాశంజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన విజ ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# పిడుగు పడితే మరణ ఘంటికలే!

**అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడుగులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్ల ద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణువిద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు.**

డి. చంద్రభాను

ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కురిసిన అకాల వర్షాలు ఊహించని రీతిలో పిడుగుల బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. పొలాల్లో కష్టపడుతూ, చెట్ల కింద తలదాచుకున్న రైతులు, కూలీలు పిడుగుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు వందలాది మూగజీవాలు, పాడి పశువులు కూడా అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. విజయనగరం జిల్లాలో చెట్టు కింద నిలబడిన మహిళా కూలీలు, తెలంగాణలో పొలాలకు వెళ్లిన గొర్రెల కాపరులు, కాడెద్దులు ఇలా పిడుగుపాటుకు బలవుతున్న ఘటనలు ప్రకృతి తీవ్రతను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నాయి. ఒకప్పుడు కేవలం వర్షాకాలంలో మాత్రమే వినిపించే ఉరుములు, ఇప్పుడు నడివేసవిలోనే పల్లెలపై మృత్యు గంటల్లా మోగుతున్నాయి. నేడు ఆకాశం నల్లబడితేనే ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. ఈ పరిస్థితిని కేవలం ప్రకృతి సహజ ప్రక్రియగా భావించి పక్కన పెట్టలేం. ఈ ప్రకృతి హెచ్చరికల వెనుక మానవ తప్పిదాల పాత్ర ఎంత ఉందన్న ప్రశ్నను కూడా సమాజం ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది. పిడుగులు ఏర్పడటానికి ప్రధాన కారణం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చెరువులు, నదులు, నేలలోని తేమ వేడెక్కి నీటి ఆవిరిగా మారుతుంది. ఈవేడి గాలి వేగంగా పైకి ఎగసి, ఎత్తులో ఉన్న చల్లనిగాలిని తాకినప్పుడు భారీ క్యూమిలోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. ఈ మేఘాల లోపల నీటి బిందువులు, మంచు కణాలు బలమైన గాలుల ప్రభావంతో ఒకదానికొకటి ఢీకొంటుంటాయి. దాంతో విద్యుత్ శక్తి ఏర్పడుతుంది. అది ఒక దశలో ఒక్కసారిగా మేఘాల నుంచి భూమివైపు విడుదలవుతుంది. అదే పిడుగుపాటు. వాతావరణంలో వేడి ఎంత ఎక్కువగా ఉంటే ఈ ప్రక్రియ అంత తీవ్రంగా జరిగే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితి ఎంత ఆందోళనకరంగా మారిందో ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ మే 2026లో విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలోప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన మొత్తం మరణాల్లో 35.7 శాతం మరణాలు పిడుగుల వల్లే నమోదయ్యాయి. 2024లో దేశ వ్యాప్తంగా పిడుగుపాటు కారణంగా 2,825 మంది మరణించారు. ఇది అంతకు ముందటి ఏడాదితో పోలిస్తే 10.4 శాతం ఎక్కువ. మధ్యప్రదేశ్ (577), బీహార్ (360), ఉత్తర ప్రదేశ్ (275), ఒడిశా (249), ఛత్తీస్‌గఢ్ (241) రాష్ట్రాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి సంవత్సరం సగటున 86నుంచి 95 మంది, తెలంగాణలో కూడా దాదాపు అదే స్థాయిలో ప్రజలు పిడుగుల బారిన పడుతున్నారు. భూతాపం కారణంగా ప్రతి ఒక డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగినప్పుడు పిడుగుల తీవ్రత 8 నుంచి 10 శాతం వరకు పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ మరణాల్లో 90 శాతం కంటే ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల వారే కావడం మరింత ఆందోళన కలిగించే విషయం. పిడుగులు పెరగడానికి కేవలం ప్రకృతినే నిందించలేం. దీని వెనుక మనుషుల పాత్ర కూడా స్పష్టం



గా కనిపిస్తోంది. అడవులను విచ్చలవిడిగా నరికివేయడం, పట్టణాలు విస్తరించడం వల్ల పచ్చదనం తగ్గి భూమి నేరుగా సూర్యరశ్మిని గ్రహించి మరింత వేడెక్కుతోంది. దాంతో పిడుగులకు కారణమయ్యే మేఘాలు చాలా వేగంగా తయారవుతున్నాయి. ఇదే కాకుండా వాహనాలు, పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య వాయువులు, పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్నాయి. ఇవి మేఘాల్లో చేరినప్పుడు మంచు కణాల మధ్య ఘర్షణ మరింత పెరుగుతుంది. అంటే మనమే సృష్టిస్తున్న కాలుష్యం మేఘాలను ప్రమాదకర విద్యుత్ కేంద్రాలుగా మార్చేస్తోంది. పర్యావరణాన్ని పాడు చేస్తూ తీసుకునే ప్రతి తప్పు నిర్ణయం ఇప్పుడు పిడుగు రూపంలో మనముందుకు వస్తోంది. పిడుగుల నుంచి ప్రజలను, ముఖ్యంగా రైతులను కాపాడేందుకు మన దేశం ఇప్పుడు అంతరిక్ష సాంకేతికత, కృత్రిమ మేధస్సును సమర్థంగా ఉపయోగిస్తోంది. కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ తీసుకొచ్చిన 'దామిని' మొబైల్ యాప్ ఫోన్ జీపీఎస్ ఆధారంగా పనిచేస్తుంది. మనం ఉన్న ప్రాంతానికి 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో వచ్చే 40 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉందేమో ముందుగానే హెచ్చరిస్తుంది. అంతేకాకుండా పుణేలోని వాతావరణ పరిశోధన సంస్థ దేశవ్యాప్తంగా వందలాది మెరుపు గుర్తింపు పరికరాలను ఏర్పాటు చేసింది. ఇన్‌శాట్3డి, ఇన్‌శాట్ 3డిఆర్ ఉపగ్రహాలు, విశాఖపట్నం, హైదరాబాద్‌లోని డాప్లర్ రాడార్లు మేఘాల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. ఐఐటీ సంస్థలు కూడా పిడుగులను ముందే అంచనా వేసే కొత్త సాఫ్ట్‌వేర్‌లను తయారు చేస్తున్నాయి. అమెరికా, జపాన్, యూరప్ దేశాలు సాంకేతికత సహాయంతో పిడుగులవల్ల జరిగేనష్టాన్ని గణనీయంగా తగ్గించాయి. యూరప్‌లో శాస్త్రవేత్తలు ఆకాశంలోకి శక్తివంతమైన లేజర్ కిరణాలను పంపి పిడుగులను జనాభా లేని ప్రాంతాల వైపుమళ్లించే పద్ధతులను పరీక్షిస్తున్నారు. జపాన్‌లో ప్రత్యేక డ్రోన్లద్వారా ఇటువంటి మేఘాల్లోని విద్యుత్ శక్తిని తగ్గించే ప్రయత్నాలు చేస్తున్నారు. మన దేశంలో కూడా రాకెట్ కేంద్రాలు, అణువిద్యుత్ కేంద్రాలు, ప్రధాన నగరాల్లో ఈపద్ధతులను ప్రయోగాత్మకంగా ప్రారంభించవచ్చు. అలాగే పల్లెల్లోని పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్మార్ట్ సైరన్లు ఏర్పాటు చేసి హెచ్చరిక వ్యవస్థను బలపరచాలి. సాంకేతికత ఎంత ఉన్నాప్రజల్లో అవగాహనలేకపోతే ప్రాణనష్టం తగ్గదు. పిడుగులు ఎక్కువగా ఎత్తైన వస్తువులపైనే పడతాయి. కాబట్టి ఉరుములు వచ్చినప్పుడు చెట్లకింద నిలబడటం చాలాప్రమాదకరం. బయట బహిరంగ ప్రదేశంలో ఉన్నప్పుడు పిడుగు పడే పరిస్థితిఉంటే నేలపై పూర్తిగా పడుకోకుండా, మోకాళ్లపై వంగి తలను కిందికి పెట్టుకుని కూర్చోవాలి. అలాగే ఉరుములు వచ్చినప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం, టీవీలు, ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర నిలబడటం చేయకూడదు. ఇనుప వస్తువులు, పంపుల దగ్గర కూడా ఉండకూడదు. పిడుగుపాటు అనేది కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రకృతి మనకు ఇస్తున్న గట్టి హెచ్చరిక కూడా. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలపరచడం, గ్రామాల్లో ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించడం ఎంత అవసరమో భూతాపాన్ని, వాయు కాలుష్యాన్ని తగ్గించడం కూడా అంతే అవసరం. మానవ ప్రాణాల రక్షణేలక్ష్యంగా పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక ఉద్యమంగా మార్చినప్పుడే ఆకాశం నుంచి వచ్చే ఈ ప్రమాదం నుంచి మన సమాజాన్ని కాపాడుకోగలం. ●

# ఉపాధ్యాయుల్లో 'టెట్' గందరగోళం

నల్ల రవి కుమార్

భారతదేశ పాఠశాల విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాల పెంపుదల కోసం ఉద్దేశించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రస్తుతం దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయులలో తీవ్ర ఆందోళనకు, చర్చకు దారితీసింది. ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు 'సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టెట్ పాస్‌కావాల్సిందే' అని స్పష్టంచేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ2009)లోని సెక్షన్ 23(1) ప్రకారం పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు కనీస అర్హతలు ఉండాలని నిర్దేశించారు. దీనిని అనుసరించి జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి ఆగస్టు23, 2010న ఉపాధ్యాయ నియామకాలకు 'టెట్'ను తప్పనిసరి చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, చట్టం అమలులోకి రాకముందు, అనగా 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయుల పరిస్థితి ఏమిటనే దానిపై సుదీర్ఘ న్యాయపోరాటం నడిచింది. వివిధ ఉపాధ్యాయ సంఘాలు దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని, కాబట్టి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులైనా సరే టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని స్పష్టం చేసింది. కానీ, ఆచరణలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి ఇబ్బందులను, విధానపరమైన లోపాలను పరిశీలిస్తే ఈ నిర్ణయంలోను, టెట్ నిర్వహణ తీరులోను అనేక అసంబద్ధతలు స్పష్టమవుతాయి. చట్టాలు సాధారణంగా భవిష్యత్తు నియామకాలకు వర్తిస్తాయి తప్ప వెనుకటి తేదీల నుండి అమలు కావు. ఎప్పుడో పదిహేను నుండి ఇరవై ఐదు ఏళ్ల క్రితం నాటి నిబంధనల ప్రకారం ఎంపికై, ప్రస్తుతం 55 ఏళ్ల వయసులో పదవీ విరమణకు దగ్గరగా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను ఇప్పుడు 'టెట్' రాయమనడం, అది కూడా చట్టం రాకముందు చేరినవారికి వర్తింపజేయాలనుకోవడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్న ఉదయిస్తుంది. దశాబ్దాల బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని కేవలం ఒక అర్హత పరీక్షతో కొలవాలనుకోవడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేఅవుతుంది. ఉపాధ్యాయులు తమ దైనందిన బోధనకు సంబంధం లేని సబ్జెక్టులను కూడా టెట్లో భాగంగా రాయాల్సి రావడం మరో విడ్డూరం. ఇది బోధనా ప్రమాణాల మెరుగుదలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో అర్థం కాని పరిస్థితి. మరో ప్రధాన అసంబద్ధత టెట్ మార్కులకు ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి/డిఎస్‌సి)లో 20వెయిటేజీ ఇవ్వడం. ఉన్నత విద్యా రంగంలో లెక్చరర్ అర్హత కోసం నిర్వహించే నెట్, ఎపి సెట్ వంటి పరీక్షల మార్కులను కేవలం అర్హతగానే పరిగణిస్తారు తప్ప, నియామకాల్లో వాటికి ఎలాంటి వెయిటేజీ ఇవ్వరు. కానీ పాఠశాల విద్యలో మాత్రం టెట్ స్కోరును వెయిటేజీతో ముడిపెట్టడం వల్ల, నిరుద్యోగ అభ్యర్థులు తమ స్కోరును పెంచుకోవడం కోసం ప్రతి ఆరు నెలలకోసారి పరీక్షలు రాస్తూ తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక అర్హత పరీక్షను కేవలం స్క్రీనింగ్ టెస్ట్‌గా ఉంచకుండా, ర్యాంకింగ్ నిర్ణయించే సాధనంగా మార్చడం విద్యా విధానంలోని లోపమే. అలాగే, సాధారణంగా ఏ పరీక్షలోనైనా ఉత్తీర్ణత మార్కు35లేదా40గా ఉంటుంది. పోటీ పరీక్షలలో సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లు, వేర్వేరు కటాఫ్ మార్కులుండటం సహజం. కానీ కేవలం ఒక అర్హతపరీక్షకు సామాజిక వర్గాల వారీగా 40, 50, 60 మార్కులను క్వాలిఫైయింగ్ మార్కులుగా నిర్దేశించడం విచిత్రమైన పరిణామం. అర్హతఅనేది అభ్యర్థి కనీస నైపుణ్యాన్ని సూచిస్తుంది, అందులో ఇలాంటి వ్యత్యాసాలు హేతుబద్ధంగా లేవనే వాదన బలంగా వినిపిస్తోంది. అసలు ఎన్‌సిటిఇ ఏర్పడిన తర్వాతే దేశంలో ఉపాధ్యాయ శిక్షణ ప్రమాణాలు పడిపో యాయనే విమర్శలున్నాయి. నేడు ఉపాధ్యాయ విద్యను బోధించడానికి సరైన అర్హతలు, నైపుణ్యాలున్న అధ్యాపకులే ఆయా ఉపాధ్యాయ శిక్షణా కళాశాలల్లో లేరు. పునాది స్థాయిలోనే శిక్షణ సరిగాలేనప్పుడు, కేవలం 'టెట్'అనే ఒక పరీక్షనునిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను సాధిస్తామనుకోవడం పూర్తి అసంబద్ధత. వ్యవస్థలోని అసలు లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇప్పుడు'టెట్' అనే అస్త్రాన్ని ఉపాధ్యాయులపై రుద్దడం ఎంతవరకు సమంజసం? ప్రస్తుత గందరగోళాన్ని తొలగించి, ఉపాధ్యాయులలో నెలకొన్న ఆందోళన పోగొట్టడానికి తక్షణమే పరిష్కారమార్గాలను అన్వేషించాల్సి ఉంది. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో చట్ట సవరణ చేసి, 2011కంటే ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులందరికీ ఈ పరీక్ష నుండి శాశ్వత మినహాయింపు ఇవ్వాలి. ●

# మాననీయ నదులలో మన యమున



డా పి. జగన్నాథరావు

పుణ్యపరంపరలు కల ఏ నదిని చూసినంత మాత్రానే కోటి జన్మలలో చేసిన పాపాలు శమిస్తాయో అటువంటి నదీమతల్లి యమునానది. **'నమామి సుకృతశ్రేణీం యమునా తరంగిణీమ్ యద్వీక్షణం కోటి జన్మకృత దుష్కర్మశిక్షణమ్?'** బృహస్పతి పుష్కరునిలో కలిసి కర్కాటకంలో ప్రవేశించినది మొదలు 12 రోజులు యమునా నదిలోస్నానం చేసినంత మాత్రము చేతనేఏడుతరాల పాపాలు నశించిపోతాయి. భూమి మీద ఎన్ని తీర్థాలైతే ఉన్నాయో అవన్నీ కూడా యమునా నదిని ఆశ్రయించి ఉంటాయి. బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు, ఋషులు పితృదేవతలు అందరూ యమునా నదియందే నివసిస్తారు. ఈ కాలమునందు చేసిన స్నానము దానము పితృకార్యా లు అన్నీ గంగానదీ దగ్గర చేసిన ఫలిస్తాయి. కోటిరెట్లు ఫలిస్తాయి. ఋగ్వేదంలో గంగానదితో పాటు యమునా నది గురించి కూడా ప్రస్తావన ఉంది. హిమాలయ పర్వ తాల్లో కాళింది పర్వతాల్లో యమునా నది జన్మస్థలం, నదీ రూపం దాల్చిన సూర్యుడి కుమార్తె కాబట్టి సూర్యతనయ అనే పేరు యమునకుఉంది. కృష్ణుడికి బాల్యమంతా ఈ నది పరివాహక ప్రాంతంలోని సాగింది. భరతుడు, అంబరీషుడు, సంతనుడు మొదలైన చక్రవర్తులు ఈ నది ఒడ్డున ఎన్నో పుణ్యకార్యాలు నిర్వహించారు. భారతీయ సాహిత్యంలో మొట్టమొదట మనకు నదుల ప్రస్తావన వేదాల్లో కనిపిస్తుంది. ఇప్పటివరకుమనకు లభించిన రచనల్లో వేదాలు చాలా పురాతనమైనవి. వాటిలో ఋగ్వేదం మొదటిది. ప్రపంచంలోనే మొదటి సాహిత్య గ్రంథంగా ఋగ్వేదాన్ని భావిస్తారు. ఇది ప్రకృతి వర్ణనలకు రత్నాకరం, ఋగ్వేదంలో నదులకు జన్మస్థానాలైన పర్వతాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చినట్లుగా కనిపించదు, కానీ ఆ పర్వతాల్లో పుట్టిన నదులకు చాలాప్రాముఖ్యతను ఇచ్చి వాటిని దేవతలుగా ఆరాధించి, స్తుతించటం కనిపిస్తుంది. సూర్య, చంద్ర, అగ్ని, మరుత్తు, రాత్రి, పగలు భూమి, ఆకాశం వంటి ప్రకృతి దేవతలతో పాటుగా, నదులను కూడా ఆరాధించి స్తుతించారు. తైత్తిరీయ ఉపనిషత్తు, బ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండివాయువు, వాయువు నుండి జలం, జలం నుండి భూమి, భూమి నుండి ఔషధులు, ఔషధుల నుండి అన్నం, అన్నం నుండి జీవుడు పుట్టాయని వివరిస్తుంది. యమునానదీ పుష్కరాలు ఆరంభం జూన్ 2 నుండి జూన్ 13వరకు గురుగ్రహం సంవత్సరానికి ఒకసారి 12 రాశులలోకి, ఒక రాశి, నుండి మరో రాశిలోనికి మారినప్పుడల్లా, భారత దేశంలోని ఒక్కొక్క నదికి పుష్కరములు ఏర్పడతాయి. గురుడు కర్కాటకరాశిలో ప్రవేశించినప్పుడు యమునానదికి పుష్కరాలు వస్తాయి. ఆ సమయంలో, ఆ నది సకల తీర్థాలను తనలో నింపుకొంటుంది, అందువల్లే పుష్కర కాలంలో నదులకు మహా మహిమలు కలుగుతాయి అని మన పురాణాలు చెబుతున్నాయి. ఇది హిమవత్పర్వతంలోనే పుట్టింది. మంచు చరియల మధ్య ఇది పుట్టిన చోటుకు 4 మైళ్ళ తర్వాత జమునోత్రి ఆలయం ఉంది. మామూలుగా యమున ఇక్కడ నించి ఉదయించిందనిపేరు. ఇందులో యమునాదేవి విగ్రహం ఉంది. ఇక్కడనించి కదలి



చిన్న చిన్న శైల ప్రవాహాలను కలుపుకుంటూ దాదాపు 80 మైళ్ళు హిమాలయ ప్రాంతంలో ప్రయాణం చేసి ఖారా దాటిమరో 15 మైళ్ళు వెళ్ళి ఫైజాబాదు దగ్గర పెద్దనది అయింది. ఇక్కడినుంచే ఈ నదికి చాలా కాలవలు తీశారు. ఇది ఢిల్లీ, బాగ్పట్, బృందావ, మధుర, మహావన, ఆగ్రా, ఫిరోజాబాద్, ఇటావా, కల్పి, హామీర్పూర్ మొదలైన ప్రసిద్ధ ప్రదే శాల మీదుగా ప్రయాణంచేసి అలహాబాద్ దగ్గర గంగా నదితో కలిసింది. గంగా యమునల మధ్య ప్రయాగ నుంచి హరిద్వార్ దాకా ఉన్న ప్రదేశానికి బ్రహ్మావర్తమని, శశస్థలీ అనీ, అంతర్వేది అనీపేర్లు. యమున కళిందశిఖరం నించి ఉదయించటం చేత దానికి కళిందకన్య లేక కాళింది అని కూడా పేరు. వ్యాసుడు యమునలోని చిన్నద్వీపంలోనే పుట్టాడు. శ్రీకృష్ణుని జననం, విహారం యమునతో సన్నిహితమైనవి. ప్రపంచ దేశాలలో నదులు అక్కడి ప్రజలకు కేవలం భౌతిక జీవనాధారాలుగాపరిగణింపబడుతున్నాయి. కాని భారతదేశంలో అవి సాంస్కృతిక, ధార్మిక జీవనానికి ఆధారాలుగా పరిగణింపబడుతున్నాయి. భారతీయులు మన నదీనదాల మూలోత్పత్తులను, వాని వెనుకగల అధిదైవిక శక్తులను గుర్తించి పరంపరాగతంగా పరమ పవిత్రాలుగాను, తీర్థక్షేత్రాలుగాను, ముక్తిసాధనాలుగాను ఆరాధిస్తూ వచ్చారు. **"గంగే చ యమునే కృష్ణ గోదావరి సరస్వతి నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"** అంటూ స్నాన సమయంలో అనేక నదులను నిత్యం స్మరిస్తారు. మన ధర్మంలో దైవచింతన, ఆధ్యాత్మికత, దేశ చింతన, సమాజ చింతన, అఖండ జాతీయతా దృష్టి అన్నీ పెనవేసుకుని వున్నాయి. పూర్ణయాత్ర అంటే ఆధ్యాత్మిక దృష్టి, యావద్దేశసందర్శనమే కదా! నిత్యం అన్ని నదులను స్మరించుకోవాలంటే అర్థం దేశం మొత్తాన్ని అందులోని అణువణువును అందులోని దైవీశక్తి సంపదను స్మరించుకోవాలనేకదా! పవిత్ర నదీనదాల ప్రశస్తి మన ఆధ్యాత్మిక సంపదకు మూలభూతం. తీర్థయాత్రలవలన సమాజంలో ప్రతివారు తమకు చేతనయినంత లోకజ్ఞానాన్ని పొందడానికి అవకాశముంది. ఈపవిత్ర భావాల స్మరణద్వారా ప్రతివాడి భావాలు సంస్కరించబడతాయి. ఆదర్శంగా ప్రవర్తించడానికి కొంత జంకు ఏర్పడుతుంది. రాజు తాను స్వయంగా తీర్థసేవ ఆచరించి ప్రజలకు మార్గదర్శి అయినాడు తనచే పాలింపబడే రాజ్యానికి సరైన న్యాయం చేకూర్చగలుగుతాడు. రాముడు మానవుడు, రాజు. సంపూర్ణ మానవత్వమనేది ఆ జీవితంలో కనిపిస్తుంది. ఆయా సందర్భాలలో రాముడు తన విధులను సామాన్యునివలె నిర్వర్తించాడు నదులవద్ద. అట్లే అర్జునుడు బలరాముడు మున్నగువారు యాత్రల ద్వారా సమాజాన్ని దర్శించి జాతీయ అవగాహన పెంపొందించుకున్నారు. భారతంలో ధర్మపక్షపరులైన ప్రతివారు ఆధ్యాత్మిక జీవితాన్ని పూర్తిగా కొనసాగించకపోయినా కొంతకాలమైన తప్పనిసరిగా దాన్ని ఆచరించి భావసంస్కారాన్ని పొందారు. రాముడు వనవాస సమయంలో భరద్వాజాశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత చిత్రకూట పర్వతం వద్దకు వెళుతూ మధ్యలో గంగా, యమునల సంగమాన్ని చూచాడు. యమునాతీరం నుండి తెప్ప సాయముతో యమునా నదిని దాటాడు. అక్కడ సీతాదేవి యమునానదికి తమవనవాసాన్ని శుభప్రదంగ ముగింపచేయమని ప్రార్థించింది. పట్టాభిషేకానంతరం మధ్యదానం, గోదానం నీ పేర చేయిస్తానని మొక్కింది. యమునానది ఒడ్డునే మాంధాత జన్మస్థలంఉన్నది. గంగా యమునల సంగమంలో వేదాలు అధ్యయనం చేయబడ్డాయి. యజ్ఞాలు అనుష్ఠింపబడ్డాయి. 60కోట్ల పుణ్యతీర్థాలు ఈ సంగమంలో కలిసుంటాయి. ఇందులో స్నానం చేసి రాజసూయ అశ్వమేధ యజ్ఞఫలాన్ని పొందుతారు. సత్య వాదులౌతారు. గంగా, యమునా నదుల్లో స్నానమాచరించి చతుర్వేద పఠన ఫలాన్ని పొందుతారని భారతంలో ప్రశంసించబడింది. ●



## గర్భిణీల పోషకాహారంలో చచ్చిన పాము

**భోపాల్, జూన్ 7:** మధ్యప్రదేశ్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో అంగన్వాడీ ఆహారంలో చనిపోయిన పాము కనిపించింది. అంగన్వాడీ సెంటర్ల ద్వారా గర్భిణీలకు అందించే పోషకాహార లడ్డూ ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం స్థానికంగా కలకలం కలిగించింది. ఈ ఘటన పాండుర జిల్లాలోని కర్భాట్ కమ్మి గ్రామంలో చోటుచేసుకుంది. వచలా బాయి ధుర్వే అనే గర్భిణీ స్త్రీకి అంగన్వాడీ కేంద్రంనుంచి పోషకాహార ప్యాకెట్ అందించారు. ఇంటికితీసుకెళ్లిన తర్వాత కుటుంబీకులు ఆ ప్యాకెట్‌ను తెరిచి చూడగా అందులో చనిపోయిన పాము పిల్ల కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగాషాక్ అయ్యారు. అయితే, ఈ ఆహారాన్ని ఎవరూ తినకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఫుడ్ శాంపిళ్లను పరీక్ష కోసం పంపారు.

## ఎఐ కంపెనీల్లో అమెరికా ప్రజలకు వాటాలు

### డొనాల్డ్‌ట్రంప్ కొత్త వ్యూహాలు

**వాషింగ్టన్,జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీలకు సంబంధించి ఒక సంచలన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. ప్రముఖ ఎఐ సంస్థలు అమెరికన్ ప్రజలకు తమ కంపెనీల్లో వాటాలను ఇచ్చేలా ఒక సరికొత్త విధానాన్ని తీసుకురావాలని తన బృందం యోచిస్తోందని ఆయన వెల్లడించారు. వచ్చేవారం ఎఐ రంగానికి చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో తాను సమావేశం కానున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇది చాలా ఆసక్తికరమైన ఆలోచన. దీనివల్ల ఎఐ కంపెనీలకు, అమెరికా ప్రజలకు మధ్య ఒక మంచి భాగస్వామ్యం ఏర్పడుతుంది. దీనిపై మేము కచ్చితంగా ఆలోచిస్తామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భాగస్వామ్యంపై ముందస్తు చర్చలు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. అమెరికా ప్రభుత్వ ఉన్నతాధికారులు అప్పుడే కొన్ని ఎఐ కంపెనీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అమెరికా ప్రభుత్వం కొన్ని ప్రముఖ కృత్రిమమేధ సంస్థల షేర్లను కొనుగోలు చేసి, వాటిలో భాగస్వామ్యం తీసుకునే అవకాశం ఉందనే అంశం కూడా ఈ చర్చల్లో వచ్చినట్లు తెలుస్తోంది.

## జ్యూయెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్

### నలుగురు మృతి

**సూరత్, జూన్ 7:** గుజరాత్‌లోని పారిశ్రామిక నగరం సూరత్‌లోని జ్యువెలరీ తయారీ యూనిట్‌లో విషవాయువు లీక్ అయి ఓ సూపర్‌వైజర్ సహా నలుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం అశ్విని కుమార్ రోడ్డు పరిధిలోని జ్యువెలరీ తయారీ ప్రక్రియలో వెలువడే రసాయన వ్యర్థాలను సేకరించేందుకు ఆ ఫ్యాక్టరీ ఆవరణలో ఓ ఈటీపీ సెప్టిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి 2 నెలలకు ఒకసారి ఈ ట్యాంక్‌ను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఎప్పటిలాగే ఇవాళ ఉదయం ఓ సూపర్‌వైజర్, ముగ్గురు కార్మికులతో కూడిన నలుగురు సభ్యుల బృందం ఆ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి వెళ్లింది. ట్యాంక్ క్లీన్ చేస్తున్న సమయంలో ఓ కార్మికుడు అకస్మాత్తుగా లోపలికి జారిపడిపోయాడు. అతడని కాపాడే క్రమంలో మిగిలిన ముగ్గురు కూడా ఒకరి వెనుక ఒకరు ట్యాంక్ లోపలికి దిగారు. ట్యాంక్‌లో అప్పటికే పేరుకుపోయిన రసాయనాల వల్ల తీవ్రమైన విషవాయువులు వెలువడటంతో, ఊపిరాడక నలుగురు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయి ప్రాణాలు విడిచారు.

## మళయాల నటుడు సలీమ్‌కుమార్ కన్నుమూత



**తిరువనంతపురం, జూన్ 7:** మలయాళ చిత్ర పరిశ్రమ అద్భుత మైన నటుణ్ని కోల్పోయింది. మలయాళ సీనియర్ నటుడు, జాతీయ అవార్డు గ్రహీత సలీం కుమార్ కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన, కేరళలోని కొచ్చిలో ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించి, గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్య వర్గాలు అధికారికంగా వెల్లడించాయి. ఆయన మరణవార్త విన్న సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

# వంటింట్లో గ్యాస్ మంట!

## సిలిండర్ ధర పెంపు

### రూ. 29 పెంచిన ఒఎంసిలు

### పెంపుపై ఖర్గే మండిపాటు

### సమర్థించుకున్న కేంద్రం



**న్యూఢిల్లీ,జూన్ 7:** దేశంలో సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై ఎన్డీయే సర్కారు భారం పెంచుతోంది. గృహిణుల వంటింటి వ్యయాలు పెంచుతూ పోతోంది. ఓపక్క పొదుపు మంత్రం పఠిస్తూనే పెట్రోడీజిల్‌తోపాటు వంటగ్యాస్‌ధరలు కూడా పెంచుతూ వస్తోంది. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకంగా వాడుకుంటున్నదని విపక్షాలు మండిపడుతున్న తరుణంలో తాజాగా రెండోసారి వంటగ్యాస్ ధరలను పెంచింది. దీనివల్ల మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై మరోసారి ధరల మరింత భారం పడింది. గృహావసరాలకు ఉపయోగించే 14.2 కిలోల ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రూ. 29 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ పెంచిన ధరలు ఆదివారం నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా వివిధ నగరాల్లో ఈ ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చు. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 913 నుంచి రూ. 942కి పెరిగింది. గత మూడు నెలల వ్యవధిలో వంటగ్యాస్ ధరలు పెరగడం ఇది రెండోసారి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ముడి చమురు, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా భారతదేశానికి గ్యాస్ సరఫరా అయ్యే కీలకమైన హార్ముజ్ జలసంధి మార్గంలో ఏర్పడిన అంతరాయాలు దేశీయ ధరలపై ప్రభావం చూపాయి. ఈ సవరణకు ముందు వరకు చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాలపై సిలిండర్‌కు సుమారు రూ. 703 వరకు నష్టాన్ని భరిస్తూ వచ్చాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ తాజా పెంపు తర్వాత కూడా అంతర్జాతీయ కొనుగోలు ధరకు, దేశీయ విక్రయ ధరకు మధ్య ఉన్న వ్యత్యాసం పూర్తిగా భర్తీ కాలేదని తెలుస్తోంది. గత మార్చి నెలలో కూడా సిలిండర్ ధరను రూ. 60 పెంచిన సంగతి తెలిసిందే. వంటగ్యాస్ మాత్రమే కాకుండా, కొన్ని వారాలుగా ఇతర ఇంధన ధరలు కూడా సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి. మేనెల మధ్యస్తం నుంచి ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ. 7.50 వరకు పెరగ్గా, కంప్రెస్డ్ నేచరల్ గ్యాస్ సీఎన్జీ ధరలు కిలోకు రూ. 6 వరకు పెరిగాయి. ఇంత పెరిగినప్పటికీ, ఆయిల్ కంపెనీలు ఇంకా పెట్రోల్‌పై లీటరుకు రూ. 11, డీజిల్‌పై రూ. 33.6 చొప్పున నష్టాన్ని భరిస్తున్నట్టు సమాచారం. ఈ వరుస ధరల పెంపు దేశంలోని కోట్ల మంది గృహిణుల నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తోంది. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోకి రాయితీ జమ అవుతున్నప్పటికీ, రాయితీ లేని సాధారణ వినియోగదారులు మాత్రం ఈ భారాన్ని పూర్తిగా మోయక తప్పడం లేదు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం పైప్డ్ నేచరల్ గ్యాస్ వంటి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గులు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతూనే ఉన్నాయి.

**మల్లిఖార్జున్‌ఖర్గే విసుర్లు**

ఎల్జీజీ ధరలు రెండోసారి పెంచడంపై ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే మండిపడ్డారు. యుపిఎ హయాంలో ఒక్కసారి ధరల సవరణ జరిగితేనే ద్రవ్యోల్బణం కట్టడిచేయలేకపోతోందంటూ వీధుల్లోకి వచ్చిన బిజెపి ఇపుడేమి సమాధానం ఇస్తుందని, పశ్చిమాసియా ఉద్రిక్తతల మాటున సామాన్య మధ్యతరగతిప్రజలపై వంటింటి భారం పెంచుతోందని విమర్శించారు. గడచిన నాలుగు నెలల్లోనే మోడీ ప్రభుత్వం దేశీయ ఎల్పీజీ సిలిండర్లధరలను రూ.89 రూపాయలు పెంచిందని గుర్తుచేసారు. మోడీజీ పార్లమెంటులో ఇంధన వనరులను 41 దేశాలనుంచి రప్పించుకుంటున్నట్లు పార్లమెంటులోనే చెప్పారని, అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కొరత ఎందుకు ఉన్నదని ప్రశ్నించారు. ఉజ్వల స్కీం కింద 5.56 కోట్ల కుటుంబాలకు సింగిల్ సిలిండర్‌కూడా పొందలేకపోయారని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని మోడీ ప్రభుత్వం లాభదాయకతను పెంచుకోడానికి వాడుకుంటున్నదని మండిపడ్డారు.

## మెట్రోలో సిఎం డికె శివకుమార్ ప్రయాణం



**బెంగళూరు, జూన్ 7:** కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత డికె శివకుమార్ తొలిసారిగా తన సొంత నియోజకవర్గమైన కనకపురలో పర్యటించారు. సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు, ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి డికె శివకుమార్ విధాన సౌధ మెట్రోస్టేషన్ నుంచి కనకపుర మెట్రోస్టేషన్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఏ విధమైన హంగూ ఆర్భాటాలు లేకుండా ఒక సామాన్యుడిలా మెట్రో ఎక్కిన ముఖ్యమంత్రిని చూసి తోటి ప్రయాణికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ ప్రయాణంలో భాగంగా ఆయన రైల్లోని ప్రయాణికులతో చాలా సాదాసీదాగా, సరదాగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నన్ను దొడ్డనహళ్లి, శాతనూర్ కనక్‌పుర, బెంగళూరుసౌత్‌లనుంచి విధాన సౌధకు తెచ్చారని, ప్రజలు నన్ను చూడాలనుకుంటున్నారని, నేనే వారికి సమయం ఇవ్వడంలేదని, అందుకు తాను కూడా బాధపడుతున్నానని అన్నారు. అందువల్లనే తనను కలిసేందుకు రావద్దని నేనే వస్తానని చెప్పానన్నారు.

అందుకే నా మొదటి పర్యటనగా నా నియోజకవర్గంలోకి వచ్చానన్నారు. ఎన్నుకున్న ప్రజలకు నాబాధ్యతగా కృతజ్ఞతలు చెప్పాలన్న లక్ష్యంతో వచ్చానన్నారు. ప్రజలను కలుసుకునేందుకు తన నియోజకవర్గంలో 20-25 కేంద్రాలు గుర్తించానని అన్నారు. అంతేకాకుండా ప్రజలను కలిసి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులను కూడా వేరుగా నియమిస్తానన్నారు. మెట్రో ప్రయాణం ముగిసిన తర్వాత కనకపుర స్టేషన్ వద్ద దిగి, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ముందుకు సాగారు. వినూత్నంగా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెట్రోను ఎంచుకున్న సిఎం డికె శివకుమార్‌పై బెంగళూరు ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సిఎం మొదటి పర్యటన కావడంతో కనకపుర తాలూకాలో ఉదయంనుంచి రాత్రివరకూ ఆదివారం పలు కార్యక్రమాలు ఏర్పాటుచేసారు.

## కోట్ల ఆస్తివివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణం

**న్యూఢిల్లీ,జూన్ 7:** ఆస్తి వివాదమే ఢిల్లీ ప్రొఫెసర్ హత్యకు కారణమని కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని శివాజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న దేవేస్మితా పాల్ అనే మహిళ హత్యకు గురైంది. నగరంలోని వసుంధరా ఎన్‌క్లేవ్‌లోని తన అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గత గురువారం హత్యకు గురైంది. ఈమెకు, ఒక దంపతులకు మధ్య ఒక ఫ్లాట్‌కు సంబంధించి వివాదం నడుస్తోంది. దేవోస్మితకు పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఒక ఫ్లాట్ ఉంది. అది ఆమె తాతముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చింది. అక్కడ ఆ ఫ్లాట్‌ను వారు దంపతులకు అద్దెకు ఇచ్చారు. కొన్నాళ్లుగా వారు అక్కడ అద్దెకు ఉంటున్నారు. ఆ ఫ్లాట్ బాగా నచ్చిన ఆ దంపతులు దాన్ని కొనాలనుకున్నారు. ఈ విషయం యజమాని అయిన దేవోస్మితకు, ఆమె సోదరులకు చెప్పారు. వారంతా దీనికి అంగీకరించారు. ఆ ఫ్లాట్ అమ్మాలని డిసైడ్ అయ్యారు. అది కోట్ల విలువ ఉంటుంది. ఆ కుటుంబంలో దేవోస్మిత మినహా అందరూ ఫ్లాట్ అమ్మేందుకు అంగీకరించారు. దాన్ని ఎట్టిపరిస్థితుల్లో అమ్మేది లేదని దేవోస్మిత తేల్చి చెప్పింది. తాము ఫ్లాట్ కొనడానికి ఏకైక అడ్డంకిగా ఉన్నదని ఆ దంపతులు దేవోస్మితను హత్య చేశారు. మృతురాలు దేవోస్మిత సోదరి దేవరతి పాల్ ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో అనుమానం వచ్చి ఫ్లాట్ తలుపులు పగలగొట్టి చూడగా, దేవోస్మిత రక్తపు మడుగులో శవమై కనిపించింది. సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి సిసిటివి ఫుటేజీలను పరిశీలించారు. అందులో మాస్కులు ధరించిన ఓ పురుషుడు, స్త్రీ అనుమానాస్పదంగా మెట్లు ఎక్కి ఫ్లాట్ వైపు వెళ్లడం, దాదాపు 30 నిమిషాల తర్వాత దుస్తులు మార్చుకుని బయటకు రావడం రికార్డ్ అయ్యింది. ప్రత్యేక బృందాలు పశ్చిమ బెంగాల్ వెళ్లి నిందితులను అరెస్ట్ చేసి, తదుపరి విచారణ నిమిత్తం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తరలిస్తున్నారు. మాస్కులు ధరించి, లిఫ్ట్ వాడకుండా మెట్లమార్గంలో ఆమె ఫ్లాట్లోకి చేరుకుని, హత్య చేశారు. వారు ఫ్లాట్‌లోకి వెళ్లడం అక్కడి సీసీ కెమెరాలో రికార్డైంది. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపారు. నిందితులైన దంపతులను గుర్తించి అరెస్టు చేశారు.

## మోడీ ఇచ్చిన వజ్రాన్ని కొనాలనుకున్నా: జిల్ బైడెన్



**వాషింగ్టన్, జూన్ 7:** జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రధాని మోడీ బహూకరించిన 7.5 క్యారెట్ల సింథటిక్ వజ్రాన్ని అమెరికా మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్ గుర్తు చేసుకున్నారు. మోడీ బహుమతిగా ఇచ్చిన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని తొలుత అనుకున్నానని.. కానీ, అమెరికా అధికారులు దానికి ఎక్కువ విలువ కట్టడంతో ఆ డైమండ్‌ను ఫెడరల్ ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేసినట్లు 'వ్యూ ఫ్రమ్ ది ఈస్ట్ వింగ్ : ఎ మెమోరియల్' అనే తన ఆత్మకథలో రాసుకొచ్చారు. ఈ పుస్తకంలో వైట్‌హౌస్‌లోని తెరవెనుక జీవితం గురించి.. అధ్యక్షుడి కుటుంబం అందుకునే బహుమతులకు ఉన్న నిబంధనల గురించి జిల్ బైడెన్ వివరించారు. 2023, జూన్‌లో అమెరికా అధ్యక్ష భవనం ఇచ్చిన అధికారిక విందులో మోడీ అతిథిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన బహూకరించిన వజ్రం తనను ఎంతో ఆకర్షించిందని.. చాలా అద్భుతంగా ఉందని జిల్ బైడెన్ పేర్కొన్నారు. అయితే బైడెన్ పదవి తప్పుకున్న తర్వాత అమెరికా నియమాల ప్రకారం.. ఆ బహుమతిని తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి వచ్చిందని తెలిపారు. దానికి అప్పట్లో ఉన్న మార్కెట్ విలువను చెల్లించి కొనుగోలు చేయాలని తాను అనుకున్నట్లు తెలిపారు.

విదేశాంగ శాఖ వజ్రం విలువను 20 వేల డాలర్లుగా అంచనా వేయడంతో దానిని కొనుగోలు చేయలేదని పేర్కొన్నారు. అందుకు బదులుగా ఆ వజ్రాన్ని అరువుగా తీసుకుని అధికారిక కార్యక్రమాల్లో ధరించడానికి అధికారులు తనకు అనుమతి ఇచ్చారని అన్నారు. దీంతో ఆ డైమండ్‌ను ఓ ఉంగరానికి పొదిగించి ధరించినట్లు తెలిపారు. ఫ్రాన్స్ ప్రథమ మహిళ బ్రిగిట్టే మెక్రాన్ తనకు ఇచ్చిన బ్రాస్‌లెట్‌ను అమెరికా ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

## భారత్‌లో పడిపోతున్న జననాల రేటు: ఎలాన్ మస్క్



**న్యూయార్కు, జూన్ 7:** ప్రపంచ కుబేరుడు, స్పేస్‌ఎక్స్ సిఇఒ ఎలాన్ మస్క్ భారత్‌లో జననాల రేటు గణనీయంగా తగ్గుతోందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన పునఃస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఆయన హైలైట్ చేశారు. ఈ అంశంపై మీడియా సంస్థ ఏఎఫ్ పోస్ట్ షేర్ చేసిన డేటాను ప్రస్తావిస్తూ మస్క్ ఎక్స్ వేదికగా స్పందించారు. భారత్‌లో జననాల రేటురీప్లేస్‌మెంట్ స్థాయి కంటే తగ్గింది. ఉన్నత విద్యావంతుల్లో ఈ రేటు చాలా యేళ్ల క్రితమే పడిపోయిందని తన పోస్టులో పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) ప్రతి మహిళకు 2.1 పిల్లలు అనే ప్రతిస్థాపన స్థాయి కంటే కిందకు పడిపోయిందని ఏఎఫ్ పోస్ట్ నివేదిక వెల్లడించింది. గత దశాబ్ద కాలంలోనే ఈ రేటు 2.3 నుంచి 1.9కి క్షీణించిందని తెలిపింది. ఢిల్లీలో అయితే ఈ రేటు 1.2కి పడిపోయిందని, ఇది ఫిన్‌లాండ్ కంటే కూడా తక్కువని నివేదిక పేర్కొంది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్ఎఫ్‌పిఎ) విడుదల చేసిన స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్ట్ 2025 కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. భారతదేశంలో సంతానోత్పత్తి రేటు 1.9గా నమోదైందని, ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే తక్కువ అని స్పష్టం చేసింది. సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో ప్రతి తరం మునుపటి తరం కంటే చిన్నదిగా మారి, దేశ జనాభా క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని నివేదిక విశ్లేషించింది.

జననాల రేటు తగ్గుతున్నప్పటికీ, 146 కోట్లకు పైగా జనాభాతో భారత్ ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా కొనసాగుతోంది. 2023లో చైనాను అధిగమించి భారత్ ఈ స్థానానికి చేరుకుంది. విద్య, పట్టణీకరణ పెరగడం, మహిళలు ఉద్యోగాల్లో చేరడం, మారుతున్న కుటుంబ ప్రాధాన్యతలువంటివి జననాల రేటు తగ్గడానికి ప్రధాన కారణాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక అసమానతలు, ప్రసూతి మరణాలు, లింగ వివక్ష వంటి సవాళ్లు ఉన్నాయని యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక తెలిపింది.



## గల్ఫ్ మిత్ర దేశాల కోసం ఇరాన్ ఆస్తులపై అమెరికా కన్ను?

**వాషింగ్టన్, జూన్ 7:** ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనకపోయినా.. అమెరికా-ఇరాన్ మధ్య పోరులో గల్ఫ్ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. యుద్ధం కారణంగా ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీంతో గల్ఫ్ మిత్రదేశాల పునర్నిర్మాణానికి సాయం అందించాలని అమెరికా భావిస్తున్నట్లు తెలుస్తోంది, ఇందుకోసం ఇరాన్ ఆస్తులను వినియోగించుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్ యుద్ధం కారణంగా గల్ఫ్ మిత్రదేశాలకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఒక బృందాన్ని ఆదేశించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు ఇరాన్ ఆస్తులను ఉపయోగించడాన్ని వారు పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. ఈ ఆస్తులను భవిష్యత్తు పునర్నిర్మాణం, మరమ్మతుల కోసమే కాకుండా.. ఇప్పటికే భాగస్వాములకు జరిగిన నష్టానికి పరిహారంగా అందించాలని భావిస్తున్నట్లు వెల్లడించాయి. అయితే, ఇరాన్‌కు చెందిన ఏ ఆస్తులను పరిగణనలోకి తీసుకున్నారనే విషయాన్ని స్పష్టం చేయలేదు.



## అభిలాషా బరాక్‌కు యుఎన్ అవార్డుపై ప్రధాని మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ,జూన్ 7:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మేజర్ అభిలాషా బరాక్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి అందించే యూఎన్ మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఆమె ఎంపిక కావడం పట్ల ప్రధాని మోడీ ప్రశంసలు కురిపించారు. ప్రస్తుతం మేజర్ బరాక్ లెబనాన్‌లోని ఐక్యరాజ్యసమితి తాత్కాలిక బలగాలలో ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గా, జెండర్ ఫోకల్ పాయింట్‌గా తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆమెకు దక్కిన ఈ గౌరవం ఆమె అసాధారణ సేవలకు నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఈ అవార్డు మేజర్ బరాక్ ప్రతిభను గుర్తించడంతో పాటు, ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక దేశాల్లో భారతదేశం సుదీర్ఘకాలంగా అందిస్తున్న సహకారానికి దక్కిన గొప్ప గుర్తింపు అని ప్రధాని మోడీ కొనియాడారు. దేశానికి, మానవాళికి సేవ చేయాలనుకునే కోట్లాది మంది యువ భారతీయులకు, ముఖ్యంగా భారతీయ కుమార్తెలకు (మహిళలకు) ఆమె సాధించిన ఈ విజయం ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రధాని తన సందేశంలో ఆకాంక్షించారు.



## ఇది ట్రైలర్ మాత్రమే!

### కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాల్సిందే

### లేదంటే దేశవ్యాప్త ఉద్యమం: కాక్రోచ్ పార్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ,జూన్ 7:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఏడు రోజుల్లోగా మంత్రి తన పదవి నుంచి తప్పుకోవాలని, లేదంటే దేశవ్యాప్తంగా నిరసనలను ఉధృతం చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముందురోజు జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో తాము చేపట్టిన శాంతియుత నిరసన ఒక చరిత్ర అని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. 'బొద్దింకలు' ఏకమైతే ఏం చేయగలవో ప్రభుత్వానికి మేం చూపించిన ట్రైలర్ ఇది. నిన్నటి నిరసనలో పాల్గొన్న వారిలో చాలామందికి అదే తొలిసారి. అయినా, విద్యావ్యవస్థపై తమకున్న తీవ్రమైన కోపాన్ని, నిరాశను వ్యక్తం చేయడానికి వారు ధైర్యంగా ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా నిరసనలో పాల్గొన్న యువత, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. శాంతియుత నిరసనే మన గొప్ప బలం. ఐక్యంగా ఉన్న శాంతియుత ఉద్యమాన్ని ప్రభుత్వం ఏమీ చేయలేదు. మనం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ ఒక తరానికి అన్యాయం చేశారని ఆరోపించిన ఆయన, ఈ విషయం ఇక్కడితో ముగిసిపోదని స్పష్టంచేశారు. తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఈరోజు ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో మాట్లాడతానని ఆయన తన అనుచరులకు సూచించారు.

## విదేశాల్లో కూర్చుని పార్టీలు నడిపించలేరు

### సిజెపిపై బిజెపి చీఫ్ నితిన్ నబిన్ ఘాటు విమర్శలు



**రాంచి, జూన్ 7:** కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) శనివారం జంతర్ మంతర్‌వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. నీట్ పేపర్ లీక్‌పై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఘటనపై బిజెపి చీఫ్ నితిన్ నబీన్ స్పందించారు. సిజెపిపై పరోక్ష విమర్శలు చేశారు. భారత్ యువతను డిజిటల్ ప్రచారాలతో తప్పుదారిపట్టించే ప్రయత్నాలను దేశం సహించదని అన్నారు. విదేశాల్లో కూర్చొని భారత యువతను ఆడించలేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్‌లోని రాంచీలో పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, దేశ యువతను ప్రతికూల రాజకీయాల వైపు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత యువత సానుకూల రాజకీయాలను మాత్రమే విశ్వసిస్తుందని చెప్పారు.

# వ్యాపారలావాదేవీల్లో విభేదాలతో గొడవలు

## ఇరువర్గాలపై కేసులు నమోదు

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** హోటల్స్ వ్యాపార లావాదేవీల్లో విభేదాలు తలెత్తడంతో రెండు వర్గాలు బాహాబాహీగా గొడవపడ్డాయి. చేతులకు దొరికిన రాడ్లు, గాజుసీసాలేక్క బాటిళ్లతో పరస్పరం దాడులకు దిగారు. ఈ ఉదంతంపై పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను విచారణ చేసి కేసు నమోదు చేశారు. తిరుమలలో అనధికారికంగా వ్యాపారం చేసుకుంటున్న రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు బాలాజీ, దిలీప్, విజయ్ కుమార్, పవన్, శివ కుమార్,లక్ష్మీ దేవి, మురుగా, మరోవర్గం తోట దీరజ్ కుమార్, గోగుల శ్రీకాంత్, గోగుల కోటి, శ్రీనివాసులు, వరుణ్, సాయి వ్యక్తుల మధ్య పాత, వ్యక్తిగత విభేదాలు ఆధిపత్య పోరు కారణంగా వాగ్వాదం చోటుచేసుకొంది. ఈ ఘటనలో ఇరు వర్గాలకు చెందిన కొందరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న తిరుమల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి, ఘర్షణకు పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, ఇరు వర్గాలపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఇరు వర్గాల నుండి అందిన ఫిర్యాదుల మేరకు సంబంధిత నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఇరువర్గాలకు చెందిన వారిని అరెస్ట్ చేసినట్లు తిరుమల డీఎస్పీ విజయశేఖర్ తెలిపారు. తిరుమలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఏ వ్యక్తులైనా, వారు ఎంతటి వారైనా చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ ఆదేశాలతో మీ చుట్టు పక్కల భద్రతాపరమైన ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 112 ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.



# ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక సాధనం

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** యోగా అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరి జీవితంలో నిత్య సాధన కావాలని తిరుపతి సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గ దర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. జూన్ 7వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు అన్ని సచివాలయాలు, మండలాలు, డివిజన్లు జిల్లా స్థాయిలలో విస్తృతంగా యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ సూచనల మేరకు జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో కూడా ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఆదివారం ఉదయం ఎస్వి జూపార్క్‌లో ఈ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జూన్ 12న చారిత్రాత్మకమైన చంద్రగిరి కోటలో మరో ప్రత్యేక యోగా ఆంధ్ర కార్యక్రమం ఉంటుం దన్నారు. గ్రామ, సచివాలయ, మండల, డివిజన్ జిల్లా స్థాయిలలో ప్రతిరోజూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లాలో సుమారు 200 మంది మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేయడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోవిందరావు, డి ఆర్ఓ నరసింహులు, హస్తకళల బోర్డుసంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నంసింహ యాదవ్, నాయి బ్రాహ్మణ కార్పొరే షన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ మంత్రి పరసారత్నం,రాష్ట్ర పర్యాటకశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మునిరత్నం, బిజెపి అధికారి ప్రతినిధి జల్లి మధుసూదన్, బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పం డుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలను ఆసక్తిగా వింటూ ప్రజలు, అధికారులు, యువత మహిళలు ఆసనాలు వేయడం జరిగింది.





# యోగతో ఆత్మవిశ్వాసం: టిటిడి ఇఒ రవిచంద్ర

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** యోగ సాధన ద్వారా వ్యక్తి జీవితంలో సమతుల్యత, ప్రశాంతత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. జూన్ 7 నుంచి 21 వరకు టిటిడి ఉద్యోగులందరూ క్రమం తప్పకుండా యోగ సాధనలో పాల్గొనాలని సూచించారు. యోగాభ్యాసం వల్ల ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం ఉంటుందన్నారు. ప్రారంభంలో యోగ కొంత కష్టంగా అనిపించినప్పటికీ, నిరంతర సాధన ద్వారా శరీరం, మనస్సు పై సంపూర్ణ నియంత్రణ సాధించవచ్చని చెప్పారు. యోగతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం, అంతర్గత చైతన్యం పెంపొందుతాయని వివరించారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం (జూన్ 21) సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యోగ-టిటిడి ఆరోగ్యానంద' కార్యక్రమాన్ని ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రారంభించారు. మానసిక ఒత్తిడికి యోగానే ఉత్తమ పరిష్కారమని అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు.

నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడులు, వృత్తిపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి యోగ సాధన అత్యంత అవసరమని అన్నారు. యోగ ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, భావోద్వేగ నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. యోగ అనేది కేవలం ఆరోగ్య సాధన మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకమని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ అన్నారు. జూన్ 20 వరకు యోగా ప్రామాణిక విధానాల ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఉద్యోగి ప్రతిరోజూ ఉదయం జరిగే యోగాభ్యాసంలో పాల్గొనాలని కోరారు. యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 18, 19, 20 తేదీలలో ఉద్యోగులకు యోగ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జూన్ 21న టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు టిటిడి పరిపాలనా భవనం, ఎస్వీ ఆయుర్వేద కళాశాల, స్విమ్స్, బర్డ్, శ్వేత భవనం, ఎస్వీ సంగీత కళాశాల, గోవింద రాజస్వామి ఆలయం తదితర కేంద్రాలలో ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది గంటపాటు యోగా సనాలు నిర్వహించారు.

అనంతరం భారీ ర్యాలీగా మహతి కళాక్షేత్రానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. యోగా మాస్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, వివిధ యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఒ కె.వి. మురళీకృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, హెచ్‌డీపీపీ ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, డిప్యూటీ ఇఒలు ఆనందరాజు, గోవిందరాజన్, శివప్రసాద్, సెల్వం, సిఎంఒడాక్టర్ కుసుమకుమారి, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి , శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి

**తిరుపతి,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం)ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీ డీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమ వారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనం తపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి విని యోగదారులు 8977716661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు.

కాగా డయల్ యువర్ ఎస్పీ డీసీఎల్ తో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుండి నుంచి 9: 30 గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ" విని యోగదారు లు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది.తిరుపతి:8712652679, ,చిత్తూరు: 7993147979,నెల్లూరు: 08612320427, అన్నమయ్య:9440817449,కడప: 08562242457,కర్నూలు:7382614308, నంద్యాల:7382618976, అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847.

# సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే నాయకత్వం

### భారత్ రష్యా బంధం విడదీయలేనిది

### మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలి

### రష్యా ఇండియన్ డయాస్పోరా సమావేశంలో మంత్రి నారా లోకేష్



ప్రవాస భారతీయ సంఘ ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్

**విజయవాడ, జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షోభంలోనూ అవకాశాలను సృష్టించడమే అసలైన నాయకత్వమని, ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకే తాను రష్యాలో పర్యటిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రష్యా పర్యటనలో భాగంగా మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో ప్రవాస భారతీయులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రష్యాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులు, తెలుగు కుటుంబాలు, విద్యార్థులు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మనల్ని ఒకచోట చేర్చిన మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి నా కృతజ్ఞతలు. మీరు భారతదేశాన్ని విడిచి ఇక్కడకు వచ్చారు..కానీ భారతదేశం మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టదు. స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మన విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలు, దేశం పట్ల ప్రేమను నిరంతరం గుండెల్లో మోస్తున్నారు. మీ విజయాలు ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ప్రతిష్టను మరింత బలోపేతం చేస్తున్నాయి. అందుకు ప్రతి భారతీయుడు మిమ్మల్ని చూసి గర్విస్తున్నారు. ప్రపంచం మారింది. ప్రపంచ కూటములు రూపాంతరం చెందాయి. అయినప్పటికీ భారత్‌రష్యా స్నేహబంధం పునాది మాత్రం బలంగానే ఉంది. నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ నాయకత్వంలో ఈ సంబంధాలు నూతన సహకార రంగాలు, అభివృద్ధి అవకాశాల వైపు విస్తరిస్తూనే ఉన్నాయి. తాను ఇక్కడికి పర్యాటకుడిగా రాలేదు. స్పష్టమైన లక్ష్యంతో వచ్చా. భాగస్వామ్యాలను నిర్మించడానికి, సంబంధాలను బలోపేతం చేయడానికే ఇక్కడకు వచ్చా. అన్నింటికంటే ముఖ్యంగా.. ఏపీ యువతకు అవకాశాలు కల్పించేందుకు వచ్చాను. నేడు ఏపీ దేశంలోనే సరికొత్త అభివృద్ధి లక్ష్యాలతో దూసుకుపోతున్న రాష్ట్రాలలో ఒకటిగా నిలిచింది. ప్రతి ఏడాది లక్షలాది మంది యువత మెరుగైన జీవితం నిర్మించుకునేందుకు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వపరంగా పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమలను, స్థాపించడం, ఉపాధిని సృష్టించడం, జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, ప్రతి యువకుడు విజయవంతం కావడానికి తగిన అవకాశం ఉండేలా కృషిచేస్తున్నాం. డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ శక్తిని చంద్రబాబు ముందే గ్రహించారు. ఇన్నోవేషన్ అనేది ట్రెండ్ కాకముందే టెక్నాలజీ ఎకో సిస్టమ్ నిర్మించేందుకు కృషిచేశారు. పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉత్పాదకత, సాంకేతికత, స్థిరమైన వృద్ధికి ఏపీని గ్లోబల్ డెస్టినేషన్ గా మార్చేందుకు ఈ రోజు మళ్లీ దృష్టిసారించాం. గత రెండేళ్లలో ఏపీ దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా నిలిచింది. రెన్యూవబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, డేటా సెంటర్స్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. స్థిరత్వం, మౌలిక వసతులు, ఆవిష్కరణలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రగతిశీల విధానాలు, అమలుకు కట్టుబడిన రాష్ట్రంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు.. పెట్టుబడులను ఉపాధిగా మార్చడమే మా లక్ష్యం. ఏపీతో భాగస్వాములు కావాలని, ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని రష్యాలోని భారతీయ సమాజానికి, రష్యన్ భాగస్వాములకు వ్యక్తిగతంగా ఆహ్వానం పలుకుతున్నాను. మీ మాతృభూమి అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావడానికి ఇదే సరైన సమయమన్నారు.

**ప్రవాసాంధ్రులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి**

కష్టాన్ని నమ్ముకున్న తెలుగువారు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా గౌరవం దక్కుతుంది. ఏ దేశంలో ఉన్నా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోరు. మీ మనస్సు రాష్ట్రం మీదే ఉంటుంది. మీకు ఏ సమస్య ఉన్నా ఏపీ ఎన్ఆర్టీ అండగా ఉంటుంది. మీ బాధ్యత నాది. తెలుగు కుటుంబాలను చూసినప్పుడు నాకు గర్వంగా ఉంటుంది. మీరంతా ఎంతో సాధించారు. ఇప్పుడు సొంత రాష్ట్ర అభివృద్ధిలో భాగం అవ్వండి. మీరంతా బ్రాండ్ అంబాసిడర్లుగా మారి ఏపీని ప్రమోట్ చేయండి. ఒక్క పెట్టుబడి... ఒక్క పరిశ్రమ తీసుకురండి... యువతకు ఉద్యోగాలు కల్పించండని మీరు భాగస్వామ్యం అవ్వండి అని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఇండియన్ అంబాసిడర్ ఇన్ మాస్కో వినయ్ కుమార్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

### ఎమ్మెల్యే నొక్కేసిన రూ.100కోట్లు ఇస్తే ఆయన కాళ్లు కడుగుతా

### ఎమ్మెల్యేకి సవాల్ విసిరిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



**కావలి (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నాపై మోపిన నిందారోపణలను నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని కావలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. కావలి వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కావలి ఎమ్మెల్యే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆయన చేసిన అనేక గ్రావెల్ దందాలను అమృత పథకంకు సంబంధించిన కాంట్రాక్టర్ సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలక్రిష్ణలతో ఉండేది ఎల్ఈడి స్క్రీన్‌లో చూపించడం జరిగింది. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు నేను అమృతపథకం నిధులు రూ.14కోట్లు మింగేశానని నిందలు చేశారని ప్రస్తుతం వాళ్ళ ప్రభుత్వం అధికారంలో ఉందని దమ్ము ధైర్యం ఉంటే ఆ నిధులపై విజిలెన్స్ ఎంక్వైరీ వేయించాలన్నారు. ప్రభుత్వం వచ్చి రెండేళ్ళు అవుతున్నా ఇప్పటి వరకు ఆ కాంట్రాక్టర్‌ను ఏమి చేయలేక నీకు తెలియకుండా మీ పార్టీ నాయకులే విజిలెన్స్ విచారణ వేయిస్తే అధికారులను, మీ నేతలను పంపించి ఎందుకు అడ్డుకుంటున్నావు అని అన్నారు. కావలిలో ఎమ్మెల్యే చేసిన ఒక్క మంచిపని చేయలేదని మహిళలు వద్దన్నచోట బార్లు ఏర్పాటు చేయడం దంపుడు మాటలు, అబద్ధపు వాగ్దానాలు అని మండిపడ్డారు. ముసునూరు మనీ స్కామ్‌లో రూ.100కోట్లు అవినీతికి పాల్పడింది ఎమ్మెల్యే అని ఆయన ఆరోపించారు. ఈ రూ.100కోట్లు దోపిడి సొమ్మును ప్రజలకు తిరిగి ఇచ్చేస్తే కావలి యానదిరెడ్డి విగ్రహం సాక్షిగా కాళ్ళు కడుగుతా అని అన్నారు. మా వైసిపి ప్రభుత్వంలో 126 ఎకరాలు కబ్జా అయ్యాయని అంటున్నావు అని ఇందులో కనీసం 50 ఎకరాలనైనా ఎందుకు స్వాధీనం చేసుకోలేకపోయారన్నారు. ఆ కబ్జారాయుళ్ళు నీకు కప్పం కట్టి నీ చుట్టూనే తిరుగుతున్నారని ఒకవేళ ఆ భూమిని స్వాదీనం చేసుకున్నా నీ కాళ్ళు కడిగేందుకు నేను సిద్ధం అని సవాల్ చేశారు. ఎమ్మెల్యే వచ్చిన ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో రౌడీయిజం పెరిగిపోయిందని విమర్శించారు. ఒక సామాజిక వర్గానికి చెందిన నేతను బెదిరించారని, మరో సీనియర్ నేతను బూతులు తిట్టారని ధ్వజమెత్తారు. పాపం టిడిపి కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ సుబ్బానాయుడును ఏకంగా కాటికే పంపించావు అని ఆరోపించారు. పేపర్ల వారి పాలెంకి తాగేందుకు నీటిని అడిగితే టిడిపి కార్యకర్తను చెంప చెల్లుమనిపించావు అని అన్నారు. మాటలు ఎక్కువ పని తక్కువ అని సాక్షాత్తూ సిఎం చంద్రబాబునాయుడు చెప్పినా నీకు బుద్ధి రాలేదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షం ఆరోపణలకు అధికారపార్టీ కూటమి నేతలు స్పందించాలి అలా కాకుండా పెయిడ్ బ్యాచ్ స్పందించడం విడ్డూరం అని అన్నారు. జువ్వలదిన్నె బోట్ల వ్యవహారంలో మత్స్యకారులను అడ్డుపెట్టుకొని బీద సోదరులపై ఎమ్మెల్యే కుట్రలు పన్నారని ఆ రికార్డులన్నీ బీద మస్తాన్‌రావు వద్దకు చేరాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఈ కుట్రలన్నీ బయటపడుతాయన్నారు. నీ దోపిడీలు దుర్మార్గాలు బయటపడతాయనే భయంతోనే నాపై తప్పుడు మర్డర్ కేసులు పెట్టించావు అని అన్నారు. ఎమ్మెల్యే రెండున్నర సంవత్సరానికి మాత్రం ఎమ్మెల్యే అని అదికూడా సంగం నియోజకవర్గానికి మాత్రమేనని అల్లూరు, దగదర్తి మండలాలకు వెళ్ళే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో పొరపాటున నీకు మళ్ళీ టికెట్ వస్తే నేను 60వేల ఓట్ల భారీ మెజారీతో గెలవడం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల బకాయిలు చెల్లించండి

### ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగులకు చెల్లించాల్సి వివిధ రకాల బకాయిలు,ఇతర ఆర్థిక అంశాలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఏపీఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు.పీఆర్సీ,ఐఆర్‌లపై ప్రభుత్వం తక్షణం స్పందించాలన్నారు. విజయవాడలో ఏపీజేఏసీ అమరావతి రాష్ట్రకార్యవర్గం సమావేశం ఏపీఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన భేటీ అయింది. మొత్తం 28 జిల్లాల ప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పీఆర్సీ నియామకం, ఐఆర్ ప్రకటన అంశాలతో పాటు ఉద్యోగ సమస్యలపై పలువురు చర్చించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐఆర్, పీఆర్సీ ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులను ఉద్యమానికి సిద్ధం చేయాలని నిర్ణయించామని బొప్పరాజు స్పష్టం చేశారు. 13 మందితో వేసిన కమిటీ రేపటి నుంచి పనిచేస్తుందని వివరించారు. వివిధ సంఘాల నాయకులు కలిసివస్తారని కోరుకుంటున్నామని బొప్పరాజు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ భవిష్యత్తుపై రేపు సమావేశమవుతామని ఐకాస అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు.



# బధిర మహిళల రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

**విజయవాడ, జూన్ 7, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ డెఫ్ ఉమన్ (బధిర మహిళ) రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారంవిజయవాడ బందరురోడ్‌లోని ఠాగూర్ గ్రంధాలయంలో డిల్లీ నుండి వచ్చిన ప్రతినిధులు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా పి.యు.ఉషాభాస్కర్, ఉపాధ్యక్షులుగా ధరణికు మారి, ప్రధానకార్యదర్శిగా షేక్ చోటి, ప్రోగ్రాం కార్యదర్శిగా వై.రాజ్యలక్ష్మీలతోపాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరావు హాజరై కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. బధిర మహిళల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఈసందర్భంగా కోటేశ్వరావు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో గ్రంధాలయ అధికారి కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్నికలకు గ్రందాలయంలోని హాలును ఇవ్వటంతో పాటు భోజన వసతి కల్పించిన కృష్ణాజిల్లా గ్రంధాలయసంస్థ ఛైర్మన్ యం.యస్.బేగ్‌కు బధిర మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

# పెద్దిరెడ్డిపల్లిలో పిడుగుపాటు

### మేకల కాపరి మృతి

**వరికుంటపాడు (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం అకాల వర్షంతో కూడిన పిడుగుపాటు ఘటనలో మేకల కాపరి అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామానికి చెందిన అరవ రమణయ్య (40) మేకలను మేపేందుకు పొలాలకు వెళ్లిన సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిఈదురు



రమణయ్య(ఫైల్)

గాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. రమణయ్య గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశంలో మేకలను మేపుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడింది. ఆ పిడుగు రమణయ్యపై పడటంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. దూరంలో ఉన్న మరికొందరు కాపరులు గమనించి కేకలు వేసినా ఫలితం లేకపోయింది. మేకల కాపరిగా జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రమణయ్య ఆకస్మిక మృతితో భార్య, ఇద్దరు పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రమణయ్య మృతదేహాన్ని చూసికుటుంబ సభ్యులు గ్రామస్థులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# రేపు గవర్నర్ నెల్లూరు జిల్లాకు రాక

### కలెక్టర్ హిమాన్షు శుక్ల

**నెలూరు-కలెక్టరేట్, జూన్ 7, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జూన్ 9వ తేదీన (మంగళవారం) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 9వ తేదీ ఉదయం 9.35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.50 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం ఉదయం 11.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి, ఉదయం 11.15 గంటలకు గోలగమూడి రోడ్డులోని కనుపర్తిపాడు వద్ద ఉన్న వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 12.40 గంటల వరకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ (కాన్వొకేషన్) కార్యక్రమంలో పాల్గొంటారు.

కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు వి.పి.ఆర్ కన్వెన్షన్ సెంటర్ నుండి బయలుదేరి, మధ్యాహ్నం 1.05 గంటలకు నెల్లూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్‌కు చేరుకుని, మధ్యాహ్నం 1.15 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి మధ్యాహ్నం 2.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 2.20 గంటలకు తాజ్ తిరుపతికి చేరుకుని బస చేస్తారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# మూడేళ్ల చిన్నారి అదృశ్యం

### విస్తృతంగా పోలీస్ గాలింపు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 7, ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన బాలిక అదృశ్య సంఘటన కలకలం రేపుతుంది. అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర జాను (3) శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పనిచేస్తున్న సమయంలో ఆడుకుంటూ పెంపుడు కుక్కతో పాటు అదృశ్యం అయింది. ఈ సంఘటనతో చిన్నారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు తోటను ఆనుకుని ఉన్న కొండలు, అటవీ ప్రాంతంలో బాలిక ఆచూకీ కోసం గ్రామస్తులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి సిబ్బందితో ముమ్మరంగా బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపడుతున్నారు. డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో నిరంతరాయంగా గాలిస్తున్నప్పటికీ చిన్నారి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య పాప ఆచూకీ దొరకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీస్ బృందాలు పాప ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా యోగాంధ్ర


దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం


చింతకాయల విజయ్‌కు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూన్ 7, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో యోగాంధ్ర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వుల ప్రకారం ప్రారంభించిన ఈ ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం ప్రముఖ యోగా అధ్యాపకులు గర్రె రాజేష్ ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు నిలయాలైన దేవాలయాలకు, మనస్సును ప్రశాంత పరిచే యోగాధ్యయనానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీనిని విజయవంతం చేయాలని చైర్మన్ కోరారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పెనుమత్స రాఘవరాజు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికీ దేవస్థానం తరపున ఉచిత ప్రసాదాలు, మంచినీరు పంపిణీ చేశారు.

**వేదోక్తంగా సూర్యోపాసన సేవ :** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం ఉదయము సూర్యోపాసన సేవ అత్యంత వైభవంగా నిర్వహించబడింది. లోక క్షేమ కల్యాణార్థం రంగులతో ఆదిత్య మండల యంత్రం ముగ్గు వేసి సూర్యనమస్కారములతో ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా అరుణ మహాసౌర పారాయణలు ఆదిత్య హృదయం అష్టోత్తర శతనామావళితో మంగళవాయిద్యముల నడుమ సూర్య భగవానుడికి గోదుమ పాయసం నివేదించి భక్తులకు ప్రసాద పంపిణి వేదాశీర్వాదం చేశారు. సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు యందు డబ్లుడబ్లుడబ్లు. కనకదుర్గమ్మ. ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఓ తెలిపారు.

**ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్త జనం**

ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వేసవి సెలవులు, ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డీఈఓ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఆలయ ఏఈవోలు చంద్రశేఖర్ ,వెంకటరెడ్డి ,రమేష్ క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు.

**దుర్గమ్మవారి సేవలో రాజ్యసభ ఎంపి అభ్యర్థి:** దుర్గమ్మవారిని రాజ్యసభ ఎంపి అభ్యర్థి చింతకాయల విజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మ వారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు చిత్రపటాన్ని బహుకరించారు.

**విరాళాలు:**

విశాఖపట్నంకు చెందిన ఏ బిజీ అమిత్ రెడ్డి, భవ్య ఆదివారం రూ.1,00,000 విరాళాన్ని నిత్య అన్నదాన పథకంకు అందించారు. విజయవాడకు చెందిన సోలా దుర్గారావు దంపతులు రు.2లక్షలను నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందించారు. విజయవాడకు చెందిన జె దేవీ సుప్రజా దంపతులు రు.1లక్ష విరాళం నిత్యాన్నదాన పథకానికి విరాళమందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, (నెల్లూరు), జూన్ 7, ప్రభాతవార్త :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై ప్రజల్లో, పార్టీ నాయకుల్లో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం స్తానిక దొడ్ల మనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జయంతిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా తీసుకవాల్సిన చర్యలు, తప్పుల సవరణ చిరునామా మార్పులు వంటి అంశాలపై నాయకులకు వివరణ ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని నాయకులకు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఓటుహక్కు ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పట్టణ, మండలపార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, టిడిపి నాయకులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ క్లస్టర్లు, వార్డు, గ్రామ పంచాయితీ అధ్యక్షులు, సెక్రటరీలు టిడిపినాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ఎపిఎఐఎంఎస్ 2.0 దోహదం

## రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువుల పంపిణీ

## కౌలు రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు కృత్రిమ కొరత, మళ్లింపులను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలి



## జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్

**విజయవాడ, జూన్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రూపొందించిన ఏపీఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల పంపిణీని ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా అమలు చేసే అంశంపై ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కొత్త విధానం అమలుతో కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి జిల్లా, క్షేత్రస్థాయిలో విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కృత్రిమ డిమాండ్, ఎరువుల మళ్లింపు, రైతుల్లో అనవసర ఆందోళనలను అరికట్టాలని ఆదేశించారు. వివిధ పంటలకు అవసరమైన ఎరువుల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. పంటల సరళి, అంచనా డిమాండ్ ఆధారంగా మండల స్థాయిలో ముందస్తుగా ఎరువుల నిల్వలు ఉంచాలని సూచించారు. గత ఏడాది ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణ, కాకినాడ జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద కేంద్ర ప్రభుత్వం తయారు చేసినటువంటి ఎఫ్‌ఎఫ్‌ఎస్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని, మిగతా 26 జిల్లాల్లో ఎపిఎఐఎంఎస్ 2.0 యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు జరుగుతుందని వెల్లడించారు. ఎరువుల పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలిగించేలా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

సిఎం కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ ఎరువుల మళ్లింపును అరికట్టేందుకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ విశ్లేషణాత్మక నివేదికలు సమర్పించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి రియల్‌టైమ్ గ్రీవెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాల మధ్య ఉత్తమ విధానాలను పంచుకుంటూ సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎపిఎఐఎంఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి రైతులకు పారదర్శక, వేగవంతమైన ఎరువుల పంపిణీని నిర్ధారించాలని అన్ని జిల్లాల అధికారులకు సమావేశం ముగింపులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ ఏపీఎఐఎంఎస్ 2.0 అభివృద్ధి పురోగతి, జిల్లాల సన్నద్ధతపై వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు (ఆర్‌ఎస్‌కెలు) లాగిన్ వివరాలు అందజేసినట్లు తెలిపారు. ఖరీఫ్2025 ఈక్రాప్ బుకింగ్ పరిధిలో ఉన్న రైతుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ఎరువుల రిటైలర్లు, పిఏసిఎస్‌లను ఎపిఎఐఎంఎస్ 2.0లో నమోదు చేసి సంబంధిత రైతు సేవా కేంద్రాలకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల రైతులు తమకు సమీపంలోని గుర్తింపు పొందిన రిటైలర్ల ద్వారా ఎరువులను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సాధారణ ఎరువుల సిఫార్సుల ఆధారంగానే ఎరువుల కేటాయింపు జరుగుతుందని చెప్పారు.

# నిమ్స్ డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్


డాక్టర్ రాహుల్ దేవరాజ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డాక్టర్ నగరి బీరప్ప

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 7, ప్రభాతవార్త:** నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన డైరెక్టర్‌గా డాక్టర్ రాహుల్ దేవరాజ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న డాక్టర్ నగరి బీరప్ప మూడేళ్ల పదవీ కాలం ముగియడంతో డాక్టర్ రాహుల్ దేవరాజ్‌ను డైరెక్టర్‌గా నియ మిస్తూ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తు ఆదేశాలు జారీ చేశారు. పాల మూరు ప్రాంతానికి చెం దిన ఆయన మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నా రు. డాక్టర్ రాహుల్ దేవరాజ్ నిమ్స్‌లో యూ రాలజీ విభాగాధిపతిగా ఉన్నారు. కిడ్నీ మార్పి డిలో చికిత్సలలో ఆయన ప్రత్యేక నిపుణుడు. నిమ్స్ ఆసుపత్రిలో ఇప్పటివరకు జరిగిన దాదాపు 2వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో ఆయన ఆద్వర్యంలోని వైద్య బృందం ఎంతో కీలక పాత్ర పోషించింది. దీనికితోడు ప్రభుత్వ రంగంలో దక్షిణాదిలో మొదటి రోబోటిక్ కిడ్నీ మార్పిడి చేసిన వైద్యుడిగా గుర్తింపు సాధించారు. నిమ్స్‌లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న క్రమంలో నిమ్స్ సమస్యలు, పరిష్కారాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది.

# ప్రతి రోజూ 5 నిమిషాలు యోగా, మెడిటేషన్

## నిరంతరం గేమ్స్, స్పోర్ట్స్ నిర్వహించాలి ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినం, 227 పనిదినాలతో 2026-27, అకడమిక్ క్యాలెండర్ విడుదల

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రతి రోజూ పాఠశాలలో 5 నిమిషాలపాటు యోగా, మెడిటేషన్‌ను చేయించాలని, ఉదయం ప్రార్థనా సమయంలో గానీ లేదంటే క్లాస్ రూమ్‌లో గానీ అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది. అలాగే ప్రతి రోజూ గేమ్స్, స్పోర్ట్స్ ను నిర్వహించాలని నిర్ణయించింది. 227 రోజులతో 2026-27 విద్యా సంవత్సరం కొనసాగనుంది. జూన్ 15న ప్రారంభమయ్యే నూతన విద్యా సంవత్సరం ఏప్రిల్ 24, 2027తో ముగియనుంది. 51 రోజుల వేసవి సెలవుల అనంతరం జూన్ 14, 2027లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన 2026-27 విద్యా సంవత్సరం అకడమిక్ క్యాలెండర్‌ను విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా విడుదల చేశారు. 10వ తరగతి విద్యార్థులకు జనవరి 10లోపు సిలబస్‌ను పూర్తి చేయాలని, 1 నుంచి 9 తరగతులకు ఫిబ్రవరి 28 లోగా సిలబస్ పూర్తి చేయాలంది. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు 13 రోజులపాటు కొనసాగనున్నాయి. సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు 5 రోజులుంటాయని తెలిపింది. ఏప్రిల్ 23, 2027 చివరి పనిదినంగా, ఏప్రిల్ 24 నుంచి జూన్ 13, 2027 వరకు సమ్మర్ హాలిడేస్ ఉంటాయని అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొంది. ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1ను జూలై 31 లోపు, ఎఫ్ఏ-2ను సెప్టెంబర్ 21 లోపు, సమ్మేటివ్-1 పరీక్షలను అక్టోబర్ 1 నుంచి 9 వరకు, ఎఫ్ఏ-3ను డిసెంబర్ 10 లోపు, ఎఫ్ఏ-4ను 10వ తరగతి వారికి జనవరి 27 లోపు, 1 నుంచి 9వ తరగతుల వారికి ఫిబ్రవరి 15 లోపు నిర్వహించాలి. 10వ తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఫిబ్రవరి 28 లోపు నిర్వహించాలని ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలను మార్చి 2027లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. ఎస్ఏ-2 పరీక్షలను 1 నుంచి 9వ తరగతుల వారికి ఏప్రిల్ 9 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 22 వరకు, క్రిస్మస్ సెలవులు మిషనరీ పాఠశాలలకు డిసెంబర్ 23 నుంచి 27 వరకు, సంక్రాంతి సెలవులు జనవరి 13 నుంచి 17 వరకు ఉంటాయని ప్రకటించింది. జూన్‌లో 14 రోజులు, జులైలో 26, ఆగస్టులో 22, సెప్టెంబర్‌లో 23, అక్టోబర్‌లో 15, నవంబర్‌లో 23, డిసెంబర్‌లో 24, జనవరిలో 20, ఫిబ్రవరిలో 23, మార్చిలో 21, ఏప్రిల్‌లో 16 రోజులు కలిపి మొత్తం 227 పనిదినాలతో 2026-27 విద్యా సంవత్సర అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ప్రతి మూడో శనివారాన్ని నో బ్యాగ్ డేగా అమలు చేయాలని నిర్ణయించారు. 10 మూడో శనివారాలను అమలు చేయా లని సూచించారు. ప్రతి రోజూ 30 నిమిషాలు పఠనానికి కేటాయించాలి. అందులో పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, వార్తాపత్రిక, మ్యాగజైన్ మొదలైనవి చదివించాలి. దీనిని ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ స్వయంగా పర్యవేక్షించాలి.

# మృగశిర కార్తె ప్రారంభవేళ.. చేప మందు పంపిణి

## నేడు హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో

## రాత్రి 9 గంటలకు ప్రారంభం

## దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన ఆస్తమా రోగులు

**హైదరాబాద్ (గోషామహల్), జూన్ 7, ప్రభాతవార్త:** నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం కోసం వచ్చే అస్తమా రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగు కుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మృగ శిర కార్తె మారడంతో చేప ప్రసాదం పంపిణి చేసే బత్తిని సోదరులు ఆస్తమా రోగులకు ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేసిన శిబిరంలో ఆస్తమా రోగులకు ఈ నెల 8వ తేదిన రాత్రి 9గంటలకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కలిసి చేప ప్రసాదాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి యేటా మృగశిర కార్తె జూన్8వ తేదిన ప్రారంభ మవుతుందని వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు చేప ప్రసాదం కోసం తరలి రావడం కనిపించింది. రాత్రి 9గంటలకు ప్రారంభించి 9వ తేది రాత్రి 9గంటలకు వరకు చేప ప్రసాదం కొనసా గుతుందని బత్తిని కుటుంబ సభ్యులు అమర్‌నాథ్‌గౌడ్ తెలిపారు.

ప్రతి యేటా మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 8, 9 తేదిల్లో జరుగనున్న చేప ప్రసాదం పంపిణికి ప్రభుత్వం తరపున చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేశారు. భారత దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలందరూ(ఆస్తమారోగలు)తమ వంతు వచ్చే వరకు క్యూలైన్లలో వేచి ఉండి ప్రశాంతంగా ప్రసాదం స్వీకరించి సురక్షితంగా తిరిగి వెళ్లే విధంగా వివిధ విభాగాలకు చెందిన జిల్లా అధికారులతో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సమీక్షించారు. పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి. వాటర్ వర్ క్స్, మత్స్య, సమాచార, విద్యుత్, వైద్య, జిహెచ్ఎంసి, అగ్నిమాపక, జలమండలి, ట్రాఫిక్ తదితర శాఖల సమన్వయంతో రోగులకు ఎటువంటి ఇబ్బంది అసౌకర్యం కలుగ కుండా అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముఖ్యంగా పరిసి ్థతులను ఎప్పటికప్పుడు బేరీజ్ వేస్తూ తగు చర్యలు తీసుకునేందుకు ప్రజలకు తగు సూచనలు అందించేందుకు వీలుగా పోలీసు సమాచార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కూడిన కంట్రోల్ రూంను ఏర్పాట్లు చేశారు. ఇందులో తెలుగు, హిందీ, ఉర్దూ తదితరభాషలో ప్రజలకు సూచనలు ఇచ్చేందుకు అనౌన్సర్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బ్యారి కేడింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, సూచికలు, మంచినీరు, షెడ్లు, పారిశుధ్యం వంటి ఏర్పాట్లు పూర్తి చేశారు. రోగులకు అత్యవసర పరిస్థితుల్లో చికిత్సలు అందించడానికి వీలుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆద్వర్యంలో ఆరోగ్య శిభిరాలు 4, అంబులెన్స్4, సర్వీసులు, కూడా సిద్దం చేశారు. మత్స్య శాఖ ద్వారా ఇప్పటికే లక్షకు పైగా చేపపిల్లలు సిద్ధం చేశారని, 34 టోకెన్ కౌంటర్లు, 34 చేప పిల్లల కౌంటర్లు ఏర్పాటు చేశారు. తెలిపారు. జలమండలి ద్వారా మంచి నీటి ట్యాంకర్లు త్రాగునీటి ప్యాకెట్లు సిద్దం చేసినట్లు చేశారు.

**75 చోట్ల సిసి కెమెరాలు ఏర్పాట్లు**

నాంపల్లి ఎగ్జిబిషన్‌మైదానంలో జరిగే చేపప్రసాదాన్ని తిలకిచేందుకుగాను సమాచారశాఖ తో పాటు పోలీసులు విభాగం ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి కదలికను తెలుసుకు నేందుకుగాను 75సిసి కెమెరాలు ఏర్పాట్లు చేశారు. చేప ప్రసాదం ముగిసే వరకు కొన సాగుతుంది. చేప ప్రసాదం కోసం వాహనాదారుల కోస ం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అఫ్జల్‌గంజ్‌వైపునుంచి వచ్చే వాహనాలను ఎంజె మార్కెట్ చౌరస్తానుంచి అబిడ్స్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా నాంపల్లివైపునుంచి గాంధీభవన్ వైపు వచ్చే వాహనాలను బషీర్‌బాగ్ జగ్జీవన్ రాం విగ్రహం నుంచి అబిడ్స్‌వైపు మళ్లించనున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎక్‌మినార్ వైపు ట్రాఫిక్ రద్దీని బట్టి తగ్గిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చేపప్రసాదం కోసం వచ్చేవారు తమ వాహనాలను ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కళాశాల, గగహన్ వివహార్, గృహ కాంప్లెక్స్, గాంధీభవన్ టిఎన్‌జి భవన్ ముందు పార్కింగ్ చేసుకో వచ్చునన్నారు. చేప ప్రసాదం కోసం విధులకు వచ్చే అధికారులు తమ వాహనాలను భీమ్‌రాంబాడాలో పారి ్కంగ్ చేసుకోవాలన్నారు.



**34 కేంద్రాల ద్వారా ప్రసాదం టోకెన్‌ల పంపిణి**

ఎగ్జిబిషన్ గ్రౌండ్ అజంతా గేట్ వద్ద ఏర్పాటు చేసిన 34 భారీ కేడ్‌లలోవెళ్లే ఆస్తమా రోగులు అర కిలో మీటర్ తరువాత గాంధీదర్శన్ ముందు 34 కేంద్రాల ద్వారా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన చేప ప్రసాద టోకెన్‌లను కౌంటర్‌లలో తీసుకు వలసి ఉంటుంది.

ఈ ప్రాంతంలో ఎలాంటి తొక్కి సలాటకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు ఏర్పాట్లు చేశారు. 50 రూపాయలు చెల్లించి టోకెన్ తీసుకున్న తరువాత నేరుగా భారీ కేడ్‌ల వెంబడి మరో అరకిలోమీటర్ వెళ్లి ఆస్తమా రోగులు కమలా నెహ్రుపాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో చేపపిల్లలను తీసుకుని కొద్ది దూరంలో చేపప్రసాదాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. అక్కడే నేరుగా చేపిల్లల ద్వారా ప్రసాదాన్ని అందించే బత్తిని సోదరులు ఉచితంగా కార్తె ప్రసాదాన్ని అందచేస్తారు.

# తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు

## 15న పాఠశాలలు పునఃప్రారంభం

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు మరో మూడు రోజు లు పొడిగింపబడ్డాయి. 2026-27 విద్యా సంవత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభం కావల్సి ఉన్నందున .. ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తుల మేరకు పాఠశాలలను ఈ నెల 12 నుంచి కాకుండా ఈ నెల 15 నుంచి పునః ప్రారంభించాలని నిర్ణయించినట్లు పాఠశాల విద్య శాఖ డైరక్టర్ నవీన్ నికోలస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని పాఠశాలలు వేసవి సెలవుల తర్వాత ఈ నెల 12న తిరిగి ప్రారంభం కావాల్సి ఉంది. పాఠశాలల పునః ప్రారంభ తేదీని పునః పరిశీలించమని కోరుతూ వివిధ భాగస్వాముల నుండి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు అందాయి. ఈ నెల 13 రెండోవ శనివారం, 14 ఆదివారం వస్తున్నందున, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈ నెల12కు బదులుగా ఈ నెల 1న తిరిగి తెరవాలని నిర్ణ యించనట్టు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం వాయిదా పడటం వలన కోల్పోయిన విద్యా సమయాన్ని భర్తీ చేయడానికి 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన బోధనా దినాలను ఖచ్చితంగా పాటించేలా చూసేందుకు, పాఠశాల విద్యా శాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జుల నెలో రెండవ శనివారం అయిన (11.07.2026)ను సాధారణ పనిదినంగా పరిగణించాలని నిర్ణయించినట్టు డైరెక్టర్ ప్రకటిం చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని శాఖాధి పతులు, హైదరాబాద్, వరంగల్ పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జిల్లా విద్యాధికారులందరూ తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు. రాష్ట్రంలో 24,672 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. సుమారు 11వేల వరకు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి.

# ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కేపిటల్‌గా హైదరాబాద్

## ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ విదేశీయులకు వైద్యసేవలు

## ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం కాపి టల్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా.. ప్రభుత్వ హాస్పి టల్స్ లోనూ విదేశీయులకు వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకుప్రభుత్వ హాస్పి టల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజాన్ని ప్రోత్స హించేందుకు అవసరమైన చర్యలను అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సిఫార్సులు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులుగా టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి. గౌతమి, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బీరప్పలను నియమించింది.

ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అమలుకు సంబంధించిన వివిధ అంశాలను కమిటీ పరిశీలించనుంది.

సనత్‌నగర్ టిమ్స్‌లో ప్రత్యేక ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం బ్లాక్ ఏర్పాటుపై అధ్యయనం చేయడంతోపాటు, విదేశీ రోగులకు అందించే వైద్య సేవలు, వాటికి తగిన ప్యాకేజీలు, ధరల విధానాన్ని సూచించనుంది. భాషా అనువాద సేవలు, పేషెంట్లకు అందించే ఆహారం తదితర అంశాలపై కమిటీ సిఫార్సులు చేయనుంది. తెలంగాణ మెడికల్ అండ్ వెల్‌నెస్ టూరిజం ప్రమోషన్ బోర్డుతో సమన్వయం చేస్తూ ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం అభివృద్ధికి అవసరమైన ప్రచార, మార్కెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలపై కూడా కమిటీ సూచనలు చేయనుంది. నెలరోజుల్లో కమిటీ తన నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# డిస్కం ఏర్పాటు విప్లవాత్మక నిర్ణయం

## తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** వ్యవసాయం తదితర ఉచిత పథకాల కోసం ప్రత్యేకంగా విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం విప్లవాత్మక నిర్ణయమని రైతు సంక్షేమ కమిషన్ చైర్మెన్ ఎం కోదండరెడ్డి తెలిపారు. అయితే మోటార్లకు మీటర్లు బిగించబోతుందనేది ప్రతిపక్షాల అపోహ మాత్రమేనన్నారు. రైతుల సమస్యలను రాజకీయం చేయడం సరైందికాదని ప్రతిప క్షాలను కోరారు. హైదరాబాద్‌లోని బీఆర్‌భవన్‌లో రైతు కమిషన్ రూపొందించిన పంటల మార్పిడి నివేదికను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అన్ని పంటలకు మద్దతు నిర్ణయించడం, వాటిని కొనడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతన్నారు.

# తిలక్‌వర్మ, సిరాజ్‌లకు భారీ ధర

## లోకల్ స్టార్లకు ఊహించని ధర ✻టిజి లీగ్ ఆటగాళ్ల వేలంలో కాసుల పంట








**హైదరాబాద్, జూన్ 7(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఎ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న టీజీ 20 లీగ్ వేలంలో కాసుల వర్షం కురిసింది. టీమిండియా స్టార్ ఆటగాళ్ల తిలక్‌వర్మ, మహ్మద్ సిరాజ్‌లకు భారీ ధర దక్కింది. రామోజీ ఫిలిం సిటీ వేదికగా ఆదివారం జరిగిన ఆటగాళ్ల వేలంలో భారత టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ 33 లక్షల ధర పలికాడు. కనీస ధర 5 లక్షలతో వేలంలోకి వచ్చిన తిలక్ వర్మ కోసం ఫ్రాంచేజీలు పోటీపడ్డాయి. మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ పోటాపోటీగా బిడ్లు వేయగా, మధ్యలో నల్గొండ జట్టు కూడా రేసులోకి వచ్చింది. చివరకు హోరాహోరీ పోరులో 33 లక్షల భారీ ధరకు తిలక్ వర్మను మెదక్ ఫాల్కన్స్ సొంతం చేసుకుంది. ఇక మరో టిమిండియా ప్లేయర్ మహ్మద్ సిరాజ్‌ను దక్కించుకోవడానికి కూడా ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. చివరకు వరంగల్ వారియర్స్ జట్టు 14 లక్షలు వెచ్చించి సిరాజ్‌ను కొనుగోలు చేసింది.

లోకల్ స్టార్ ప్లేయర్లకు సైతం ఊహించని విధంగా ధర పలికారు. సీవీ మిలింద్‌ను 17 లక్షలకు అన్విత ఖమ్మం ఏసెస్, రవికిరణ్‌ను 13 లక్షలకు పాలమూరు స్ట్రైకర్, రవితేజను 12 లక్షలకు మెదక్ ఫాల్కన్స్, తనయ్ త్యాగరాజన్‌ను 11 లక్షలకు రంగారెడ్డి జట్టు, తన్మయ్ అగర్వాల్‌ను 8 లక్షలకు కరీంనగర్ డైమండ్స్, రాహుల్ బుద్ధిని 8 లక్షలకు అనురాగ్ నల్గొండ నైట్స్, రోహిత్ రాయుడును 6.5 లక్షలకు పాలమూరు స్ట్రైకర్స్ దక్కించుకున్నాయి.

ఈ లీగ్ లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటున్నాయి. 21 రోజుల పాటు 32 మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలో జరగుతాయి. హెచ్‌సీఎలో నమోదైన ఆటగాళ్లు వేలంలో పాల్గొన్నారు. ప్రతి టీమ్‌కు 60 లక్షల పర్స్ మనీ కేటాయించగా, గరిష్టంగా 20 మంది ప్లేయర్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఇచ్చారు. ఒక్కో టీమ్ కనీసం రూ.54 లక్షలు ఖర్చు చేయడం తప్పనిసరి. గ్రామీణ ప్రతిభకు ప్రోత్సాహంగా ప్రతి టీమ్‌లో కనీసం 4 జిల్లాల ఆటగాళ్లు ఉండేలా, తుదిలో కనీసం రెండు జిల్లాల ప్లేయర్స్‌ను తప్పనిసరి చేశారు.

### టీజీ20 లీగ్‌లోని 8 జట్లు

హైదరాబాద్ ఈ ఛాంపియన్స్, ప్రణవ రంగారెడ్డి రైజర్స్, వరంగల్ వారియర్స్, మెదక్ ఫాల్కన్స్, అనురాగ్ నల్గొండ నైట్స్, కరీంనగర్ డైమండ్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్



# రెండో రోజు బౌలర్ల షో

## డెబ్యూలోనే మానవ్ అదర్స్ ✻ ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్ 113-5 ✻ భారత్ తొలి ఇన్నింగ్స్ 564-8 డిక్లేర్డ్

**న్యూచండీఘర్:** ముల్లన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా క్రికెట్ కూన ఆఫ్ఘనిస్తాన్‌ను చెడుగుడు ఆడుతోంది. తొలి రోజు బ్యాట్స్‌మెన్ వీరవిహారం చేస్తే... రెండో రోజు బౌలర్లు చెలరేగారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ రెండో రోజు ఆటముగిగేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆఫ్ఘనిస్థాన్ ఫాలోఆన్ తప్పించుకోవాలంటే ఇంకా 351 పరుగులకు పైగా చేయాలి. చేతిలో 5 వికెట్లు మాత్రమే ఉన్నాయి. పిచ్‌పై భారత బౌలర్ల గ్రిప్ చూస్తుంటే.. మూడో రోజు ఆఫ్ఘనిస్థాన్ జట్టుకి ఇంకా గండం పొంచి ఉన్నట్టే కనిపిస్తోంది.

టీ విరామానికి కొద్ది ముందు తొలి ఇన్నింగ్స్ ఆరంభించినఆఫ్ఘనిస్తాన్.. భారత బౌలర్ల ధాటికి మొదటి నుంచే తడబడింది.ఆఫ్ఘనిస్తాన్ బ్యాట్స్‌మెన్‌ను భారత పేసర్లు క్రీజ్‌లో కుదురుకోనివ్వలేదు. ముఖ్యంగా టెస్ట్ అరంగేట్రం చేసిన మానవ్ సుతార్ అద్భుతంగా స్పిన్ ఉచ్చులో పడేశాడు. ఓపెనర్ అబ్దుల్ మాలిక్(16)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. మరో ఎండ్‌లో పేసర్ ప్రసిధ్ కృష్ణ పదునైన బంతితో సాదికుల్లా(17)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దీంతో 40 పరుగులకే ఆఫ్ఘన్ ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది.

చివరి సెషన్‌లోనూ భారత బౌలర్లు చెలరేగారు.ఒకవైపు సుతార్ రూపంలో స్పిన్, మరో వైపు ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో పేస్ అటాక్‌తో మూకుమ్మడి దాడి చేశారు. వీరి ధాటికి వెంట వెంటనే ఆఫ్ఘనిస్థాన్ వికెట్లు కోల్పోయింది. రహమనుల్లా గుర్బాజ్(12), అఫ్సర్ జాజాయ్(3)లను మానవ్ సుతార్ ఔట్ చేయగా... కెప్టెన్ హష్మతుల్లా షాహిది(20)ను ప్రసిద్ధ్ కృష్ణ ఎల్బీగా పెవిలియన్‌కు పంపాడు. మరో ఎండ్‌లో రహమత్‌షా కూల్‌గా ఆడుతూ క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో ఆఫ్ఘనిస్థాన్ వంద మార్కు దాటింది. రహమత్ షా 81 బంతుల్లో 6 ఫోర్లు, ఓ సిక్స్‌తో 43 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. డెబ్యూ ప్లేయర్ మానవ్ ఏకంగా కీలకమైన 3 వికెట్లు పడగొట్టగా,పేసర్ ప్రసిద్ధ్‌కృష్ణ 2వికెట్లు తీశాడు.

అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 3 వికెట్లకు 368 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన టీమిండియా... మరో 5 వికెట్లు కోల్పోయి 196 రన్స్ జోడించింది. శుభ్‌మన్ గిల్(177 బంతుల్లో 126; 15 ఫోర్లు, ఓ సిక్స్) మరో 23 పరుగులు జోడించి సలీం బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. రిషబ్ పంత్(121 బంతుల్లో 81; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)లు కూడా తొందర గానే పెవిలియన్ చేరాడు. ధ్రువ్ జురెల్(20 బంతు ల్లో 19) నిరాశపరిచాడు. దీంతో లంచ్ సమయానికి 6 వికెట్లకు 475 రన్స్ చేసింది.

### వాషింగ్టన్ మెరుపు ఫిఫ్టీ

సూపర్ ఆల్‌రౌండర్ వాష్టింగ్టన్ సుందర్(68 బంతుల్లో 52; 5 ఫోర్లు,ఓ సిక్స్)మెరుపు హాఫ్ సెంచరీతో అలరించాడు. అతనికి డెబ్యూ ప్లేయర్ మానవ్ సుతార్(28), మహ్మద్ సిరాజ్(22) రన్స్ కూడా తోడవడంతో భారత్ స్కోరు 550 మార్కు దాటింది. సుందర్ టెస్ట్‌ల్లో అయిదో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత కెప్టెన్ గిల్... టీమిడియా తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 564 పరుగులవద్ద డిక్లేర్ చేశాడు. ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లలో సలీం సఫీ ఒక్కడే 6 వికెట్లు పడగొట్టి టీమిండియాకు కాస్త బ్రేకులు వేశాడు. మిగతా ఆఫ్ఘన్ బౌలర్లలో జియావుర్ రెహామాన్, హష్మతుల్లా షాహిదిలకు తలో వికెట్ దక్కింది.

# ర్యాపిడ్ చెస్ టైటిల్ నెగ్గిన వైశాలి

**టోక్యో:** భారత విమెన్ గ్రాండ్ మాస్టర్ వైశాలీ సరికొత్త రికార్డు నెలకొల్పింది. జపాన్‌లో జరిగిన డబ్ల్యూఆర్ విమెన్స్ ర్యాపిడ్ చెస్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ ట్రోఫీ నెగ్గఇన తొలి భారత క్రీడాకారిణిగా నిలిచింది. టోర్నమెంట్‌లో ఆద్యంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన వైశాలీ.. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ రౌండ్‌లో కజకిస్థాన్‌కు చెందిన బలమైన క్రీడాకారిణి అలువా నూర్మన్‌ను ఓడించింది. తొలి గేమ్ డ్రా అయినా, రెండో గేమ్‌లో అద్భుత ఎత్తులతో ప్రత్యర్థిని వైశాలీ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇక బ్లిజ్ ఈవెంట్‌లోనూ విజయ పరంపరను కొనసాగిండంపై విశాలీ దృష్టి పెట్టింది. ఈ ఈవెంట్‌లోనూ విజయం సాధించి డబుల్ టైటిల్ సొంతం చేసుకోవాలని చూస్తోంది. కాగా నార్వే చెస్ టైటిల్ గెలుచుకున్న తొలి ఇండియన్‌గా నిలిచి ప్రజ్ఞానంద సరికొత్త రికార్డ్ సృష్టించగా, ఇప్పుడు అదే బాటలో సోదరి వైశాలి సరికొత్త చరిత్ర లిఖించారు.





# లార్డ్స్ టెస్ట్‌లో ఇంగ్లాండ్ గ్రాండ్ విక్టరీ

**లార్డ్స్:** నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. మూడు టెస్ట్ సిరీస్‌లో 1-0 ఆధిక్యత పొందింది.254 పరుగుల లక్ష్యచేధనలో న్యూజిలాండ్ మరో సారి కుప్పకూలింది.కేవలం 138పరుగులకే రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది. నాలుగో రోజు 55 పరుగులకు 5 వికెట్లతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ లంచ్ లోపే ఆలౌటైంది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో కాన్వే(41), గ్లెన్ ఫిలిప్స్(44 నాటౌట్), కేన్ విలియమ్సన్(18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఏకంగా నలుగురు బ్యాట్స్‌మెన్ గోల్డెన్ డక్ అయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో అట్కిసన్ 5వికెట్లు, రాబిన్సన్ 2వికెట్లు, జోష్‌టాంగ్ 2వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులు, రెండోఇన్నింగ్స్‌లో 226 పరుగులు చేయగా... న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 113రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... మొత్తం ఏడు వికెట్లు పడగొట్టిన ఓలీ రాబిన్సన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. ఈ సిరీస్‌లోని రెండో టెస్ట్ కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జూన్ 17న మొదలవుతోంది.



మహిళల టీ20 ప్రపంచకప్‌ను ఆవిష్కరించిన జట్ల కెప్టెన్లు. ఈ టోర్నీలో భారత్‌తో పాటు 12 జట్లు పోటీపడుతున్నాయి

# వారంలో 43 వేల కోట్ల పెట్టుబడులు వెనక్కి

**ముంబయి, జూన్ 7:** విదేశీ ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లనుంచి జూన్ మొదటి వారంలో సుమారు రూ.43 వేల కోట్ల రూపాయలు వెనక్కితీసుకున్నారు.ప్రపంచిన్వెస్టర్లు అందరూ తమపెట్టుబడి వనరులను టెక్నాలజీ, కృత్రిమమేధ కంపెనీల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నట్లు తేలింది. రూపాయి క్షీణత కూడా డాలర్ ఇన్వెస్టర్లకు కలిసొస్తోంది. ఈ మొత్తంతో ఈ ఏడాది ఇప్పటివరకూ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.2.67 లక్షలకోట్లు మార్కెట్లనుంచి వెనక్కి తీసుకున్నారు. అదే గత ఏడాది మొత్తంగా చూస్తే 1.66 లక్షల కోట్ల కంటే ఈ ఏడాది ఆరునెలల్లోనే రెట్టింపు మొత్తం విత్‌డ్రాలుచేసారు. త్రైమాసిక ఫలితాల్లో క్షీణత, రూపాయి పతనం, గ్లోబల్‌మార్కెట్లలో మరింత ఆకర్షణీయ పెట్టుబడులకు అవకాశాలు టెక్నాలజీ, ఎఐ, స్పేస్‌రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు వస్తుండటంతోఆ దిశగా ఇన్వెస్టర్లు రూటు మార్చారు. గ్లోబల్‌ఇన్వెస్టర్లు భారీ ఎఐ సంబంధిత మార్కెట్ అవకాశాలపై ఎక్కువ ఫోకస్‌పెంచుతున్నారు. స్పేస్‌ఎక్స్



ఐపిఒకోసం ఇప్పటినుంచే సిద్ధం అవుతున్నారు. ఒక్క ఫిబ్రవరిలో మినహా మిగిలిన అన్ని మాసాల్లోను ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ మొగ్గుచూపించారు. ఫిబ్రవరిలోమాత్రం ఇన్వెస్టర్లు రూ.22,615 కోట్లుపెట్టుబడులుపెట్టారు. అదే మార్చి నెలలో 1.17 లక్షలకోట్లు విత్‌డ్రా చేసారు. ఏప్రిల్‌లో 60,847కోట్లు, మేనెలలో 32,963 కోట్లు చొప్పున విత్‌డ్రా చేసుకున్నారు. అదే జూన్‌నెల మొదటి వారంలోనే రూ.42,927 కోట్లు విత్‌డ్రా అయ్యాయంటే భారత్ ఈక్విటీలపై గ్లోబల్ ఇన్వెస్టర్ల ఫోకస్ మారిందనే చెప్పాలి. భారతీయ కరెన్సీ 2026లో సుమారు ఆరుశాతం క్షీణించింది. గత ఏడాదితోపోలిస్తే 10శాతం క్షీణించింది.అయితే ఇది ఎంతోకాలం ఉండదని, ప్రభుత్వం ఎల్టీసీజీని పూర్తిగా మినహాయించడం, ప్రభుత్వ సెక్యూరిటీల్లో పన్నులు మినహాయింపు వంటి వాటితోపాటు ఆర్బీఐ ఇటీవల సడలించిన పరిమితులతో ఇన్‌ఫ్లోలు మరింతగా పెరుగుతాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ ముఖ్య వ్యూహకర్త వికె విజయ్‌కుమార్ చెప్పారు. ఆర్బీఐ ఇటీవలే ఎన్‌ఆర్‌ఐలు, ఓసిఐలకు ఈక్విటీల్లో పెట్టుబడుల పరిమితులను పెంచింది. అయితే జూన్ మొదటి వారంలో ఎఫ్‌పిఐలు ఫుల్లీ యాక్సెసిబుల్‌రూట్‌లో 2600 కోట్లుపెట్టుబడులుపెట్టారు.ఈరూటులో మొత్తం పెట్టుబడులు ఇప్పటివరకూ 17,230 కోట్లవరకూ ఉన్నట్లు జియోజిత్ వెల్లడించింది.

# మ్యూచువల్ ఫండ్‌లోకి రెండు కొత్త ఆఫర్లు




**ముంబయి, జూన్7:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఈ వారం మరో రెండు కొత్త పథకాలు అందుబాటులోకి వచ్చాయి. తమ పోర్ట్ ఫోలియోలోని ఖాళీలను పూరించి, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు తగినట్లుగా మ్యూచువల్ ఫండ్‌హౌస్‌లు కొత్త ఫండ్స్ లాంచ్ చేశాయి.ఈ రెండు కొత్త ఫండ్స్‌లో ఒకటి యాక్టివ్ ఫండ్ ఉండగా రెండోది పాసివ్ ఫండ్ ఉంది. ఒకటి అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్‌గా వస్తే మరొకటి ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్‌గా ఉంది. డబ్ల్యూఓసీ అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నేడు అందుబాటులోకి వస్తోంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 22వ తేదీ వరకు అందుబాటులోఉంటుంది.అలాగే ఇందులో కనీస పెట్టుబడి రూ.500 గా నిర్ణయించారు. ఐసీఐసీఐ ప్రూ ఏఎంసీ నుంచి మరో కొత్తఫండ్‌ను కూడా ప్రారంభిస్తున్నారు. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీనుంచి ఈ కొత్త స్కీమ్ లాంచ్ అవుతోంది. అదే ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఈటీఫ్ ఫండ్. ఈ కొత్త ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల9వ తేదీన ప్రారంభమవుతోంది. సబ్‌స్క్రిప్షన్ అనేది ఈనెల 16వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. ఆ తర్వాత వెయ్యి చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు.

# ఖనిజాల అన్వేషణకు ఎఐ డేటా హబ్‌లు



**న్యూఢిల్లీ, జూన్ 7:** దేశంలో కీలకమైన, భూగర్భంలో లోతుగా ఉన్న ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు కేంద్రం కృత్రిమ మేధ ఎఐ ఆధారిత కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్ల వ్యయంతో బెంగళూరులో "డేటా ప్రాసెసింగ్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇంటిగ్రేషన్ సెంటర్‌ను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నెలకొల్పుతోంది. ఈ కేంద్రం దశాబ్దాలుగా సేకరించిన భూగర్భ, భౌగోళిక, రసాయన, ఉపగ్రహ డేటాను విశ్లేషించడానికి ఒక ప్రధాన హబ్‌గా పనిచేస్తుంది. ఏఐ, మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీల సహాయంతో ఖనిజాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక మ్యాపులను రూపొందిస్తుంది. దీనివల్ల సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు నష్టభయం కూడా తగ్గుతుంది. రాబోయే ఐదేళ్లలో దాదాపు 8.5 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో ఖనిజ లభ్యతపై ఈ కేంద్రం విశ్లేషణ చేయనుంది.ఎలక్ట్రిక్ వాహనాలు,పునరుత్పాదక ఇంధనం, సెమీకండక్టర్లు, రక్షణ రంగాలకు అవసరమైన ఖనిజాల కోసం ఇతరదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న జాతీయ లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌లో ఇదొక ముందడుగు. ఈ పరిణామం ఖనిజ భద్రత కోసం సాంకేతికతను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తోందని, ఇది దేశ ఖనిజాన్వేషణలో ఇదొక వేగవంతమైన మలుపు అని అధికారులు చెపుతున్నారు.

# ధరలు పెంచినా సిలిండర్‌పై

# ఇప్పటికీ రూ.700 భారం



**ముంబయి, జూన్ 7:** వంటగ్యాస్ సిలిండర్లపై రెండోసారి రూ.29లు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రతిసిలిండర్‌పైనే రూ.700 అదనపు భారం తప్పడంలేదని పెట్రోలియం మంత్రిత్వశాఖ ప్రకటించింది. మూడునెలల్లోనే రెండోసారి సిలిండర్ ధరలను పెంచిన సంగతి తెలిసిందే. సౌదీ కాంట్రాక్టుధర ప్రకారం సిలిండర్ సరఫరా ధర రూ.1600కి పెరిగింది. అలాగే గత ఫిబ్రవరి 28నుంచి ఎల్పీజీ దరచూస్తే సిలిండరుకు రూ.46 పెరిగిందని మంత్రిత్వశాఖ మోప్‌ఎన్‌జి ప్రకటించింది. ఈప్రకారంచూసేనత కమర్షియల్ సిలిండర్లు ఢిల్లీలో 3113.50గా ఉంది. కిలోకు 164గా ఉంది. గృహావసరాలకు అయితే కిలోకు రూ.66గా భారం పడుతోంది. ఉజ్వల సిలిండర్లకు ఈ పెంపుతో రూ.642గా మారితే జనరల్ కస్టమర్లకు రూ.942గా ఉంది. గత సంవత్సరం చివరినాటికి డొమెస్టిక్ ఎల్పీజీ భారం రూ.60వేల కోట్లకు చేరిందని, అంతకుముందు ఏడాది కేవలం రూ.1338కోట్లుమాత్రమే ఉందని పెట్రోలియం మంత్రిత్వశాఖ చెప్పింది. ఇందుకు కేంద్ర కేబినెట్ చమురు కంపెనీలకు రూ.30వేల కోట్ల పరిహారం కూడా ప్రకటించాయి. ప్రస్తుతం ఉజ్వల సిలిండర్లు అంతర్జాతీయ ధరలతో పోలిస్తే 60 శాతం డిస్కౌంట్‌కే పంపిణీ చేస్తున్నారు. ఇక సాధారణ సిలిండర్లు అంతర్జాతీయ ధరల్లో 45 శాతం డిస్కౌంట్‌ధరలకే దేశంలో రూ.942కి అందిస్తున్నట్లు మోప్‌ఎన్జీ వెల్లడించింది. ఎలీపజీ సరఫరా మొత్తం 54శాతం హార్మజ్ జలసంధి గుండానే వస్తుండటంతో పశ్చిమాసియా సంక్షోభం ఎల్పీజీ, పెట్రోడీజిల్‌రంగాలపై అధికంగా పడిందని పెట్రోలియంగ్యాస్ మంత్రిత్వశాఖ మోప్‌ఎన్జీ వెల్లడించింది.

# స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

# కిలో వెండి రూ. 2.70 లక్షలు

**ముంబయి, జూన్ 7:** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు తోడవడమే కాకుండా, దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. ఆదివారం నాటి ట్రేడింగ్‌లో, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి, రూ.1,52,730 వద్దకు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1.40 లక్షల వద్ద కొనసాగింది.

నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1. 42 లక్షలుగా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1.40లక్షల వద్ద



కొనసాగింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగింది.ముందురోజు భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా, వెండి ధరలోనూ రూ.10,000 మేర కోత పడింది.

# గడువులోపే ఐటి రిటర్నులు దాఖలు ఎంతోమేలు

# పన్ను చెల్లింపుదారులకు ఐటి శాఖ సూచనలు

**ముంబయి, జూన్ 7:** పన్నురిటర్నులను గడువు తేదీవరకూ వేచిచూడకుండా సత్వరమే దాఖలుచేస్తే పలు ప్రయోజనాలు కూడా ఉంటాయని, గడువు దాటాక చేస్తే జరిమానాలు, వడ్డీలు కూడా తప్పవని పన్నులరంగ నిపుణులు చెపుతున్నారు. 2025-26ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ పన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. పన్ను చెల్లింపుదారులు గడువు తేదీ వరకు వేచిచూడకుండా, వీలైనంత త్వరగా రిటర్నులు సమర్పించాలని ఆదాయపన్ను శాఖ, ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముందస్తుగా ఫైలింగ్ చేయడం వల్ల జరిమానాల నుంచి తప్పించుకోవడమే కాకుండా, కీలకమైన ఆర్థిక ప్రయోజనాలను పొందవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. నిర్ణీత గడువు తర్వాత రిటర్న్స్ దాఖలు చేస్తే సెక్షన్ 234ఎఫ్ కింద ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది.వార్షిక ఆదాయం 5 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారికి రూ. 5,000, రూ. 5 లక్షల లోపు ఆదాయం ఉన్నవారికి రూ. 1,000 జరిమానా విధిస్తారు. వీటితో పాటు చెల్లించాల్సిన పన్నుపై సెక్షన్ 234ఏప్రకారం ప్రతి నెల ఒక శాతం చొప్పున అదనపు వడ్డీ భారం పడుతుంది. స్టాక్స్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఆస్తుల విక్రయాలు లేదా వ్యాపారాల్లో నష్టాలు సంభవిస్తే, వాటిని భవిష్యత్తులో వచ్చే లాభాలతో సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. గడువులోగా ఐటీఆర్ దాఖలు చేసిన వారికి మాత్రమే ఈ ప్రయోజనం ఉంటుంది. ఆలస్యంగా ఫైల్‌చేస్తే ఈ కీలక ప్రయోజనాన్ని కోల్పోవాల్సి వస్తుంది.గృహ, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు లేదా విదేశీ ప్రయాణాల కోసం వీసా దరఖాస్తు చేసుకునే సమయంలో ఐటీఆర్ పత్రాలు




ప్రధాన ఆదాయ ధృవీకరణగా ఉపయోగపడతాయి. సకాలంలో రిటర్నులు సమర్పించడం పన్ను చెల్లింపుదారుల ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇది రుణ, వీసా ఆమోద ప్రక్రియలను మరింత సులభతరం చేస్తుంది. ఆఖరి నిమిషంలో ఈఫైలింగ్ పోర్టల్‌పై రద్దీ పెరిగి సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, రిటర్నులను ఫైల్ చేయడం ఉత్తమమని ట్యాక్స్ నిపుణులు సూచిస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
వార్త
రాజమహేంద్రవరం | సోమవారం 08 జూన్ 2026 | I



# దొండవాక అగ్రహారంలో 3ఏళ్ళ చిన్నారి అదృశ్యం



- కొండని అనుకుని పామాయిల్ తోటలో నివాసం ఉంటున్న బాలిక కుటుంబం
- బాలికతో పాటు కుక్క అదృశ్యం కావడంతో అనుమానం
- విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

**తుని, జూన్ 7,( ప్రభాతవార్త )** తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారం గ్రామానికి చెందిన బాలిక అదృశ్య సంఘటన కలకలం రేపుతుంది. అగ్రహారం గ్రామానికి చెందిన సుంకర జాను (3) శనివారం మధ్యాహ్నం తల్లిదండ్రులు పనిచేస్తున్న సమయంలో ఆడుకుంటూ పెంపుడు కుక్కతో పాటు అదృశ్యం అయింది. ఈ సంఘటనతో చిన్నారి కుటుంబ సభ్యులు గ్రామస్తులు తోటను ఆనుకుని ఉన్న కొండలు, అటవీ ప్రాంతంలో బాలిక ఆచూకీ కోసం గ్రామస్తులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. చెన్నకేశవరావు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి సిబ్బందితో ముమ్మరంగా బాలిక ఆచూకీ కోసం గాలింపు చేపడుతున్నారు. డ్రోన్లు, డాగ్ స్క్వాడ్ బృందాలతో నిరంతరాయంగా గాలిస్తున్నప్పటికీ చిన్నారి ఆచూకీ లభించకపోవడంతో చిన్నారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య పాప ఆచూకీ దొరకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పోలీస్ బృందాలు పాప ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.



### అడ్డతీగలలో మంచినీటి బావి, వాటర్ ట్యాంక్

# దుస్థితి విషమం..

## అంటువ్యాధుల భయంలో గ్రామస్తులు

**అడ్డతీగల, జూన్ 07, ప్రభాతవార్త** మండల కేంద్రమైన అడ్డతీగలలో రక్షిత మంచినీటి సరఫరా వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. గ్రామానికి మంచినీరు అందించే ప్రధాన బావి, వాటర్ ట్యాంక్ పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా మారింది. అధికారులు, సిబ్బంది అలసత్వం వల్ల స్థానిక ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఒక పురాతన బావి నుండి నీటిని మోటార్ల ద్వారా పైకి తోడి, అక్కడి నుండి వాటర్ ట్యాంకుకు నింపి గ్రామమంతటికీ సరఫరా చేస్తున్నారు. అయితే, ఈ బావి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. బావి లోపలి భాగంలో, చుట్టుపక్కల పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయాయి. బావిలోని నీరంతా నాచు పేరుకుపోయి, రంగు మారి కనిపిస్తోంది. ఎలాంటి వడపోత, క్లోరినేషన్ లేకుండానే ఈ కలుషిత నీటిని నేరుగా ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. 15 రోజులైనా శుభ్రత శూన్యం! మంచినీటి ట్యాంకులను కనీసం తప్పనిసరిగా శుభ్రపరచాలని ఉన్నతాధికారుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో పని చేసే కింది స్థాయి సిబ్బంది, పంచాయతీ అధికారులు ఈ నిబంధనలను అస్సలు పట్టించుకోవడం లేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువవ్వడం పట్ల స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బావి, ట్యాంక్ అధ్వానంగా ఉన్నాయి. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో ఈ కలుషిత నీటి వల్ల గ్రామంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం ప్రమాదంలో పడకముందే అధికారులు కళ్ళు తెరవాలి ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్న ఈ వ్యవహారంపై మండల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## రానున్న వరదలను ఎదుర్కొనేందుకు పోలవరం ముంపు మండలాలలో ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలి

- కూనవరం మండలంలో వరదల సమయం నాటికి చేపట్టాల్సిన చర్యలు
- జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసిన మండల తెలుగుదేశం నాయకులు



**కూనవరం, జూన్ 7, ప్రభాతవార్త :** వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రానున్న వరదలను దృష్టిలో ఉంచుకుని పోలవరం ముంపు మండలాలలో ముందస్తు ప్రణాళికగా వరద సహాయక చర్యలను, అత్యవసర రక్షణ ఏర్పాట్లు చేపట్టవలసిందిగా కూనవరం మండల తెలుగుదేశం పార్టీ పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు వినతిపత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలలో వర్షాకాలం వరదల సమయంలో వేలాది నిర్వాసిత కుటుంబాలు తీవ్ర భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తారని వివరించారు. గత వరదల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, వరదలు సంభవించక ముందే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ముందస్తు సహాయక చర్యలపై ప్రణాళికలను చేపట్టాలని అన్నారు. కూనవరం మండలంలో వరదల సమయంలో ముందస్తు చర్యలను చేపట్టవలసిన అవసరాలను ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా కోతులగుట్ట నుండి ఏడు రాళ్లపల్లి రోడ్డు, చిన్నార్కూర్ నుండి బోదునూరు రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. చిన్నార్కూర్ నుండి బొజ్జరాయిగూడెం కరంట్ లైన్ మెయిన్ రోడ్డు మార్గాలు వరదల సమయంలో అత్యంత కీలకమైనవని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. వరదల సమయంలో పునరావాస కేంద్రాల వద్ద త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ముంపుకు గురై బాహ్య ప్రపంచంలో సంబంధం లేకుండా ముంపు గ్రామాలలో కనీసం 3 నెలలు సరిపడ బియ్యం, పప్పులు, కిరోసిన్, మరియు నిత్యవసర వస్తువులు ముందస్తుగా నిల్వ ఉంచాలని కోరారు. వరద ప్రభావిత మండలాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తగినంత వైద్యులను, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలని కూడా అన్నారు. పాముకాటుకు (ఎంటీవినమ్ ) మందులు అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు కూడా చేపట్టవలసిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా వరదల సమయంలో తగినన్ని మోటారు లాంచీలు, పడవలను సిద్ధంగా ఉంచాలని వివరించారు. కమ్యూనికేషన్ దెబ్బతినకుండా ఉండేందుకు సాటిలైట్ ఫోన్లు, వైర్ లెస్ సెట్ లను అందుబాటులో ఉంచాలని కోరారు. వరదలు సంభవిస్తే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, నివారించేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని కోరారు. జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన వారిలో మండల తెలుగుదేశం అధ్యక్షులు యడవల్లి భాస్కరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు చెలకాని ఉమ, మండల ప్రధాన కార్యదర్శి పొడియం అప్పారావు, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి మడకం చిన్ని, బట్టు భాస్కర రావులు పాల్గొన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

### ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే
### ఆలయం వద్ద ఘన స్వాగతం పలికిన ఈఓ



**శంకవరం( అన్నవరం) జూన్ 7 ప్రభాతవార్త** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారిని ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఆలయం వద్ద కార్యనిర్వాహనాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆమె సత్యదేవున్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా ఈఓ సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి శేష వస్త్రం, ఫొటో, ప్రసాదం ,శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యక్తిగత పనులపై విదేశాలకు వెళ్ళి రావడం జరిగిందని, రాగానే సత్యదేవుని దర్శణం కొరకు విచ్చేశానన్నారు. సత్యదేవుని కృపా, కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నానన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ప్రార్థించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పర్వత సురేష్, యాళ్ల.జగదీశ్, బద్ది రామారావు కీర్తి సుభాష్ స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వీర్ల సూరిబాబు,బొమ్మిడి సత్యన్నారాయణ,రాజాల చిట్టిబాబు,పలివెల సతీష్, బండారు సురేష్,మడ్డు వీరబాబు, కందిపల్లి నేరిబాబు,పిల్లి ప్రసాద్, రాయవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అవసరానికి ఆంగ్లం నేర్చుకో.. అభిమానంతో తెలుగును బతికించుకో..

### మంత్రి కందుల దుర్గేష్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 7,ప్రభాతవార్త,** అవసరానికి ఆంగ్ల భాషను జాతీయ భాషల హిందీ నేర్చుకున్నప్పటికీ అభిమానంతో అమ్మ భాష తెలుగును బతికించుకోవాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం లో గత రెండు రోజులుగా చైతన్య సారస్వత పరిషత్ శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలకు ఆదివారం తో ముగిసాయి. ఈ సందర్భంగా గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి కేవీవి సత్యనారాయణ రాజు గారు(చైతన్య రాజు ) అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వివిధ పోటీ పరీక్షల్లో నెగ్గుకు రావాలంటే ఇంగ్లీష్ ప్రావీణ్యం ఉండవలసినదేనని అన్నారు. అలాగే జాతీయ భాష అయిన హిందీ కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందుచే ఆంగ్లం హిందీ భాషలను ఒక నైపుణ్యంగా నేర్చుకున్నప్పటికీ మాతృభాషపై అభిమానాన్ని విడవవద్దని అన్నారు. ద్వారా మాతృభాషను మృత భాష కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందని చెప్పారు. అమ్మ భాషలో రాయడం చదవడం వస్తేనే ఏ భాషనైనా సులభంగా నేర్చుకోవచ్చునని అన్నారు. అమ్మానాన్న అనే పిలుపులో ఎంతో మాధుర్యం ఉంటుందని హృదయం ఉప్పొంగుతుందని చెప్పారు . గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం కులపతి చైతన్య రాజు మాట్లాడుతూ జిజీయూలో త్వరలో తెలుగు సంస్కృతం భాషలతో పరిశోధన కేంద్రంను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. మాతృభాష పరిరక్షణ కోసం కంకణబద్ధమే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఈ ఈ సాహిత్య మహాసభలకు హాజరైన వారు ఎవరైనా తెలుగు సంస్కృత భాషలలో తమ జిజీయూలో పీహెచ్డీ చేస్తామంటే 50శాతం ఫీజు ను చైతన్య సారస్వత పరిషత్ ద్వారా తాము సమకూరుస్తామని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కొరకు తన జీవిత చరమాంకం వరకూ కృషి చేస్తానని శ్రీ చైతన్య రాజు ప్రకటించారు. సమావేశానికి విశిష్ట అతిథిగా హాజరైనజగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ,ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి ఈశ్వరి భూషణం,శ్రీశ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ కుమార్, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రణాళిక అధ్యక్షుడు టీ.పార్థసారథి, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సిపల్లి హారిక,జిజియూ డైరెక్టర్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, ఎన్నారై జేమ్స్ వాట్ కొమ్ము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కవులు కళాకారులు వివిధ కార్యక్రమాలను ప్రదర్శించారు.

## రాజ్యసభకు సానా సతీష్ బాబు పేరు ఖరారు

**కష్టపడే వారికి తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానం, రెండవసారి అవకాశం కల్పించిన చంద్రబాబు**



**కాకినాడ రూరల్, జూన్ 7 ( ప్రభాతవార్త):** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును పెద్దల సభకు రెండవసారి అవకాశం రావడంతో పార్టీ శ్రేణులంతా సంబరాలు జరుపుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ సానా సతీష్ బాబు పేరు రెండోసారి రాజ్యసభకు ఖరారు కావడంతో తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం లభిస్తుందని, పార్టీ విధేయతకు కట్టుబడి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిసర ప్రాంతాలలో తమ ఫౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమా లను నిర్వహిస్తూ, కూటమి ప్రభుత్వం లో కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్న సానా సతీష్ బాబు పేరు రెండోసారి పదవికి ఎంపిక చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో సానా సతీష్ బాబు అభిమానులు, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో ఇన్చార్జి మేక లక్ష్మణ మూర్తి ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును సానా సతీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నేటి ఉదయం 10.30 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

## హైస్కూలు అభివృద్ధికి కృషి : ఎంఎల్సీ బొమ్మి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్7,ప్రభాతవార్త.** అల్లవరం జడ్పీహెచ్ఎస్ నందు 1987-88 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నాలుగో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మొదటి వార్షికోత్సవం నందు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ తను చదువుకున్న హైస్కూల్ కు సిసి రోడ్డు వేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం 10 లక్షల రూపాయలు గ్రాంట్ తో సిసి రోడ్ అమలు చేశారు. ఈనిర్మాణం పూర్తి చేసిన ఇజ్రాయిల్ కి తోటి పూర్వ విద్యార్థులు ఘనంగా దుస్సాలువాతో సత్కరించి, మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ చదువుకున్న స్కూల్ అభివృద్ధికి ఎంత చేసిన తక్కువేనని నా వంతుగా కృషిగా 15 లక్షల రూపాయలు ప్రభుత్వ నిధులు తెచ్చి స్కూల్ అభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. చిరు సత్కారం చేసిన తోటి స్నేహితులకు కృతజ్ఞతలు తెలిప...

# అక్రమంగా కలప రవాణా

- పట్టించుకోని ఫారెస్ట్ శాఖ అధికారులు
- ఇందుకూరు బీట్ నుండి జోరుగా కలప రవాణా
- చిన్న బీంపల్లి లో కెమెరాకి చిక్కిన వైనం

**దేవీపట్నం జూన్ 6 ప్రభాతవార్త:** మండలంలో చిన్న బీంపల్లి పరిసరాల ప్రాంతాల నుండి విచ్చలవిడిగా అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా కలప తరలిస్తున్నారు. ఈ తరలింపులకు ఎటువంటి అనుమతులు లేనప్పటికీ అధికారులు కనుచందుల్లో తరలింపులో జరుగుతున్నాయని తెలుస్తుంది. అక్రమంగా వాహనాల పైన ఏజెన్సీ నుంచే మైదాన ప్రాంతానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న సంబంధించిన శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.



**అధికారులు పులి కోసం గాలింపు చర్యలు**

అధికారులు పులి కోసం గాలింపు చర్యలు చేస్తున్న సమయంలో అక్రమ వ్యాపారస్తులు దీనినే అదునుగా చూసుకుని అక్రమంగా పలుచోట్ల నుండి కలప తరలిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ కలప కోసం స్పెషల్ డ్యూటీలకు నిర్వహించాలని పరువులు కోరుతున్నారు

**నిర్లక్ష్యం ఎవరిది**

ఎటువంటి అనుమతులు లేకుండా చిన్న బీంపల్లి నుండి కలప రవాణా చేస్తున్న అక్రమాలకు పైన చర్యలు తీసుకోకపోవడం వల్ల సంబంధించిన శాఖ ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తుంది

## సరుకు రవాణా వాహనాల్లో ప్రజలను రవాణా చేస్తే

# వాహనాలు సీజ్.

### ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు.



**చింతూరు జూన్ 7 ప్రభాత వార్త.** చింతూరు -మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరగటం ఆందోళన కలిగించే అంశం. దూరపు ప్రాంతాల నుండి మారేడుమిల్లి, చింతూరు, పోల్లూరు, ఫోర్ బై వంటి పర్యాటక ప్రాంతలకు పర్యటకులు క్యూ కడుతున్నారు. అయితే సరుకు రవాణా వాహనాల్లో ఎక్కువ మంది ఓపెన్ టాప్ వాహనాల్లో పర్యటనకు మొగ్గు చూపుతున్నారు. అయితే నిత్యం ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదాల్లో అధిక శాతం సరుకు రవాణా వాహనాలే. దాంతో సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారటంతో ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్. పి. అమిత్ బర్దర్, చింతూరు ఏ. ఎస్. పి. బొడ్డు హేమంత్ ఆదేశాలతో చింతూరు సి ఐ గోపాల కృష్ణ నేతృత్వంలో చింతూరు ఎస్. ఐ. సంతోష్ కుమార్ గత రెండు రోజులుగా సరుకు రవాణా వాహనాల్లో ప్రజలను రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీ చేసి, పట్టుబడ్డ వాహనాలను రవాణా అధికారులకు అప్పగించి ఫైన్ వేధించటం లేదా వాహనాలు సీజ్ చేసేల చర్యలు చెపట్టారు. శనివారం రాత్రి ఒక వాహనాన్ని, ఆదివారం రాత్రి బొల్లెరో ట్రక్ వాహనంలో భద్రాచలం నుండి చింతూరు మీదుగా మారేడుమిల్లి వైపు వెళ్తున్న వాహనాన్ని నిలిపివేసి ఫైన్ విధించారు. ఈ రహదారి పై సరుకు రవాణా వాహనాల్లో ప్రజలు ప్రయాణం చేయవద్దు అని, ఆలా ప్రయాణాలు సాగిస్తే వాహనాలు సిజ్ చేస్తామని తెలిపారు. సో వాహన దారులు జర భద్రం.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

### - నియోజకవర్గ టిడిపి నేతలతో మంత్రి సమీక్షా



**రామచంద్రపురం జూన్ 07(ప్రభాతవార్త):** పారదర్శకమైన ఓటరు జాబితాల రూపకల్పన లక్ష్యంగా భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. పట్టణ క్యాంపు కార్యాలయంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో మంత్రి పాల్గొని ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ,కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి జూలై 14 వరకు 30 రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ చేపడతారని ఆయన సూచించారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రకటించనున్నట్లు,అదే రోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు,అభ్యంతరాలను స్వీకరిస్తారని మంత్రి తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 18 వరకు వాటి పరిశీలన,పరిష్కార ప్రక్రియ కొనసాగి,సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని ఆయన వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడం,అనర్హులు,డూప్లికేట్ నమోదులు,మరణించిన వారు,ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లను తొలగించడం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ,ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ ఈసీఎం పలివెల ప్రకాష్ రావు,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ,రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు,కే గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్,కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి,కూటమి పార్టీ శ్రేణులు,బూత్,క్లస్టర్ ఇంచార్జిలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ జెండా స్థూపం ఆవిష్కరించినా సోము వీర్రాజు



**రామచంద్రపురం జూన్ 07(ప్రభాతవార్త):** మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం మండలం హసనబాద గ్రామంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో బీజేపీ జెండా స్థూపం నిర్మించారు. మండల బీజేపీ అధ్యక్షులు ఆకేటి శ్రీకృష్ణ అధ్యక్షతన జరిగిన బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజుకు పూర్ణ కుంభం మేళతాళాలతో బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీర్రాజు బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మ పేరున ఒక మొక్క కార్యక్రమంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ మోదీ పన్నెండు సంవత్సరాల సుపరిపాలనలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాల గురించి,పర్యావరణ పరిరక్షణ ఆవిశ్యకత గురించి ఆయన వివరించారు. ప్రతీ గ్రామంలోనూ బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావాలని,బీజేపీ కార్యకర్తలు వారధి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని కార్యకర్తలను వీర్రాజు కోరారు. మన ఊరు మన జెండా స్థూపం వద్ద ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్ ద్వారా మన ఊరి అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకోవాలని గ్రామస్థులకు ఆయన సూచించారు. అనంతరం సతీష్ రావు సోము వీర్రాజును ఘనంగా సత్కరించారు. జెండా ఆవిష్కరణలో బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ,జాతీయ కార్యవర్గ సభ్యులు అయ్యాజీ వేమా,అనకాపల్లి జిల్లా బీజేపీ ఇంచార్జి కర్రి చిట్టిబాబు,జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు,బీజేపీ వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు,రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్ కి దూరంగా ఉండాలి.



**రౌతులపూడి, జూన్ 7.(ప్రభాత వార్త)** యువత డ్రగ్స్ కి దూరంగా ఉండి,ఆరోగ్యంగా జీవించాలని ఎస్ ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.ఆదివారంఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వంతెన వరకు నిర్వహించారు. సి ఐ సూర్య అప్పారావు ఆదేశాలు మేరకు ఈ కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి దూరంగా ఉండాలని,ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో సిబ్బంది ఉదయ్,సూరిబాబు, జయ రామ్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అంగన్వాడీ పోస్టులు భర్తీకి అనుమతులు రావాలి.. పి. డి. ఉమ



**రాజవొమ్మంగి, జూన్ 07, ప్రభాత వార్త** పోలవరం జిల్లా అంగన్వాడీ వర్కర్స్, సహాయకులు పోస్టులు భర్తీకి ప్రభుత్వం నుండి నోటిఫికేషన్ రావాల్సి ఉందని జిల్లా పి. డి. ఉమ తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ మూడు, మినీ అంగన్వాడీ వర్కర్స్ నాలుగు, 208 మంది సహాయకులు పోస్టులు భర్తీ కావాలని అన్నారు. ఇంకా వర్కర్స్ కోర్టు కేసులో ఇద్దరు, ప్రమోషన్ రెండు ఉన్నట్లు తెలిపారు. జిల్లా లో 985 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందించే సేవలపై ప్రభుత్వం నుండి వచ్చే ఫోన్ కాల్స్ పై లబ్ధిదారులు స్పందించడంపై ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులను సూపర్ వైజర్ పర్యవేక్షణలో వర్కర్స్ నిర్వహిస్తున్నారని అన్నారు. బాల్యం నుండే చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యం తో నవ చేతన్ అనే కొత్త యాప్ అమలులోకి తీసుకొని వచ్చారని అన్నారు. అంగన్వాడీ, వైద్య శాఖల సిబ్బంది సంయుక్తంగా చిన్నారులు యొక్క అనారోగ్య సమస్యలను యాప్ లో అప్ లోడ్ చేసి వెంటనే సమస్యలు ఉంటే వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రజలు సహకారం కావాలని అన్నారు.

## 1,130 క్వింటాళ్ళ వరి విత్తనాలకు ప్రతిపాదనలు.. ఏ. ఓ. చక్రధర్



**రాజవొమ్మంగి, జూన్ 07, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో. వ్యవసాయ వరి సాగులో నారు మళ్ళ కోసం 1350 క్వింటాళ్ళ వరి విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపగా 1130 క్వింటాళ్ళ వరి విత్తనాలు రానున్నాయని మండల వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు. యం. టి. యు.. 1318 రకం, యం. టి. యు. 1064 రకం, ఆర్ జె. ఎల్, నెల్లూరి సన్నాలు, యం. టి. యు. 1121రకాల విత్తనాలు వస్తున్నట్లు తెలిపారు.

## నేడు వట్టిగడ్డ లో ఎమ్మెల్యేచే "సర్ " పై కార్యక్రమం

**రాజవొమ్మంగి, జూన్ 07, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం వట్టిగడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గం. సర్ పై అవగాహన కార్యక్రమం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి, భాస్కర్ ఆధ్వర్యంలో జరుగుతుందని క్లస్టర్ ఇన్ ఛార్జి, సొసైటీ చైర్మన్ ముప్పన కేశవ్ తెలిపారు. టిడిపి పార్టీ బూత్ ఇన్ ఛార్జ్ లు, క్లస్టర్ ఇన్ ఛార్జ్ లు తప్పనిసరిగా హాజరు కావాలని కేశవ్ తెలియజేస్తున్నారు.



## శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రత్నం,ప్రధాన కార్యదర్శిగా నారాయణమూర్తి..



**అంబాజీపేట,జూన్ 7 (ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షునిగా పుల్లేటికుర్తి రత్నం, ప్రధాన కార్యదర్శిగా ఆదుర్తి నారాయణమూర్తిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మాచవరం కుమ్మరి-శాలివాహన సంక్షేమ సంఘం భవనంలో జిల్లా శాలివాహన సంక్షేమ సంఘం సమావేశం సంఘ మాజీ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా ర్యాలి శ్రీనివాస్ వడయార్,సంఘ సలహాదారునిగా దొడ్డిపట్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా త్రిమూర్తులు, ఉపాధ్యాక్షులుగా అంబటి వెంకట సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా తాడినాటి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్చార్జిలు పి.గన్నవరం తాడినాటి రామకృష్ణ,అమలాపురం ఏడిద రమేష్, రాజోలు పుల్లేటికుర్తి శివాజి, కొత్తపేట దేవగుప్తాపు నాగేంద్ర, ముమ్మిడివరం దొడ్డిపట్ల శ్రీరామచంద్రమూర్తి, ట్రెజరర్ గా సఖినేటిపల్లి పెద్దిరాజులు ఎన్నికయ్యారు. యూత్ అధ్యక్షులుగా పాలకొల్లు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఆదుర్తి ఆదిత్య, ప్రచార కార్యదర్శిగా పేరూరు సూరిబాబులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి సంఘ నాయకులు,పెద్దలు అభినందనలు తెలిపి,నూతన కమిటీ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

# గురుకుల పాఠశాలను కార్పొరేట్ సంస్థకు బదిలీ చేయవద్దు.

**చొల్లంగి పేట గురుకుల పాఠశాల వద్ద అఖిలపక్ష, ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా...**



**తాళ్లరేవు, జూన్ 7( ప్రభాతవార్త):** నిరుపేద విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్న కాకినాడ జిల్లా చొల్లంగిపేట గురుకుల పాఠశాలను ప్రభుత్వం కార్పొరేట్ సంస్థకు బదిలీ చేసే ఆలోచనలను మానుకోవాలని మండల అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు గురుకుల పాఠశాల వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావు, అఖిలపక్ష నాయకులు కుడుపూడి శివన్నారాయణ, వ్యవసాయ శాఖ రిటైర్డ్ జే.డి. పెట్ల సూర్యనారాయణ రాజు, కాశి లక్ష్మణస్వామి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వళ్ళు రాజబాబు, ఎండియూడబ్ల్యూఏ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం గంగా సూరిబాబు, కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు మాట్లాడారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం చొల్లంగిపేటలో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీలో భాగంగా నిర్వహిస్తున్న గురుకుల బాలికల పాఠశాలను ఐఐటీ, నీట్ కోచింగ్ నెపంతో ప్రభుత్వం కార్పొరేట్ సంస్థకు బదిలీ చేసే ఆలోచన చేస్తుందని, ఈ మేరకు నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో అధికార పార్టీ మంత్రికి చెందిన ఓ కార్పొరేట్ విద్యాసంస్థ కు గురుకుల పాఠశాలను అప్పగించినట్లు తెలిసిందని అన్నారు. ఇదే జరిగితే వేలాదిమంది పేద విద్యార్థుల భవిత అగమ్య గోచరమవుతుందన్నారు. ప్రతి ఏడాది సుమారు 500 మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య చదువుకోవడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. ఇప్పటికే ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను బదిలీలపై వెళ్లాలని ఆదేశాలు రావడం, 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని లను తమకు నచ్చిన పాఠశాలలో చేరాల్సిందిగా సమాచారం ఇవ్వడం పైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. లేనియెడల, మండల జిల్లా రాష్ట్రస్థాయిలోని ప్రజా సంఘాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలతో కలిపి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ సర్పంచ్ యండమూరి సత్తిబాబు, మైదు హరిబాబు, మాసా శ్రీనివాస్, నీలపాల సత్తిబాబు, నీలపాల శ్రీను, పినిపే నాగేంద్రప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు కొండేపూడి శ్రీలక్ష్మి, కామాడీ లక్ష్మి, రేవు వెంకటలక్ష్మి, దండుప్రోలు భవానీ, కర్రి వేణు, వై. సుధ, ఇసుక పట్ల కనక రత్నం, తాళ్లరేవు మండల నాయకులు సుందరపల్లి సత్యనారాయణ, తణుకు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో వినతిపత్రం ఇవ్వడానికి ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీర్మానించారు.

## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, జూన్ 07 (ప్రభాతవార్త) :** ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే నేపథ్యంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. రావులపాలెంలోని కాపు కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 15 నుంచి జూలై 15 వరకు ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని 262 బూత్‌లకు సంబంధించిన బీఎల్ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఓటరితో ఫారం-2ను సక్రమంగా పూర్తి చేయించి సమర్పించేలా చూడాలని సూచించారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, కో-ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తహసీల్దారు కుసరాజుకు ఘన సన్మానం.



**రౌతులపూడి, జూన్ 7. (ప్రభాత వార్త)** మండల గ్రామం గిడజంలో జన్మించి పదోన్నతి పై ఆలమూరు తహసీల్దారుగా నియామకమైన కందుల కుశ రాజుని గిడజం గ్రామ ప్రజలు పార్టీ లకతీతంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్ంచ్ పందుల తాతారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు తంటాపురెడ్డి వెంకటరమణ, సొసైటీ సభ్యులు తంతపురెడ్డి అప్పారావు,మండల జనసేన ఉపాధ్యక్షులు జయగంట తదితరులు ఆయనను సత్కరించారు ఈ సందర్భంగా కుశ రాజు మాట్లాడుతూ తన సీనియర్ భీమవరం ఎస్ ఐ వీర్రాజు ప్రోద్భలంతో రైల్వేలో చిన్న పాటు ఉద్యోగం చేసుకునే తాను గ్రూపు 2ద్వారా 2018లో డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయ్యానని , తనతండ్రి వెంకటరావు ఎంతో కష్టపడి చదివించారని దానితో పాటు గురువుల సహకారమున్నదని వారి ఋణం తీర్చుకోలేనిదని కొనియాడారు. అనేక మంది పేద విద్యార్థులకు ఎస్ ఐ వీర్రాజు వలే సహాయ సహకారాలు అందిస్తానని అందరూ బాగా చదువుకుని గ్రామానికి మంచిపేరు తేవాలని సూచించారు. గ్రామ నాయకులు మాట్లాడుతూ గిడజాం ముద్దుబిడ్డ కుశ రాజు ఉన్నత మైన శిఖరాలకు ఎదగాలని దీవించారు . తొలుత తన తండ్రి పాదాభి వందనం చేసి తండ్రి ఆశీర్వాదాలు తీసుకోవడం తో ప్రజలు కుదరాజుని అభినందించారు. ఈ కార్య క్రమంలో రౌతు మూలబ్బాయి, కలగ దొరబాబు,బండారు అప్పలరాజు,సత్తిబాబు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో సర్ పై శిక్షణా తరగతులు...




**సఖినేటిపల్లి జూన్ 7, ప్రభాత వార్త:** సఖినేటిపల్లి మండలం వివి మెరక పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ అధ్యక్షతన వారి ఇంటి వద్ద మండల స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, రాజోలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గొల్లపల్లి అమూల్య, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పెచ్చెట్టి నరసింహారావు బాబు లు పాల్గొన్నారు. బాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సర్ పై అవగాహన కల్పించుకోవాలని, ఓటర్ జాబితా సవరణలో బిఎల్ఓ లకు బి.ఎల్.ఏ. లకు సహకరించాలని, మన వారి ఓట్లు అన్ని జాబితాలో ఉండేలా జాగ్రత్త వహించాలని కార్యకర్తలను విజ్ఞప్తి చేసారు. ఇదే క్రమంలో పార్టీ శ్రేణులు మన కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజలలోనికి తీసుకువెళ్లాలని, గొడ్డలి పార్టీ చేసే అసత్య ప్రచారాలను తిప్పుకొట్టాలని విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో అమూల్య మాట్లాడుతూ ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని, సర్ కార్యక్రమం 2025 సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని. 2002 లో చివరిసారి జరిగిందని, 2002 ఓటర్ జాబితాతో 2026 ఓటర్ జాబితాని సరి చూస్తారని, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో వలస వెళ్లినవారు, ఆచూకీ లేనివారు, మరణించిన వ్యక్తుల ఓట్లను నకిలీ పేర్లను తొలగించడం ద్వారా ఓట్ల జాబితాలు ప్రక్షాళన చేయడమే ఈ సర్ ముఖ్య ఉద్దేశమని, ఈ క్రమంలో 18 సంవత్సరాలు నిండిన వారు, గతంలో ఓటు నమోదు చేసుకుని వారిని ప్రతి ఒక్కరి పేర్లు నమోదు అయ్యేలా చూడటం దీని లక్ష్యం అని. ప్రతి సంవత్సరము జరిగే సవరణ మాదిరి కాకుండా ఈ ప్రక్రియలో ఓటర్ల తాజా గణన జరుగుతుందని ఆమె అన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్ (బి ఎల్ ఓ) లు యాప్ లో ఫ్యామిలీ ట్రీ ద్వారా ఒక్కో ఓటుని మ్యాప్ చేస్తారని, 2026 ఓటర్ జాబితాను 2002 వాటర్ జాబితాతో మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, మ్యాపింగ్ ఇప్పటికే పూర్తయిందని, తమ తమ బి ఎల్ ఓ లు ఎవరో తెలుసుకుని, మ్యాపింగ్ ఎంతవరకు జరిగింది ఇంకా మ్యాపింగ్ కానీ వాటిని మ్యాపింగ్ చేయించడం మన బాధ్యతని తెలియజేశారు. బి ఎల్ ఓ లు ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు డోర్ టు డోర్ విజిట్ చేసి జూలై 21 నాటికి ముసాయిదా వాటర్ జాబితా విడుదల చేస్తారని, బి ఎల్ ఓ లు డోర్ టు డోర్ వెళ్ళినప్పుడు పార్టీ కార్యకర్తలు వారితో వెళ్లి ఓటర్ వివరాలను కచ్చితంగా ధ్రువీకరించాలని, ఈ క్రమంలో ఏవైనా పేర్ల మార్పు, చిరునామా సవరణలు, మరణించిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లు తొలగింపు వంటి అంశాలపై సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించడానికి పార్టీ కార్యకర్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శిక్షణ తరగతులలో ఓటర్ జాబితా ప్రక్రియపై అనేక విషయాలు చర్చించారు. శిక్షణా తరగతులకు అంతర్వేది పాలెం గ్రామ బిఎల్ఓ హరి హాజరై వారి యొక్క సూచనలు సలహాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు లంకే శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్చార్జ్ తాడి రాము, క్లస్టర్ ఇన్చార్జ్ చెల్లింగి లీలా మోహన్ శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు అనుచూరి రామ పురుషోత్తం, పిన్నమరాజు శ్రీనివాసరాజు, పప్పుల రమేష్, మాజీ సర్పంచ్ రావి ధర్మరాజు, చెల్లుబోయిన నాగబాబు, జయ సూరిబాబు, పోతురాజు కృష్ణ, పులగం రమేష్, బత్తిన గంగాధర్, గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ దొంగలు అరెస్ట్.

### రెండు మోటార్ సైకిల్ స్వాధీనం

. **తాళ్లరేవు, జూన్ 7 (ప్రభాతవార్త):** తాళ్లరేవు మండలం సుంకరపాలెం గ్రామంలో కెటిఎమ్ మోటార్ సైకిల్ శ్రీ వెంకటేశ్వర మోటార్ కార్పొరేషన్ షోరూం లో సుమారు ఐదు లక్షల విలువచేయు రెండు కెటిఎమ్ మోటార్ సైకిల్లను దొంగలించిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ ఎస్ డి పి ఓ దేవరాజ్ మనీష్ పర్యవేక్షణలో కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ ప్రత్యేక టీం ఏర్పాటు చేసి దొంగలను అదుపులోకి తీసుకున్నారు.

## జగ్గన్నతోట ప్రభల తీర్థంనకు అరుదైన గుర్తింపు..

**అంబాజీపేట, జూన్ 7, (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇంటాన్జబుల్ కల్చర్ హెరిటేజ్ ఆఫ్ ఇండియాలో జగ్గన్నతోట ప్రభల తీర్థానికి స్థానం లభించినట్లు గంగలకుర్రు అగ్రహారంకు చెందిన శివకేశవ యూత్ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ సంగీత నాటక అకాడమీ అధికారిక వెబ్ సైట్ లో వరుస సంఖ్య 67లో కేంద్ర ప్రభుత్వం ఈ స్థానాన్ని కల్పించిందన్నారు. శివకేశవ యూత్ ఈ మేరకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారత పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, సంగీత్ నాటక్ అకాడమీ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు ఇందుకు సిఫార్సు లేఖలు అందించిన వారికి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..

## ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారలేదు..



**అంబాజీపేట, జూన్ 7, (ప్రభాతవార్త):** స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం..అంటూ నాలుగు పదుల వయసు దాటిన ఆ పూర్వ విద్యార్థులు చేసిన సందడి ఆ ప్రాంతమంతా మార్మోగింది. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ లో 1999-2000 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు తాము చదివిన పాఠశాలలోనే ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ళ నాటి అనుభూతులను గుర్తు చేసుకుని, ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారలేదు.. అంటూ కేరింతలు కొట్టారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆ పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, క్షేమ సమాచారాలు పంచుకున్నారు. స్నేహ బంధం ఎంతో మధురమైనది జీవితాంతం తరిగిపోదు... చెరిగిపోదు.. మొదటి స్నేహం ఏర్పడేది పాఠశాల స్థాయిలోనే.. చిన్ననాటి స్నేహానుబంధాన్ని ఆత్మీయ కలయిక ద్వారా మరోసారి పంచుకోవడం చాలా సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు తెలిపారు. 25 ఏళ్ల నాటి స్నేహితులను ప్రత్యక్షంగా కలుసుకునేందుకు అమెరికా నుండి సుంకర సృజన, బెంగళూరు నుండి కోటిపల్లి భాను ప్రకాష్, హైదరాబాదుతో పాటు ఇతర ప్రదేశాల నుండి మంథా పద్మజ ప్రియదర్శిని, నామన ప్రసాద్, బండారు లోవ గనిరాజు, బొంతు కృష్ణ, కాండ్రేగుల పెద్దిరాజు తదితరులు విచ్చేశారు. బద్రి నాగేంద్ర, విళ్ల లోవరాజు (బాబు), కొర్లపాటి విజయ్, తిరుమణి మహతి, కుంపట్ల ఆదిలక్ష్మిలు ఆర్గనైజర్స్ వ్యవహరించారు. స్థానిక వ్యవహారాలను పొట్టుపోతు సాయి, కుడుపూడి భూషణం, కోసూరి ప్రసాద్, రాయుడు నగేష్, కాండ్రేగుల గణేష్ లు చక్కబెట్టారు. అంతకుముందు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను బాజా- భజంత్రీలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళంతో ఘనంగా స్వాగతించారు. 15 మంది గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి,విలువైన ఇత్తడి సరస్వతి దేవి విగ్రహాలను బహుకరించారు. అనంతరం అకాల మృతి చెందిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుల జ్ఞాపకార్థం పాఠశాల ప్రాంగణంలో 25 మొక్కలను నాటి అందరికి ఆదర్శంగా నిలిచారు. 25 ఏళ్ల నాటి స్నేహ మాధుర్యాన్ని మరోసారి రుచి చూసిన ఆ పూర్వ విద్యార్థులు భారంగా బాధగా ఒకరి నుండి మరొకరు వీడ్కోలు తీసుకున్నారు. సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు.

# రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి:

## ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు.

**అన్నదాతలతో కలిసి యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే ఆనందరావు.**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్7,ప్రభాతవార్త.** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న'రైతు యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా, అమలా పురంలోని స్థానిక జి.ఎం.సి. బాలయోగి స్టేడియంలో 'రైతు యోగాంధ్ర' అవగాహన,శిక్షణా కార్యక్రమం జరిగింది.ఈవినూత్న కార్యక్రమం లో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి ముఖ్య అతిథులుగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాతల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఈ అద్భుతమైన యోగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పగలు రేయి శ్రమించి దేశానికి అన్నం పెట్టే రైతులకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ పనుల్లో ఎదురయ్యే మానసిక,శారీరక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా ఒక కార్వాన్ మార్గమని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికే కాకుండా, వారి సంపూర్ణ ఆరోగ్యానికి కూడా పెద్దపీట వేస్తోందని, అందులో భాగమే ఈ 'రైతు యోగాంధ్ర' కార్యక్రమమని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క రైతు తమ రోజువారీ జీవితంలో యోగాను ఒక భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి మాట్లాడుతూ జిల్లాలోని రైతులందరికీ యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన స్థానిక రైతులు, ఆర్డీవో,వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ విభాగాల ప్రభుత్వ సిబ్బంది, యోగా శిక్షకులు,కూటమి ముఖ్య నాయకులు పాల్గొని స్వయంగా యోగాసనాలు వేశారు.

## ఘనంగా శ్రీ శివానంద ధ్యానాశ్రయం 20వ వార్షికోత్సవం



**కె.గంగవరం, జూన్ 07, (ప్రభాతవార్త):** కె గంగవరం మండలం సత్యవాడలో ఉన్నటువంటి శ్రీ శివానంద ధ్యానాశ్రయం 20వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు పోలిశెట్టి వెంకటరావు మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణ పరమాత్మ పూజ,గీత పూజ చేసి, భగవద్గీత లోని 18 అధ్యాయాలు భక్తులచే పారాయణం చేయించినట్లు దివ్యానంద స్వామి తెలియజేశారు. జీవితాశయ మోక్షం పొందడానికి చేయవలసిన సాధన గురించి సవివరంగా వివరించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహిళ మండలిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకుమార్ మాస్టారు తో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం యూనివర్సిటీలో ప్రవేశాలకు ఆహ్వానం



**తుని,జూన్ 7,(ప్రభాతవార్త )** శ్రీ కంచి కామకోటి పీఠం శంకరాచార్య స్వాములవారిచే స్థాపించబడి, 33 సంవత్సరాలకు పైగా విజయవంతంగా నిర్వహించబడుతున్న శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహావిద్యాలయం (డీమ్డ్ టు బి యూనివర్సిటీ), కాంచీపురం (కంచి యూనివర్సిటీ)లో 2026--27 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, ఆయుర్వేదం, మేనేజ్‌మెంట్, లా, అలైడ్ హెల్త్ సైన్సెస్ , సంస్కృతం, బి.ఎడ్. అలాగే ఇతర యూజీ, పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కంచి కామకోటిపీఠం ప్రతినిధులు తెలిపారు.తల్లిదండ్రులు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆదివారం తుని పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, ఎం.ఆర్. పేట, గణపతి నగర్‌లో, ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్పాట్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ . జి . శ్రీనివాసు డీన్ (సైన్స్ ) ప్రొపెసర్ . కె . వెంకట రమణ, కంచి కామకోటి శంకరమఠం ప్రతినిధులు పాల్గొని విశ్వవిద్యాలయం, కోర్సులు, ప్రవేశ విధానం, ఉపాధి అవకాశాల గురించి వివరాలను తెలియజేసారు.ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా మెరిట్ స్కాలర్‌షిప్ పద్ధతిలో ప్రవేశాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు శాకాహార భోజనం, జిమ్, ఆధునిక క్రీడా మైదానాలు, ఉత్తమ వసతి సౌకర్యాలు అలాగే ఆకర్షణీయమైన ప్లేస్‌మెంట్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కంచి యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యార్థులలో 70 శాతానికి పైగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారేనని అర్హత అలాగే ఆసక్తి కలిగిన విద్యార్థులకు తక్షణ స్పాట్ అడ్మిషన్లు కూడా కల్పించబడుతున్నట్లు తెలిపారు.

## కెనాల్ బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, జూన్07, (ప్రభాతవార్త)** కొత్తపేట వాడపాలెం ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రెండు కెనాల్ బ్రిడ్జిల పనులను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డుపై కొనసాగుతున్న బ్రిడ్జిల పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు కాగా ఇదే రహదారిపై రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ వీధి దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు

మరిన్ని వార్తలు 6లో

# పలివెల వంతెనపై వాహనాల రద్దీ

## దేవరపల్లిలో విజయవంతమైన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

**1,500 మందికి నేత్ర పరీక్షలు - 1,000 మందికి ఉచిత కళ్లద్దాలు 80 మందికి శస్త్రచికిత్సలు**



దేవరపల్లి, జూన్ 7 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం పరమేశ బయోటెక్ లిమిటెడ్, శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విశేష స్పందనతో విజయవంతంగా ముగిసింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. శిబిరంలో మొత్తం 1,500 మందికి పైగా ఓపీ పరీక్షలు నిర్వహించి వివిధ కంటి సమస్యలను గుర్తించారు. కంటి చూపు లోపాలు, మెల్లకన్ను, కంటి పొర సమస్యలు, మధుమేహం వల్ల కలిగే నేత్ర సమస్యలను వైద్యులు పరీక్షించి తగిన సూచనలు అందించారు. అలాగే 1,000 మందికి ఉచిత కళ్లద్దాలు అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన 50 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా, మరో 30 మంది రోగులను తదుపరి విడతలో ఉచిత శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసినట్లు వైద్య బృందం వెల్లడించింది. వీరికి శ్రీకిరణ్ కంటి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని, సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన వైద్య బృందం, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజాప్రతినిధులకు పరమేశ బయోటెక్ లిమిటెడ్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

## పండూరు చెరువు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ



కాకినాడ రూరల్, జూన్ 7 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామానికి చెందిన చెరువు పనులను ఆదివారం కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పరిశీలించారు. పి ఎం కె ఎస్ వై 2.0 పథకం ద్వారా మంజూరైన రూ 50 లక్షలతో పండూరు చెరువును గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రజల ఆరోగ్యం కొరకు ఆధునిక వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ జిమ్, సిట్టింగ్ బెంచిలు, సోలార్ లైట్లు, ఓపెన్ జిమ్ వంటి వసతులతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పండూరు చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, ఎన్ ఆర్ జి ఎస్ ఏ పి ఓ గణేష్, కూటమి నాయకులు దాసరి శివ, జీని శ్రీనివాస్, పోసిన రాము, పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లరేవు సి.హెచ్.సి. సూపరింటెండెంట్‌గా డాక్టర్ అజయ్.



తాళ్లరేవు, జూన్ 7 (ప్రభాతవార్త): తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సి.హెచ్.సి.) నూతన సూపరింటెండెంట్‌గా వైద్యులు అజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును మర్యాదపూర్వకంగా ఆయన ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలు, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట సి. హెచ్. సి. డైరెక్టర్లు అల్లిలి బాబూరావు, రోళ్ళ చక్రవర్తి, నాయకులు వాకపల్లి చిరంజీవి ఉన్నారు.

## వాడపల్లి నిత్యాన్న పథకానికి రూ ,1,10,116/- లు విరాళం.



ఆత్రేయపురం, జూన్ 07,(ప్రభాత వార్త). ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్యాన్న పథకానికి రావులపాలెం చెందిన తేతలి వెంకట రెడ్డి, లీల సుమ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,10,116/- విరాళంగా అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను, అందజేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు జనసైనికులు సిద్ధంగా ఉండాలి.

**జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్...**



ఆత్రేయపురం, జూన్ 07,(ప్రభాత వార్త). ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకే ఎన్డీఏ కూటమితో ముందుకు సాగాలని కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. మండల పరిధిలో లొల్ల ఐ వి ఆర్ కళ్యాణ మండపం నందు ఆదివారం జరిగిన జనసేన మండల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చేకూరి కృష్ణంరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మండలంలోని 17 గ్రామాల జనసేన నాయకులు కార్యకర్తలు జన సైనికులు, వీర మహిళలు సిద్ధంగా ఉండాలని జనసైనికులు దూసించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గ్రామాలలో రిజర్వేషన్ ద్వారా ఏ అభ్యర్థిని చూసినప్పుడో ఆ అభ్యర్థి ని గెలిపించి మన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. మనం కూటమి ప్రభుత్వంలో మనకు తగిన విధంగా గుర్తింపు లేదని అపోహపడవద్దని అలాగే ఆ పార్టీలో ఉన్నవారు ముందు ఉన్నారు మన వెనుక ఉన్నాము అని ఎలాంటి అభిప్రాయం లేకుండా ఏ గ్రామంలోనైనా ఎన్డీఏ కూటమి నిలబడిన అభ్యర్థినే గెలిపించాలని, మన జన సైనికులు వీర మహిళలు 17 గ్రామాల్లో జనసేన పార్టీ ని బలోపేతంచేసుకునే విధంగా ప్రతి ఒక్క జన సైనికుడు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

---

- ప్రమాదం జరగకముందే మరో వంతెన నిర్మించాలి
- ఈదరపల్లి తరహాలో అదనపు వంతెనకు ప్రజల డిమాండ్

కొత్తపేట, మే04,(ప్రభాతవార్త) పెరుగుతున్న జనాభా రీత్యా వాహనాల సంఖ్య కూడా పెరిగింది పలివెల వంతెన పై వాహనాల రద్దీ పెరిగి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ప్రధాన మార్గం రావులపాలెం నుంచి కొత్తపేట మీదుగా వెళ్ళవలసిందే అమలాపురం బొబ్బర్లంక పంట కాలువపై పలివెల గ్రామం వద్ద వంతెన ఒంటి ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ప్రైవేట్ బస్సు



ట్రావెల్స్ ఆర్టీసీ బస్సు ట్రావెల్స్ చిన్నకారులు లారీలు ఇతర వాహనాలు ద్విచక్ర వాహనాలు ఒకేసారి అటు ఇటు రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది ముఖ్యంగా వంతెన పై బస్సు బస్సు ఎదురయ్యే సమయంలో ప్రయాణికులు ఊపిరి బిగబెట్టుకుని ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది అంబులెన్స్ పాల వాహనాలు తదితర అత్యవసర వస్తువులు వాహనాలు ట్రాఫిక్ లో చిక్కుకుని ఒక్కోసారి గంటల తరబడి ఆలస్యంగా గమ్యానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది

**ఈదరపల్లి తరహాలోనే అదనపు వంతెనకు ప్రజల డిమాండ్**

అమలాపురం ఈదరపల్లి వద్ద ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని అక్కడ ప్రజాప్రతినిధులు నిధులు మంజూరు చేయించి అదనపు వంతెనను నిర్మించారు దాంతో ప్రయాణికుల వాహనాల ట్రాఫిక్ తదితర ఇబ్బందులు లేకుండా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు అలాగే పలివెల లో వంతెన వద్ద కూడా అదనపు వంతెన నిర్మిస్తే ప్రమాదాల జరక్కుండా నివారించవచ్చు అని ప్రజలు కోరుకుంటున్నారు అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో ముందుకు తీసుకు వెళుతున్న ప్రభుత్వం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవతో లొల్లలాకుల నిర్మాణం రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ



దేవాలయాల నిర్మాణాలు ఆధునికరణలు పెద్ద ఎత్తున నియోజకవర్గంలో ప్రారంభించారు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వంతెన పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అదనపు వంతెన నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు ప్రయాణికులు కోరుకుంటున్నారు ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు చేపట్టే కంటే ముందస్తుగా పరిస్థితిని అంచనా వేసి వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

**ఆర్ & బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి రాజేంద్ర వివరణ**

పలివెల వంతెన వద్ద అదనపు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు కొత్తపేట ఆర్ & బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజేంద్ర వెల్లడించారు అయితే బోడిపాలెం వంతెన వానపల్లి వద్ద వంతెన నిర్మాణాల అనంతరం పలివెల వంతెన నిర్మాణం చేపడతారని డి ఈ ఈ రాజేంద్ర తెలిపారు

## చంద్రబాబు వెన్నుపోటుకు నిరసనగా వైసిపి ధర్నా



గొల్లప్రోలు, ప్రభాతవార్త గడిచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి మోసం చేస్తున్నారంటూ గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో వైసిపి ఆందోళన చేపట్టింది. స్థానిక రామాలయం జంక్షన్ వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎంపీ వంగ గీత విశ్వనాథ్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు అరిగెల రామన్నదొర ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ... ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ... ఈ సందర్భంగా వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ... ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ సత్యనారాయణ, ... తదితరులు పాల్గొన్నారు

## నవీన్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



వి.ఆర్.పురం, జూన్ 7,(ప్రభాతవార్త) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన రేఖపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సారా నవీన్ కుటుంబ సభ్యులను, ఆదివారం రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పరామర్శించారు. నవీన్ ఈ నెల 1 వ తేదీన భద్రాచలం నుండి ట్రాక్టర్ పై సామాన్లు వేసుకొస్తుండగా, కూనవరం మండలం, కరకగూడెం గ్రామ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి, రేఖపల్లి లోని నవీన్ ఇంటికి వెళ్ళి అతని భార్య రమ్యశ్రీ ని పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ... ఈ కార్యక్రమంలో ... తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో ఒకరు మృతి



ఆత్రేయపురం, జూన్ 07,(ప్రభాత వార్త). కరెంట్ షాక్ తో మండలంలోని కట్టుంగ గ్రామానికి చెందిన ఈజు దిలీప్, (28) మృతి చెందినట్లు ఎస్ ఐ, ఎస్, రాము తెలిపారు. ఆత్రేయపురం మండల పరిధిలోని కట్టుంగ గ్రామానికి చెందిన ఈజు దిలీప్, (28) ఆదివారం సాయంత్రం నూతనంగా నిర్మిస్తున్న తన ఇంటి ని తడపడానికి వెళ్లి ఇంటి లో కరెంట్ షాక్ కొట్టగా అక్కడికక్కడే మృతి చెందినట్లు తన తండ్రి జాన్సన్ ఈ విషయం పై ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. ఎస్. రాము తెలిపారు.

## విత్తనబంతులతోనే గ్రీన్ బెల్ట్ సాధ్యం



శంఖవరం జూన్ 7 ప్రభాతవార్త విత్తన బంతులు ద్వారానే గ్రీన్ బెల్ట్ సాధ్యమని అన్నవరం ఎస్ఐ శ్రీ హరిబాబు పేర్కొన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్ర రావు ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గా రాం ప్రసాద్ ఆదేశాల మేరకు అన్నవరం, మండపం, పెరుపాక గ్రామస్తులకు, మిన్నస్వ కొండ అటవీశాఖ క్యాంపు కార్యాలయం వద్ద విత్తన బంతుల తయారీ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సై శ్రీ హరిబాబు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పచ్చదనంతోనే .. వక్షతి నిండి వుంటుందని, విత్తన బంతులతో .. గ్రీన్ బెల్ట్ సులభం సాధ్యమని పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన నీరు గాలి అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు అటవీశాఖ ఆధ్వర్యంలో విత్తన బంతులు తయారీ ద్వారా ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలని పేర్కొన్నారు. ... ఈ కార్యక్రమంలో శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాంబాబు నాగేశ్వరావు ఎఫ్ బి ఓ పూసం లావణ్య పి.పి. రమణ బేస్ క్యాంప్ హెల్పర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మిగులు భూములను పేదలకు పంచాలి



సీతానగరం, జూన్ 07, (ప్రభాతవార్త) : ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలని సీపీఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. ఆదివారం లంకూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి సీతానగరం బస్టాండ్ సెంటర్ వరకు సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ.. మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ మిగులు భూములు ఉన్నా, పేదలకు అప్పగించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల హామీని నెరవేర్చి దళితులు, గిరిజనులు, పేద వర్గాల ఆర్థిక పరిపుష్టికి పాటుపడాలని అధికారులు చొరవ చూపాలని కోరారు. భూముల పంపిణీ జరగని పక్షంలో కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పలివెల లోకేష్, కండెల్లి ఏసుబాబు, కురుకూరి కృపమ్మ, తవిటికి సునీత, పలివెల జ్యోతి, నందమూరి చిట్టి స్వామి, దొల్ల పాపారావు, వరదా దుర్గాప్రసాద్, సిద్దే నాగరాజు, వేటూరి నానాజీ, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



అనపర్తి జూన్ 7 (ప్రభాత వార్త ) గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం దుప్పలపూడి గ్రామంలో 75 లక్షల రూపాయలతో ఐదు చోట్ల నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీరా రామచంద్రపురం నుంచి దుప్పలపూడి మీదుగా అనపర్తి వివేకానంద విగ్రహం వరకు వెళ్ళు రహదారి మూడున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ రోడ్ లో ప్రయాణం చేయాలంటే అత్యంత కష్టపడే పరిస్థితి ఉండేదని తెలిపారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా భావించి కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతూ ఉందని వివరించారు. ఒక్కటిని కొంతమంది వక్ర దృష్టితో చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి మండల కూటమి నాయకులు, దుప్పలపూడి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సఖినేటిపల్లి మండల బిజెపి కార్యకర్తల సమావేశం....



సఖినేటిపల్లి జూన్ 7, (ప్రభాత వార్త): డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం శృంగవరప్పాడు గ్రామంలో మాజీ వెంకట్రావు పండు ఇంటి వద్ద మండల పార్టీ అధ్యక్షులు పోతురాజు సురేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ప్రత్యేక సవరణ చట్టంపై పూర్తిస్థాయిలో కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. గ్రామాలలో ఉన్న సమస్యలను వెలికి తీసి పార్టీ యొక్క జనతా వారధి కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరించాలని, ... కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని ప్రచారం చేయాలని ఆయన అన్నారు. ... ఈ సమావేశంలో నాయకులు చంపాటి శివరామకృష్ణంరాజు, మాలే వెంకటరావు పండు, పోతురాజు నాగరాజు, ... తదితరులు పాల్గొన్నారు.

## కె.పెదపూడి గ్రామదేవత ఆలయాభివృద్ధికి రూ.50 వేలు విరాళం..



అంబాజీపేట, జూన్ 7, (ప్రభాతవార్త): మండలంలోని కె.పెదపూడి గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి ఆలయాభివృద్ధికి పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి కో-కన్వీనర్, మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ (డీవీ) రూ.50 వేలను విరాళంగా ఆదివారం అందజేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డివి పుట్టినరోజు సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేలను ఆదివారం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించాలని డీవీ కమిటీ సభ్యులను కోరారు. ... ఈ కార్యక్రమంలో ... తదితరులు ఉన్నారు.

---

## తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ వార్త



## ప్రపంచ తెలుగు మహాసభల్లో కొత్తపేట కవులకు సత్కారం



కొత్తపేట, జూన్07,(ప్రభాతవార్త) ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో కొత్తపేట కవులను ఘనంగా సత్కరించారు చైతన్య సారస్వత పరిషత్ శ్రీ శ్రీ కళావేదిక సంయుక్తాధ్వర్యంలో జూన్ 6 7 తేదీల్లోఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో రెండు రోజులపాటు నిర్వహించారు అందులో కవి సమ్మేళనాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏకపాత్రలు ప్రపంచ స్థాయిలో నిర్వహించారు పద్య కవితా సమ్మేళనంలో కొత్తపేటకు చెందిన డాక్టర్ వి వి ఎస్ సుబ్బారావు తెలుగు కీర్తి సౌరభాలు అనే పద్య కవితాన్ని వినిపించారు అలాగే మండల పరిధిలోని వాడపాలెం గ్రామానికి చెందిన కవయిత్రి వాసంశెట్టి కృష్ణవేణి ఆడపిల్లలు సృష్టికర్తలు అనే వచన కవిత్వాన్ని ఆలపించారు భావోద్వేగ కవితలు ఆలపించిన డాక్టర్ సుబ్బారావు కృష్ణవేణి లను సంస్థ అధినేతలు చైతన్య రాజు కళాకృష్ణ కత్తిమండ ప్రతాప్ కుమార్ జి ఈశ్వరి భూషణం పార్థసారథి తదితరులు కవులను ఘనంగా సత్కరించారు

## 20 నుండి 30 వరకు చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజుల జాతర



వి.ఆర్.పురం, జూన్ 7, ప్రభాతవార్త మండలం కేంద్రం రేఖపల్లి గ్రామంలో నాయక పోడు ఆదివాసీ గిరిజనులు, కొండారెడ్ల ఇలవేల్పు దేవతలైన చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజుల జాతర, ఈ నెల 20 నుండి 30 వరకు పదిరోజుల పాటు వైభవంగా జరుగునుంది. రంపచోడవరం జిల్లాలో అత్యంత పెద్ద జాతరలో ఈ జాతర ఒకటి. ప్రతీ రెండేళ్ల కొకసారి జరిగే కొర్రాజుల జాతరకు ఇక్కడ పెట్టింది పేరు. ఈ జాతర నాయకపోడు గిరిజనులు, కొండారెడ్ల ఆచార సాంప్రదాయాల నడుమ జరుగుతుంటుంది. చిన్న సార్లమ్మ, పెద్ద సార్లమ్మ, కొర్రాజులు రెండు గిరిజన తెగల ఇలవేల్పు దేవతలు అయినప్పటికీ, ఈ జాతరలో కుల, మతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు పాల్గొనటం ఇక్కడ విశేషం.

## యువ కవి శేఖర్ కు సాహిత్య వేదికపై ఘన సత్కారం



రావులపాలెం, జూన్ 07 (ప్రభాతవార్త) : రాజమహేంద్రవరం గ్లోబల్ యూనివర్సిటీ లో గత రెండు రోజులుగా జరిగిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలలో రావులపాలెం మండలం లక్ష్మీ పోలవరం కు చెందిన యువకవి, తెలుగు ఉపాధ్యాయులు కట్టల శేఖర్ పాల్గొని తెలుగు భాష వైభవం, విశిష్టతను తన గళం ద్వారా వినిపించారు. భావితరాలకు తెలుగు భాషను అందించవలసిన బాధ్యత ప్రత్యేక అందరిపై ఉందన్నారు. కవి సమ్మేళనం, కవితలు ,జానపద పాటలు మొదలైన విభాగాల్లో పాల్గొని తనదైన శైలిలో ప్రసంగించారు. మమ్మీ డాడీ అనే ఆంగ్ల పదాలు విడిచి అమ్మానాన్న అని ఆప్యాయంగా తెలుగులో పిలవాలన్నారు. ఈ సందర్భంగా శేఖర్ ను మహాసభల్లో సాహిత్య వేదికపై ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ యూనివర్సిటీ వీసీ కే వి వి సత్యనారాయణ రాజు కళారత్న కత్తిమండ ప్రతాప్, ఆదిరెడ్డి అప్పారావు, కవి బాలచందర్, తెలుగు రాష్ట్రాల కవులు రచయితలు పరిశోధకులు ప్రముఖులు, పాల్గొన్నారు

## ఎంఎల్ఏ వరుపులకు ఘన స్వాగతం



,రౌతులపూడి. జూన్ 6 (ప్రభాత వార్త) మండల గ్రామం గిడజంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ కు ఘన స్వాగతం పలికారు. విదేశీ పర్యటన ముగించుకుని మొదటి సారిగా మండల పర్యటనకు వచ్చిన ఎం ఎల్ ఏ వరుపులకు రౌతులపూడి సొసైటీ డైరెక్టర్ తంటాపురెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్య క్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు తంటాపురెడ్డి వెంకటరమణ, పండుల తాతారావు, బండారు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps